ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

రాజమహేంద్రవరం
: fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

25-6-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 145 పేజీలు: 8+4 వెల: 6.50


భారీ వర్షాలతో ముంబయి అతలాకుతలం

నిర్మాణంలోని గోడౌన్ కూలి 8 మంది మృతి

5లో

# జొన్నగిరి ఇక స్వర్ణగిరి

## 'బంగారు' చరిత్రకు మళ్లీ ప్రాణంపోసిన సిఎం చంద్రబాబు

రూ. 405 కోట్ల గోల్డ్‌మైన్స్ ప్రాజెక్టును ప్రారంభించిన సిఎం

దేశంలోనే తొలి ప్రైవేటు బంగారు గని

తొలియేడాదే 400 కిలోల బంగారం ఉత్పత్తి



బుధవారం జొన్నగిరి బహిరంగ సభలో ప్రసంగిస్తున్న సిఎం చంద్రబాబు

**తుగ్గలి,జూన్ 24,ప్రభాతవార్త:** రాయలసీమ నేలలో శతాబ్దాలుగా దాగి ఉన్న బంగారు చరిత్రకు మళ్లీ ప్రాణం పోసే ఘట్టానికి తుగ్గలి మండలం జొన్నగిరి వేదికగా నిలిచింది. ఒకప్పుడు విజయనగర సామ్రాజ్య కాలం నుంచి బంగారు నిల్వలకు ప్రసిద్ధి చెందిన ఈప్రాంతం కాలగర్భంలో తన వైభవాన్ని కోల్పోయినా.. నేడు మళ్లీ స్వర్ణగిరిగా పునర్జన్మ పొందిందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. జియో మైసూర్ సర్వీసెస్ లిమిటెడ్ డెక్కన్ గోల్డ్ మైన్స్ సంస్థల ఆధ్వర్యంలో రూ.405 కోట్ల వ్యవయంతో నిర్మించిన జొన్నగిరి గోల్డ్ మైన్స్ ప్రాజెక్టును సి.ఎం.చంద్రబాబు నాయుడు, స్థానిక ఎమ్మెల్యే కెఇ శ్యామ్‌కుమార్‌తో పాటు జియో మైసూర్ ప్రాజెక్టు మేనేజింగ్ డైరెక్టర్ ప్రభాకరన్, డెక్కన్ గోల్డ్ మైన్స్‌సంస్థల డైరెక్టర్ కార్తికేయన్‌తో కలిసి ప్రారంభించారు. ముందుగా సి.ఎం.చంద్రబాబు గోల్డ్ మైనింగ్ ప్రాంతాన్ని పరిశీలించారు. మొదటి యూనిట్‌ను ప్రారంభోత్సవం చేసి రెండవ యూనిట్‌ను శంకుస్థాపన చేసి ప్రారంభించారు.

అనంతరం గనుల నుంచి వెలికి తీసిన బంగారాన్ని సిఎం పరిశీలించి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సంధర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సి.ఎం.చంద్రబాబు మాట్లాడుతూ భారతదేశంలోని తొలి ప్రైవేట్ బంగారు గని జియో మైసూర్ జొన్నగిరి గోల్డ్ ప్రాజెక్టు అని అన్నారు. జొన్నగిరి పేరు ఇకపై దేశవ్యాప్తంగా స్వర్ణగిరిగా గుర్తింపు పొందనుంది అన్నారు. చరిత్రను >>2

# 12 మంది కేంద్ర మంత్రులకు ఉద్వాసన?



● ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించే అవకాశం ● ఇద్దరు సీనియర్లకు గవర్నర్ పదవులు ● రేపోమాపో విస్తరణ!

**న్యూఢిల్లీ,జూన్ 24:** ప్రధాని మోడీ 4.0 టార్గెట్‌గా అడుగులు వేస్తున్నారు. ప్రభుత్వం పార్టీలో కీలక మార్పులకు సిద్ధం అయ్యారు. కేంద్ర కేబినెట్ ప్రక్షాళనకు ముహూర్తం ఫిక్స్ అయింది. ఎన్డీఎ భాగస్వామ్య పక్షాలతో పాటుగా ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. 12 మంది మంత్రుల తొలగింపు దాదాపు ఖరారైంది. ఇద్దరుసీనియర్లకు గవర్నర్ పదవులు ఇవ్వనున్నారు. ఇప్పటికే రాష్ట్రపతిని కలిసిన ప్రధాని కేంద్ర కేబినెట్ ప్రక్షాళనపైన సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై కసరత్తు వేగవంతం అయింది. మంగళవారం సాయంత్రం ప్రధాని మోడీ రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలుసుకుని కీలక సమాలోచనలుజరిపారు. మరోవైపు ఇద్దరు కేంద్ర మంత్రుల రాజ్యసభ పదవీకాలం ముగిసినా వారిని తిరిగి ఎంపికచేయలేదు. వీరిలో ఒకరు బుధవారం మంత్రి పదవికి రాజీనామా చేశారు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ఈ నెల 26 లేదా 27న ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. కేంద్ర క్యాబినెట్ భేటీలో పార్లమెంట్ సమావేశాలపై నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి. కేరళకు చెందిన కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జార్జి కురియన్ బుధవారం తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. రాజ్యసభ పదవీకాలం ఈ నెల 21న ముగిసింది. ఆయనను కేంద్రం తిరిగి నామినేట్ చేయలేదు. మరోవైపు రైల్వే శాఖ సహాయ మంత్రి రవనీత్ >>2

# నెల్లూరు జైలుకు సిఐ నాగరాజు

●14 రోజుల రిమాండ్ ● సాయికృష్ణది లాకప్ డెత్ అనడానికి ఆధారాలు : సిట్

**విజయవాడ,జూన్24,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిలో సంచలనం సృష్టించిన గాదె సాయికృష్ణ లాకప్‌డెత్ కేసులో సిఐ నాగరాజుకు 14 రోజుల రిమాండ్‌ను విజయవాడ జ్యూడిషియల్ కోర్టు విధించింది.ఆయనను అదుపులోకి తీసుకుని సిట్ విచారించింది.అతనిపై అభియోగాలకు ఆధారాలుండటంతో అధికారికంగా అరెస్ట్ ప్రకటించారు. అతన్ని న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచేందుకు పోలీసులు >>2



బుధవారం నాగరాజును జైలుకు తరలిస్తున్న పోలీసులు

## రాజధానిలో ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల పర్యటన

**విజయవాడ,జూన్ 24,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం ప్రజా రాజధాని అమరావతి అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించింది. ప్రపంచ బ్యాంకు దక్షిణాసియా ఉపాధ్యక్షుడు జోహన్నెస్ జుట్, లీడ్ ట్రాన్స్‌పోర్ట్ స్పెషలిస్ట్ అండ్ టీటీఎల్ (అమరావతి ఇంటిగ్రేటెడ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ (ఎఐయూడిపి) గెరాల్డ్ పాల్ ఒలివర్, ఎడ్యుకేషన్ స్పెషలిస్ట్ సౌమ్య బజాజ్ లతో కూడిన బృందం అమరావతిలో >>2

# లారీని ఢీకొన్న ఆటో



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో

పెళ్లి బృందంలోని నలుగురు దుర్మరణం, ఏడుగురికి తీవ్ర గాయాలు

పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం

2లో




*Applicable T&C available at your nearest dealership. Ex-showroom price ₹13 99 900 for Grand Vitara Aspirion Edition, exclusively available in the Zeta (O) and Alpha (O) variants. Creative visualisation. Images used are for illustration purposes only. Features and accessories shown may not be part of the standard fitment. Black glass shade on the vehicle is due to lighting effect. Offers may vary and are subject to availability of stock. Maruti Suzuki India Limited reserves the right to discontinue an offer without further notice. Finance options available at the sole discretion of financier.

# తుంగభద్ర కొత్తగేట్లు నేడు ప్రారంభం

## హాజరుకానున్న ముగ్గురు సిఎంలు చంద్రబాబు, రేవంత్, డికె శివకుమార్



**అనంతపురం, జూన్ 24, (ప్రభాత వార్త బ్యూరో):** ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ ఉమ్మడి ప్రాజెక్టు తుంగభద్ర జలాశయం నూతన గేట్లను గురువారం లాంఛనంగా ప్రారంభించేందుకు సర్వం సిద్ధమైంది. తక్కువ కాలంలోనే అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఎన్నో యేళ్ల పాత గేట్ల స్థానంలో కొత్త గేట్లను అమర్చిన చారిత్రాత్మక ఘట్టాన్ని ఆవిష్కరించేందుకు ముగ్గురు రాష్ట్ర ముఖ్యమంత్రులు హాజరవుతుండడం ప్రాధాన్యత సంతరించుకుంది. దక్షిణ భారత దేశంలోనే అత్యంత కీలకమైన అంతర్రాష్ట్ర సాగునీటి ప్రాజెక్టు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల జీవనాడి అయిన తుంగభద్ర జలాశయం (టిబి డ్యామ్) సరికొత్త రికార్డుకు వేదిక కాబోతోంది. డ్యామ్‌కు కొత్తగా అమర్చిన 33 క్రెస్ట్ గేట్లను (స్పిల్‌వే గేట్లు) ఈ నెల 25న మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సంయుక్తంగా ప్రారంభించనున్నారు. ఈ అరుదైన చారిత్రక ఘట్టానికి కర్ణాటకలోని కొప్పల్ జిల్లా మునిరాబాద్ (డ్యామ్ పరిసర ప్రాంతం) సర్వం సిద్ధమైంది. ఈ నూతన గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్, తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిలతో పాటు కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సిఆర్ పాటిల్ హాజరవుతున్నారు. ఈ ప్రారంభోత్సవం కార్యక్రమం అనంతరం హొసపేటలో భారీ బహిరంగ సభ కూడా జరగనుంది. ఇందుకు టిబి డ్యాం అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. గతేడాది ఆగస్టు 2024 తేదీన వచ్చిన భారీ వరదలకు డ్యామ్‌కు చెందిన 19వ నంబర్ క్రెస్ట్ గేట్ చైన్ తెగి కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో ఎపి ప్రభుత్వ చొరవతో, ప్రముఖ నీటిపారుదల నిపుణుడు కన్నయ్య నాయుడు ఆధ్వర్యంలో యుద్ధప్రాతిపదికన తాత్కాలికంగా 'స్టాప్‌లాక్' గేటును ఏర్పాటు చేసి దాదాపు 80 టిఎంసిల నీరు వృధా కాకుండా కాపాడారు. ఆ తర్వాత నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సిఫార్సుల మేరకు.. 73 ఏళ్ల నాటి పాత గేట్ల స్థానంలో అన్ని గేట్లను మార్చాలని నిర్ణయించారు. రూ. 51 కోట్ల వ్యయంతో కేవలం 6 నెలల స్వల్ప వ్యవధిలోనే మొత్తం 33 క్రెస్ట్ గేట్లను చైన్ లింక్ వ్యవస్థను విజయవంతంగా పునరుద్ధరించి ఇంజనీర్లు సరికొత్త రికార్డు సృష్టించారు. తుంగభద్ర డ్యామ్ భద్రత అనేది ఎపి లోని రాయలసీమకు అత్యంత కీలకం. అనంతపురం జిల్లాకు హెచ్ఎల్సీ ద్వారా, కర్నూలు జిల్లాకు ఎల్ఎల్సీ ద్వారా తుంగభద్ర జలాశయం నుంచి నీరు తాగునీటికి ,సాగునీటికి అందుతుంది. మంచినీరు పథకాలు ఎన్నో ఈ నీరు ఆధారంగా పనిచేస్తాయి. టిబి డామ్ నూతన గేట్ల ఏర్పాటుతో రాబోయే 55 నుండి 60 ఏళ్ల పాటు డ్యామ్ భద్రతకు ఎటువంటి ఢోకా ఉండదని, వరదల సమయంలో నీటి నిర్వహణ మరింత సులభతరం అవుతుందని అధికారులు, నీటిపారుదల నిపుణులు చెబుతున్నారు.మూడు రాష్ట్రాల మధ్య నీటి పంపకాల సమన్వయానికి ఈ ఉమ్మడి వేదిక ఒక మంచి పరిణామంగా నిలవనుంది అని చెప్పవచ్చు.. ఈ కార్యక్రమానికి ముగ్గురు రాష్ట్ర ముఖ్యమంత్రి లు హాజరవుతున్న నేపథ్యంలో అనంతపురం, బళ్లారి జిల్లాలకు ఎంతో ఉపయోగపడే సమాంతర కాలవ విషయం చర్చిస్తే బాగుంటుంది. తుంగభద్ర జలాశయం పై భాగంలో భారీ వర్షాలు వచ్చి డ్యాం నిండిన తర్వాత వృధాగా వెళ్లే వరద నీటిని వినియోగించుకునేందుకు సమాంతర కాలువ అనే ప్రతిపాదన దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉంది.. సమాంతర కాలవకు భూసేకరణ చేయడం ఇబ్బందిగా ఉంటుందని కొందరు వాదిస్తున్నప్పటికీ వెలుగుబడిన రాయలసీమ జిల్లాలు, కర్ణాటకలోని బళ్లారి, తదితర జిల్లాల కోసం వరద నీటిని ఉపయోగించుకునేందుకు సమాంతర కాలవ ప్రతిపాదనపై ముగ్గురు ముఖ్యమంత్రిలు సమంత అధికారులతో కలిసి ప్రాథమిక చర్చలు జరపాలని, ఈ విషయంలో ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవ తీసుకోవాలని రాయలసీమ జిల్లాల రైతులు ఆశిస్తున్నారు.



బుధవారం విజయనగరంలో గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజును కలిసిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్

## గోవా గవర్నర్ అశోక్ గజపతి రాజును కలిసిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**విజయనగరం, జూన్ 24 ప్రభాతవార్త:** గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతి రాజును విజయనగరం గవర్నర్ బంగ్లాలో బుధవారం సాయంత్రం రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. 15 నిమిషాల పాటు సమకాలీన రాజకీయాలపై చర్చించారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో పాటు విజయనగరం జిల్లా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రులకు ఉద్వాసన?

>> సింగ్ రాజ్యసభ పదవీకాలం కూడా ఈ నెల 21నే ముగియగా ఆమెను కూడా రాజ్యసభకు తిరిగి ఎంపిక చేయలేదు.ఇక కేంద్ర రవాణా, రహదారులు, కార్పొరేట్ వ్యవహారాల సహాయ మంత్రి హర్ష మల్హోత్రాను గత నెలలో ఢిల్లీ బిజెపి అధ్యక్షుడిగా నియమించారు. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరికి చాలా కాలం క్రితమే ఉత్తరప్రదేశ్ రాష్ట్ర బిజెపి బాధ్యతలు అప్పగించారు. ఈ పరిణామాలన్నింటి నేపథ్యంలో మంత్రివర్గంలో మరికొందరికి ఉద్వాసన తప్పదని, చాలా మంది కొత్తవారికి అవకాశాలు కల్పిస్తారని చర్చ జరుగుతోంది.

నీట్ పరీక్షలో ఆరోపణలు ఎదుర్కొంటున్న మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను సైతం తప్పించనున్నారు. ఆప్ నుంచి బిజెపిలో చేరిన రాఘవ్ చద్దాతో పాటుగా బీహార్ మాజీ సిఎం నితీశ్ కేబినెట్‌లో చేరనున్నారు. పంజాబ్‌లో ఉన్న బిజెపి చీఫ్ నితీన్ నబీన్ హుటా హుటిన ఢిల్లీ చేరుకున్నారు. మిత్రపక్షాలకు ఈ సారి ప్రాధాన్యత పెరిగేలా మార్పులు ఉంటాయని చెబుతున్నారు. దీంతో ఈ రోజు కేంద్ర కేబినెట్ తరువాత కేబినెట్ ప్రక్షాళన పైన పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## నెల్లూరు జైలుకు సిఐ నాగరాజు

>> కోర్టుకు తరలించారు. కోర్టుకు తరలించడానికి ముందు విజయవాడ మాజీ సిఐ నాగరాజుకు వైద్య పరీక్షలు చేశారు. వైద్య పరీక్షల అనంతరం నాగరాజును పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. కోర్టు అతన్ని రాజమహేంద్రవరం జైలుకు తరలించాలని ఆదేశించింది.అయితే ఆ జైలులో అదనంగా రిమాండ్ ఖైదీని ఉంచడానికి తగిన అవకాశాలు లేనందున నెల్లూరు జైలుకు తరలింపునకు పోలీసు విజ్ఞప్తి మేరకు కోర్టు ఆదేశించింది. ఆయనను నెల్లూరు జైలుకు తరలించారు. ఇక కోర్టుకు సిట్ సమర్పించిన నాగరాజు రిమాండ్ రిపోర్ట్‌లో సాయికృష్ణను కస్టోడియల్ డెత్ చేసినట్టు భావిస్తున్నామని స్పష్టం చేసింది. సాయి కృష్ణ శవాన్ని మాయం చేసినట్టు గుర్తించామని తెలిపింది. ఈ నెల 2 కంటే ముందే సాయి కృష్ణ మరణించాడని భావిస్తున్నామని పేర్కొంది. సాయి కృష్ణ మృతికి సంబంధించిన అన్ని ఆధారాలు నాగరాజు ధ్వంసం చేశారు. సైంటిఫిక్ ఎవిడెన్స్‌ను చెరిపి వేయటంతో సాయి కృష్ణ చనిపోయాడని గుర్తించామని సిట్ తెలిపింది. కస్టడిలో ఉండగానే సాయి కృష్ణ మరణించాడనే దానికి ఆధారాలు ఉన్నాయని రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు..సిఐ కోర్టు ను కూడా తప్పుదోవ పట్టించారని సిట్ స్పష్టం చేసింది.,సాయికృష్ణది లాకప్‌డెత్ అనే విషయాన్ని దాచేందుకు సాయికృష్ణ శవాన్ని మాయం చేసినట్లు సిట్ తన నివేదికలో పేర్కొంది. శవాన్ని పూడ్చిపెట్టడమో, తగులబెట్టడమో చేసేందుకు యత్నించినట్లు స్పష్టం చేసింది. సాయికృష్ణ శవం ఇంకా లభించలేదన్న సిట్ ఏం చేశారనే దానిపై దర్యాప్తు చేయాల్సి ఉందని తెలిపింది. ఇది చాలా సంక్లిష్టమైన కేసు అని దర్యాప్తునకు మరింత సమయం అవసరమని రిమాండ్ రిపోర్టులో సిట్ స్పష్టం చేసింది.సిఐ నాగరాజు దర్యాప్తునకు సహకరించడం లేదని తెలిపింది.

తప్పుడు సమాధానాలతో దర్యాప్తును నాగరాజు పక్కదారి పట్టిస్తున్నట్లు పేర్కొంది. సాయికృష్ణను మే 6న మార్కాపురంలో పట్టుకుని కృష్ణలంకకు తీసుకొచ్చినట్లు సిట్ తెలిపింది. చట్టవిరుద్ధంగా సాయికృష్ణను పోలీస్ కస్టడీలో ఉంచినట్లు స్పష్టం చేసింది. కస్టడీకి అప్పగించిన తర్వాత సాయికృష్ణ ఆచూకీ తెలియలేదని వెల్లడించింది. సిసి ఫుటేజీలను ఉద్దేశపూర్వకంగా డిలీట్ చేసినట్లు సిట్ స్పష్టం చేసింది. గత నెల 6వ తేదీ నుంచి 8వ తేదీ మధ్య సాయికృష్ణను పిఎస్‌లో చూసినట్లు ఎస్ఐ చెప్పారంది. సాయికృష్ణపై పాత కేసులు, నాన్‌బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపింది. సాయికృష్ణ పిఎస్‌లో అపస్మారక స్థితిలో ఉండటం చూశానని తల్లి తెలిపిందని స్పష్టం చేసింది. మే1 నుంచి జూన్ 1 వరకు కృష్ణలంక పిఎస్‌లో సీసీటీవీ ఫుటేజీ లభించలేదని రిపోర్టులో సిట్ పేర్కొంది.

పిఎస్‌కు వచ్చాక సాయికృష్ణ తన సెల్‌ఫోన్‌ను నాగరాజుకు అప్పగించారంది. సాయికృష్ణను సిఐ నాగరాజు మేజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టలేదని వివరించింది. సాయికృష్ణ తీవ్రగాయాలతో లాకప్‌లో ఉండటం తల్లి చూసిందని సిట్ తెలిపింది. సిఐ నాగరాజు హైకోర్టుకు తప్పుడు సమాచారం ఇచ్చారంది. సాయికృష్ణ తమ కస్టడీలో ఉన్నాడనే విషయం నాగరాజు దాచిపెట్టారని సిట్ పేర్కొంది. నాగరాజు కావాలనే ఆధారాలను నాశనం చేశాడని స్పష్టమైందని సిట్ వెల్లడించింది. ఈ కేసులో మరి కొందరు పోలీసు సిబ్బందిని అరెస్ట్ చేసే అవకాశం ఉందని సమాచారం.

## ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల పర్యటన

>> పర్యటించింది.ప్రపంచ బ్యాంకు బృందం తొలుత ఏపీసీఆర్‌డీఏ ప్రాజెక్టు కార్యాలయాన్ని సందర్శించింది. అమరావతి సమగ్ర పట్టణాభివృద్ధి ప్రాజెక్టు కింద చేపడుతున్న పనుల పురోగతిపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంది. ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు అమరావతిలో చేపడుతున్న ట్రంక్ రోడ్ల నిర్మాణం, గ్రావిటీ కెనాల్ అభివృద్ధి, ఇతర కీలక మౌలిక సదుపాయాల పనులను పరిశీలించారు. సంబంధిత అధికారులు ఆయా సైట్ల వద్ద పనుల పురోగతిని ప్రపంచ బ్యాంకు బృందానికి వివరించారు.అనంతరం ప్రపంచ బ్యాంకు బృందం ఎస్ఆర్ఎమ్ యూనివర్సిటీని సందర్శించింది. ఏపీసీఆర్‌డీఏ సోషల్ డెవలప్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో.. యూనివర్సిటీలో ఉచితంగా నిర్వహిస్తున్న స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమాలను పరిశీలించింది. శిక్షణలో చేరిన అభ్యర్థులతో అమరావతిలో లభించే ఉపాధి అవకాశాలపై ప్రపంచ బ్యాంకు బృందం పరస్పర చర్చ నిర్వహించింది.

## లారీని ఢీకొన్న ఆటో

### పెళ్లి బృందంలోని నలుగురు దుర్మరణం, ఏడుగురికి తీవ్ర గాయాలు

**పాకాల, జూన్ 24 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా పాకాల మండలం పరిధిలోని పూతలపట్టు – నాయుడుపేట జాతీయ రహదారిపై బుధవారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. గాదంకి గ్రామం వద్ద గల ఫారెస్ట్ చెక్ పోస్ట్ ముందు జరిగిన ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులు దుర్మరణం పాలవ్వగా, ఆటో డ్రైవర్‌తో సహా మరో ఏడు మంది తీవ్రంగా గాయపడ్డారు. బెంగళూరు నుంచి ప్లైవుడ్ లోడుతో శ్రీకాళహస్తి సమీపంలోని చింపేడు గ్రామంలో గల కట్టెల ఫ్యాక్టరీకి వెళ్తున్న లారీ డ్రైవర్ షేక్ బాజీ బాబా (47 సూర్యాపేట, తెలంగాణ), బుధవారం మధ్యాహ్నం 1 గంటల ప్రాంతంలో ఎలాంటి ఇండికేటర్లు వేయకుండా జాతీయ రహదారిపై ఒక్కసారిగా సడన్ బ్రేక్ వేసి లారీని నిలిపివేశాడు. అదే సమయంలో యాదమర్రి మండలం పెరుమాలపల్లి గ్రామం నుంచి తిరుపతిలో జరుగుతున్న తమ బంధువుల వివాహ వేడుకకు వెళ్లేందుకు ప్రయాణికులతో వస్తున్న ఆటో లారీ సడన్‌గా ఆగడంతో అదుపుతప్పి వెనుక వైపు నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న చిత్తూరు జిల్లా తవణంపల్లి మండలం ఏనుగుంటపల్లి గ్రామానికి చెందిన యనమల మాధవి (40), ఆమె కుమార్తె మేఘన (15) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మిగిలిన ప్రయాణికులను, ఆటో డ్రైవర్‌ను స్థానికులు వెంటనే అంబులెన్స్ ద్వారా తిరుపతిలోని రుయా ఆసుపత్రికి తరలించారు. రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇద్దరు మరణించారు, యాదమర్రి మండలం పెరుమలపల్లి గ్రామానికి చెందిన పులకింటి రాజశేఖర్ (25), పులకింటి బేబీ (50) అనే వారి పరిస్థితి విషమించి కన్నుమూశారు. దీంతో ఈ ప్రమాదంలో మొత్తం మృతుల సంఖ్య నాలుగుకి చేరింది.ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పులకింటి నవీన్ (14), కొమ్ము విష్ణు (19), ఎనుమల సూరి (17), పులకింటి చిన్నబ్బ (50), పులకింటి రఘు (55), చాముండేశ్వరి (30)లతో పాటు ఆటో డ్రైవర్ పులకింటి సుబ్రమణ్యం (50) ప్రస్తుతం రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా, ఎలాంటి ముందస్తు హెచ్చరిక సూచికలు (ఇండికేటర్లు) లేకుండా వాహనాన్ని రోడ్డుపై సడన్‌గా ఆపడమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాద ఘటనపై మృతుల, బాధితుల బంధువుల నుంచి ఫిర్యాదు తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

## మంగళగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న డిప్యూటీ సిఎం పవన్

**విజయవాడ జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** గుంటూరు జిల్లా మంగళగిరిలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ దర్శించుకున్నారు. బుధవారం ఉదయం ఆలయానికి చేరుకుని స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పానకాన్ని నైవేద్యంగా సమర్పించారు. అనంతరం ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేసి స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు. తొలుత ఆలయం వద్దకు చేరుకున్న పవన్‌కు దేవాదాయశాఖ అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు.

## సివిల్ సర్వీసు రూల్స్‌లో సవరణలు

### 1991 జీఓలో మార్పులు చేస్తూ ఉత్తర్వులు

**విజయవాడ జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ సవిల్ సర్వీసెస్ రూల్స్‌లో సంస్కరణలు చేశారు. అందుకు అనుగుణంగా గెజిట్ వెలువడింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 309 నిబంధన ద్వారా ఇవ్వబడిన అధికారాలను మరియు దీనికి వీలు కల్పించే అన్ని ఇతర అధికారాలను వినియోగించుకుంటూ ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ నియమాలు 1991కు జి.ఓ.ఎంఎస్. నెం.487, జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్, 1992 సెప్టెంబర్ 14న జారీ చేయబడింది. మరియు జులై 1, 1992 తేదీ నాటి ఆంధ్రప్రదేశ్ గెజిట్ యొక్క పార్ట్-1, నెం.235 అసాధారణ సంచికలో ప్రచురించబడింది. తరువాత కాలానుగుణంగా సవరించబడింది. నిబంధనకు మొదటి మరియు రెండవ నిబంధనల కోసం పేర్కొన్న నియమాలలోని నియమం 9లో, దుర్వినియోగం, లంచం, ద్వివి వాహం, అవినీతి, నైతిక అశాంతి, నకిలీ పత్రాలు మహిళలు అణకువను అవమానించడం వంటి నిరూపితమైన అన్ని కేసులలో సేవ నుండి తొలగింపు శిక్ష విధించబడుతుంది.

## ఇంటింటికీ ప్రచారం కార్యక్రమం జులై 10కి వాయిదా: మంత్రి లోకేష్

**విజయవాడ, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రత్యర్థి(గొడ్డలి) పార్టీ తప్పుడు ప్రచారాలను, కువిమర్శలను సమర్థవంతంగా తిప్పికొట్టాలని తెలుగుదేశం పార్టీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ పిలుపు ఇచ్చారు. నేతలు, గత ప్రభుత్వంలో బూతు మంత్రులు కృష్ణా జిల్లా పరువు ఎలా తీశారో, ప్రస్తుతం విషప్రచారాలు ఎలా చేస్తున్నారో ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత కేడర్‌పై ఉందని నారా లోకేష్ కార్యకర్తలకు విజ్ఞప్తిచేశారు. మోపిదేవిలో నిర్వహించిన టిడిపి కార్యకర్తల సమావేశంలో లోకేష్ మాట్లాడుతూ మహనీయులు జన్మించిన ఈ జిల్లాలో గత ప్రభుత్వంలో బూతుల మంత్రి ఉండేవారు, ఒకడు కార్యకర్తలను ఇబ్బంది పెట్టేవాడు. మరొకడు భువనేశ్వరమ్మను అవమానించేవాడు. నేను ఆనాడేచెప్పా, వారి పేర్లు ఎర్ర బుక్కులో రాస్తున్నాని. వారివిషయంలో ఎవరికీ ఎటువంటి అనుమానాలు అవసరం లేదు, రెడ్ బుక్ తన పని తాను చేస్తుందని అన్నారు.

**జులై 10నుంచి ఇంటింటికీ ప్రచారం:**

ఇంటింటికీ ప్రచార కార్యక్రమాన్ని జులై 10వ తేదీ నుంచి ప్రారంభిస్తాం. సర్ ప్రక్రియ కొనసాగుతున్నందున ఈ కార్యక్రమాన్ని వాయిదా వేశాం. సర్ ప్రక్రియపై అలసత్వం వద్దు, ప్రతిఓటు విలువైనది. అవనిగడ్డలో కమిటీలు పెండింగ్‌లో ఉన్నాయి, యుద్ధప్రాతిపదికన పూర్తిచేయండి. కొన్ని విషయాల్లో అధికారులు దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు నా దృష్టికివచ్చింది, 24గంటల్లో సరిచేయాలని ఆదేశించాం. దొంగ కేసులను సహించబోను. మంత్రి, జోనల్ కోఆర్డినేటర్‌తో మాట్లాడాను. కార్యకర్తలను కాపాడుకోవాల్సిన బాధ్యత నాపై ఉంది. త్వరలో నియోజకవర్గానికి అందరికీ ఆమోదయోగ్యమైన ఇన్‌చార్జిని వేస్తామని చెప్పారు.

## సమాజంలో మార్పు తెచ్చేందుకే విద్యాశాఖను ఎంచుకున్నా!: మంత్రి లోకేష్

**విజయవాడ, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** సమాజంలోమార్పు తెచ్చేందుకే నేను అత్యంత కఠినమైన విద్యాశాఖను ఎంచుకున్నాను. దీనిని నేను ఛాలెంజ్‌గా స్వీకరించాను. విద్యావ్యవస్థలో మార్పు తేవడం ఉపాధ్యాయుల సహకారంతోనే సాధ్యమవుతుంది. దేశంలోనే ఆదర్శవంతంగా ఎపి మోడల్ ఎడ్యుకేషన్ తీసుకురావాలన్నది నా ధ్యేయం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, అధికారుల సమష్టి కృషితోనే ఇది సాధ్యమవుతుందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. అవనిగడ్డ నియోజకవర్గం మోపిదేవి మండలం కొక్కిలిగడ్డలో పి4 పథకంలో భాగంగా దాతల సహకారంతో రూ.1.4 కోట్లతో నూతనంగా నిర్మించిన జెడ్పీ హైస్కూలు నూతన భవనాలను మంత్రి లోకేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా లోకేష్ కొక్కిలిగడ్డ హైస్కూలు ఉపాధ్యాయులతో మాట్లాడుతూ గత రెండేళ్లలో విద్య వ్యవస్థలో సంస్కరణలన్నీ పూర్తి చేశాం, ఇక ఉపాధ్యాయులంతా పూర్తిగా ఫలితాలపైనే శ్రద్ధ వహించాలని సూచించారు.

# జొన్నగిరి ఇక స్వర్ణగిరి

>> తిరగ రాస్తున్న స్వర్ణగిరి జొన్నగిరి ప్రాంతానికి బంగారంతో అనుభంధం కొత్తది కాదని సిఎం గుర్తు చేశారు. శతాబ్దాల క్రితమే ఈ ప్రాంతంలో బంగారు ఆనవాలు ఉన్నాయని, పురాతన కాలం నుంచి ఈ నేల ఖనిజ సంపదకు నిలయంగా నిలిచిందన్నారు. అయితే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పెట్టుబడులు, పరిశ్రమల సహకారంతో ఇప్పుడు ఆ చరిత్రను మళ్లీ వెలికి తీసే సమయం వచ్చిందన్నారు. ఒకప్పుడు దేశంలో బంగారు గనులు అంటే కర్ణాటకలోని కెజిఎఫ్ గురుకు వచ్చేది. ఇప్పుడు భారతదేశంలోనే బంగారు ఉత్పత్తి ఎక్కడ జరుగుతుందంటే జొన్నగిరి అంటే మన స్వర్ణగిరి పేరు వినిపించాలి అని సిఎం ఆకాక్షించారు. బంగారు మాత్రమే కాదు....భవిషత్తును వెలికితీసే ప్రాజెక్టు రూ.405 కోట్ల పెట్టుబడితో 1500 ఎకరాలలో ఏర్పాటు చేసిన ఈ ప్రాజెక్టు ద్వారా తొలి యేడాది 400 కిలోలు, రెండవ ఏడాది 900 కిలోల బంగారం ఉత్పత్తి చేయనున్నట్టు ఆయన తెలిపారు. భవిషత్తులో 50 వేల కిలోల వరకు బంగారం ఉత్పత్తి చేసే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఇది కేవలం గనుల ప్రాజెక్టు మాత్రమే కాదని రాయలసీమ ఆర్థిక కొలంబనకు బలమైన పునాది అని సిఎం వివరించారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టులో 800 మందికి ఉపాధి లభించగా, రానున్న కాలంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా మరో 5 వేల మందికి పైగా ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు సిఎం వెల్లడించారు. ఒకప్పుడు రాయలసీమ గురించి మాట్లాడప్పుడు గతంలో కరువు, వలసలు, వెనుకబాటుతనం ప్రాస్థావనకు వచ్చేదని ఇకపై పరిశ్రమలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు, బంగారు గనులు చర్చకు వస్తాయని సి.ఎం.అన్నారు. స్వర్ణగిరి ప్రాజెక్టు ఆ మార్పుకు ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. స్వర్ణగిరి ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పేల జొన్నగిరి గోల్డ్ మైన్స్ ప్రాజెక్టు రాష్ట్రానికే కాకుండా దేశానికి గర్వకారణంగా మారిందని సిఎం తెలిపారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో గనుల నిర్వాహణ జరగాలని, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తునే ఉత్పత్తి పెంచాలని ఆయన సూచించారు. స్వర్ణగిరి పేరు ప్రపంచవ్యాప్తంగా వినిపించాలి. ఈ ప్రాంత యువతకు ఉపాధి, రాష్ట్రానికి అదాయం, దేశానికి బంగారం అంధించే కేంద్రంగా ఇది ఎదగాలి అని సిఎం పిలుపు నిచ్చారు. జొన్నగిరి గోల్డ్ మైన్స్ ప్రారంభంతో రాయలసీమ చరిత్రలో మరో కీలక ఆధ్యాయం ఆరంభమైందని అభిప్రాయం వ్యక్తం అవుతుంది. ఒకప్పుడు మట్టిలో దాగిన సంపదగా ఉన్న బంగారం ఇప్పుడు అభివృద్ధి, ఉపాధి, ఆర్థిక ప్రగతికి ప్రతీకగా మారబోతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాటల్లో చెప్పాలంటే, జొన్నగిరి కాదు.. స్వర్ణగిరి అనే నినాదం ఇకపై ఈ ప్రాంత భవిషత్తుకు గుర్తింపుగా నిలువనుందని పేర్కొన్నారు. అనంతరం సి.ఎం.చంద్రబాబు జ్యులరీషాపు యజమానులకు జియో మైసూర్ సర్వీసు ప్రైవేట్ లిమిటెడ్ ఎం.డి.ప్రభాకరన్ చేతుల మీదుగా బంగారు బిస్కెట్లను అందజేశారు. అలాగే సిఎంకు జియో మైసూరు సర్వీసు కంపెనీ యాజామాన్యం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చిత్రపటంతోకూడిన బంగారు చిత్రపటాన్ని సిఎంకు బహుకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు, పరిశ్రమల శాఖా మంత్రి టిజి భరత్, మైనింగ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపి బస్తిపాటి నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వర్‌రెడ్డి, ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి, ఎమ్మెల్సీ బీటి నాయుడు, జిల్లా కలెక్టర్ డాక్టర్.ఎ.సిరి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, ముఖేషకుమార్ మీనా, జియో మైసూరు ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం జనరల్ మేనేజర్ బాలాజి, రాజేష్, పలువరు టిడిపి నాయకులు పాల్గొన్నారు.



వెలికితీసిన బంగారాన్ని పరిశీలిస్తున్న సిఎం చంద్రబాబు

## మత్స్యకార కుటుంబాలను ఆదుకొంటాం

### పులిగడ్డలో వారి కష్టసుఖాలను తెలుసుకొన్న మంత్రి లోకేష్



పులిగడ్డ పల్లె వేణిపాయలో మత్స్యకారులతో కలిసి వల విసురుతున్న మంత్రి లోకేష్

**విజయవాడ,జూన్ 24, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో మత్స్యకార కుటుంబాలకు ప్రజాప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ భరోసా ఇచ్చారు. బుధవారం కృష్ణా జిల్లా పర్యటనలో భాగంగా అవనిగడ్డ మండలం పులిగడ్డ పల్లెపాలెంలోని మత్స్యకార కుటుంబాలతో నారా లోకేష్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పులిగడ్డ పల్లెపాలెంలోని నాయుడు వెంకటేశ్వరరావు, ఆయన సతీమణి మోనిక, సింగోతు సుధీర్, సతీమణి శివపార్వతితో పాటు ఎస్.నరసింహస్వామి, కే.మశేన్ రావులతో మాట్లాడారు.

**వల విసిరి చేపల వేట..**

పులిగడ్డలోని మత్స్యకార కుటుంబాలతో కలిసి వేణిపాయలో మంత్రి నారా లోకేష్ స్వయంగా పడవలోప్రయాణించారు. మత్స్యకారుల జీవనస్థితిగతులను మంత్రి ప్రత్యక్షంగా పరిశీలించారు. బోట్ల తయారీ, వినియోగం, చేపల వేట, అమ్మకం, ఆదాయం, కుటుంబ స్థితిగతులు, సమస్యలు తెలుసుకున్నారు. చేపలవేటనిషేధ సమయంలో ప్రజాప్రభుత్వం అందిస్తున్న మత్స్యకార భరోసాపైనా మంత్రి ఆరా తీశారు.

**పడవ కొనుగోలుకు రూ.2.50 లక్షలు..**

చిన్న పడవల కొనుగోలుకు ఒక్కో పడవకు రూ.2.50 లక్షలు, పెద్ద పడవకు రూ.7.50 లక్షల వరకు వ్యయం అవుతుందని మత్స్యకారులు మంత్రికి వివరించారు. ఇక్కడపెద్ద బోట్లు నడవవని, చిన్న బోట్లను మాత్రమే వినియోగిస్తామని తెలిపారు. నెల్లూరులో బోట్లు తయారీ ఉందని వివరించారు. ఉదయం 2 నుంచి 3 గంటల సమయంలో చేపల వేటకు బయలుదేరి 9 గంటలకు తిరిగివస్తామని తెలిపారు. వలల్లో 15 రకాలు ఉంటాయని, వలలో పడిన చేపలను స్థానిక కంపెనీలకు విక్రయిస్తామన్నారు. కుటుంబానికి నెలకు రూ.20వేల వరకు సంపాదన ఉంటుందని, గ్రామంలో 300 మంది వరకు మత్స్యకారులు ఉన్నారని చెప్పారు. తమ గ్రామంలో ప్రస్తుతం రిజిస్టరైన చిన్నబోట్లు 60,, పెద్దబోట్లు 15 వరకు ఉన్నాయని వివరించారు.

## వారం - వర్జ్యం

25-06-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, ఆరుద్ర కార్తె
ఏకాదశి రా.8.11, స్వాతి సా.4.31
వర్జ్యం : రా.10.45-రా.12.32
మ.ఉ.9.58-ఉ.10.50, 2) మ.3.13-సా.4.05
శుభసమయం : ఉ.8.00-9.00
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** బంధువుల నుండి ధన, వస్తు లాభాలు పొందుతారు. సేవా కార్యక్రమాలలో లాభాలు పొందుతారు. శుభవార్తలు అందుకుంటారు.

**వృషభం:** ఉన్నత పదవులలో ఉన్నవారితో పరిచయాలు ఏర్పడతాయి. స్పెకులేషన్స్ లాభిస్తుంది. ఋణాలు తీరుస్తారు.

**మిథునం:** ఎక్కువ అనుకూల వాతావరణం నెలకొని ఉండటం ఆనందానికి కారణం అవుతుంది. ఆస్తి వివాదాలు తీరుతాయి.

**కర్కాటకం:** నూతన కాంట్రాక్టులు కైవసం చేసుకుంటారు. అనుకున్న పనులు దిగ్విజయంగా నెరవేరుస్తారు.

**సింహం:** దూరపు ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. స్థిరాస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతారు. వాహన సౌఖ్యం.

**కన్య :** శ్రమకు ఓర్చి మీ వంతు సహాయం అందిస్తారు. ఇంటియందు జరిగే శుభకార్యాలలో స్వల్ప విభేదాలు తలెత్తే సూచన.

**తుల:** సంతాన ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసుకోవలసి వస్తుంది. ముఖ్యమైన వ్యవహారాలు సాఫీగా పూర్తి చేస్తారు.

**వృశ్చికం:** ఊహించని రీతిలో అవకాశాలు దగ్గరకు వస్తాయి. సద్వినియోగం చేసుకోండి. స్థలాలు కొనుగోలు చేస్తారు.

**ధనుస్సు:** ఎవరినీ లెక్కచేయక మీ పనిని సక్రమంగా నిర్వహించి వృత్తిలో లాభపడతారు. మానసిక ప్రశాంతతను కలిగిస్తుంది.

**మకరం:** వ్యవహారాలలో తొందరపాటు వద్దు. ఈ రోజు పాతమిత్రులను కలుసుకొని ఆనందంగా గడుపుతారు. వాహనసౌఖ్యం.

**కుంభం:** విదేశీయానానికి చేసే ప్రయత్నాలు అనూహ్యంగా ముందడగు వేస్తాయి. వాతావరణాన్ని అనుకూలంగా మలచుకుంటారు.

**మీనం:** సాంప్రదాయాలకు విలువనిచ్చి పాతకాలపు మనిషిగా ముద్రపడతారు. మధ్యవర్తిగా పేరు గడిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# నేషనల్ రేర్ డిసీజెస్ పాలసీ అమలుకు పటిష్ట చర్యలు: మంత్రి సత్యకుమార్

**విజయవాడ, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపిలో "నేషనల్ రేర్ డిసీజెస్ పాలసీ" సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఆర్థిక స్తోమత లేకపోయినా, వ్యాధి అరుదైనదైనా ప్రతి రోగికీ వైద్యం అందాలన్నదే ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు. అరుదైన వ్యాధులను ముందే గుర్తించేందుకు రాష్ట్రంలో 'యూనివర్సల్ నియోనాటల్ స్క్రీనింగ్' ప్రారంభించినట్లు తెలిపారు. ప్రత్యేక వైద్యం, పరిశోధనల కోసం ఎపిలో మూడు 'సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్' కేంద్రాలను గుర్తించామని, విశాఖ, విజయవాడ (ఎస్ఎంసి), తిరుపతిలో సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పరిశోధనల కోసం పిఎస్‌యు, సిఎస్ఆర్ నిధుల వినియోగంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని డిఎంఇ అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. కేంద్ర జాబితాలో లేని 'హంటింగ్‌టన్స్ వ్యాధి'పై కూడా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. పాలసీ అమలులో కేరళ వంటి రాష్ట్రాల ఉత్తమ పద్ధతులను అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. బాధితుల ఆర్థిక భరోసా కోసం ప్రత్యేక నిధుల ఏర్పాటు అంశాన్ని సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

# 'స్పైడర్'లో సైకో విలన్‌గా జగన్ ప్రవర్తన

● మదనపల్లెలో ఫైళ్ల దగ్ధం కేసులో సిఐడి దర్యాప్తు ముగిసింది: మంత్రి అనగాని విమర్శలు



**తిరుపతి, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** అభివృద్ధిలో దూసుకెళుతున్న రాష్ట్రంలో ఏ ఇద్దరు నేతలు కలిసి ఉన్నా వైసిపి నేత జగన్ భరించలేకపోతున్నారని రాష్ట్రమంత్రి, తిరుపతి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ ఘాటైన విమర్శలు చేశారు. కులాలు, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టడమే గొడ్డలి పార్టీ లక్ష్యమని మండిపడ్డారు. మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయం ఫైళ్ల దగ్ధం కేసులో సిఐడి దర్యాప్తు పూర్తి కావచ్చిందని వెల్లడించారు. జగన్ ప్రవర్తన చూస్తుంటే మహేశ్ బాబు 'స్పైడర్' సినిమాలో సమాజంలో ఇబ్బందులు చూసి ఆనందించే సైకో విలన్‌లాగా అనిపిస్తోందని అన్నారు. ప్రభుత్వ భూములను, రికార్డులను మాయం చేసేందుకు అప్పట్లో జరిగిన ఈ భారీ కుట్రకు కారకులైన పెద్దల ముసుగులు త్వరలోనే తొలగిపోతాయని, బాధ్యులపై అత్యంత కఠినమైన చట్టపరమైన చర్యలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో త్వరలోనే అత్యంత పారదర్శకంగా భూముల రీ సర్వే 2.0 ప్రారంభించబోతున్నట్లు మంత్రి అనగాని ప్రకటించారు. వివాదాల్లో ఉన్న ప్రతి భూమిని న్యాయపరంగా పరిష్కరించి రైతులకు భరోసా ఇస్తామన్నారు. ఏడాది కిందట జరిగిన దామినేడు భూ వ్యవహారాన్ని వైసీపీ నేతలు ఇప్పుడు ఉద్దేశపూర్వకంగానే తెరపైకి తెచ్చారని మండిపడ్డారు. తిరుపతిలో కూటమి నిర్వహించిన బహిరంగ సభ సూపర్ సక్సెస్ కావడంతో ఓర్వలేక తనపై, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, అక్కడ భూములు కొనుగోలు చేసిన వ్యక్తికి తమకు ఎలాంటి సంబంధం లేదని మంత్రి తేల్చిచెప్పారు. తప్పుడు ప్రచారం చేసిన వారిపై ఇప్పటికే లీగల్ కేసులు పెట్టామని అన్నారు. బుధవారం తిరుచానూరులో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ప్రారంభించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. 2029 నాటికి కాదు కదా 2049 నాటికి కూడా గొడ్డల పార్టీ అధికారంలోకి రాదని సంచలన వ్యాఖ్యలు చేశారు. మాకు మరో మూడేళ్లు అధికారం ఉందన్న విషయం గొడ్డల పార్టీ నేతలు గుర్తుంచుకోవాలని మంత్రి గుర్తుచేశారు. చట్ట ప్రకారం మాత్రమే వెళ్లాలన్న సిఎం చంద్రబాబు వైఖరి కారణంగానే గొడ్డలి పార్టీ నేతలు బతికి పోతున్నారని అనగాని ఘాటుగా స్పందించారు.

## తిరుమల సమాచారం




### భోగశ్రీనివాసుడికి ప్రత్యేక సహస్రకలశాభిషేకం

**తిరుమల, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలోని పంచబేరాలలో ఒకటైన భోగశ్రీనివాసమూర్తిని పల్లవరాణి సామవై ప్రతిష్టించిన రోజు గుర్తుగా బుధవారం ఉదయం ఆలయంలో భోగశ్రీనివాసమూర్తికి ప్రత్యేక సహస్రకళశాభిషేకం నిర్వహించారు. ఆలయం లోపల గరుడాళ్వార్ సన్నిధిలో శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామి, భోగశ్రీనివాసమూర్తిని, విశ్వక్సేనులను కొలువుదీర్చారు. శ్రీనివాసమూర్తికి ముందు గరుడాళ్వార్ సన్నిధిలో అబిముఖంగా కౌతుకమూర్తి భోగశ్రీనివాసమూర్తిని, ఆయనకు అభిముఖంగా విశ్వక్సేనుల వారిని ఉంచారు. అనంతరం మూలమూర్తిని భోగశ్రీనివాస మూర్తికి కలుపుతూ దారంకట్టి అనుసంధానం చేశారు. భోగశ్రీనివాసమూర్తికి నిర్వహించే అభిషేకాది క్రతువులు మూలమూర్తికి నిర్వహించినట్లు అవుతుంది. అనంతరం వేదపండితులు వేదపారాయణం చేయగా, అర్చకులు ప్రత్యేక సహస్రకళశాభిషేకం వైభవంగా జరిపించారు. ఆర్జితసేవలన్నీ యధావిధిగా జరిగాయి. ఈ కార్యక్రమంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి దంపతులు, జెఇఒ డాక్టర్ ఎ.శరత్, సివిఎస్ఒ మురళీకృష్ణ, ప్రధాన అర్చకుడు వేణుగోపాల్ దీక్షితులు, డిప్యూటీ ఇఒ లోకనాథం, పేష్కార్ రామకృష్ణ, పారుపత్తేదార్ హిమత్‌గిరి, ఏవిఎస్ఒ రాజశేఖర్ పాల్గొన్నారు.

### పద్మసరోవరంలో నేటి నుండి పద్మావతి అమ్మవారి తెప్పోత్సవాలు

**తిరుమల, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో వార్షిక తెప్పోత్సవాలు నేటి నుండి 29వ తేదీ వరకు ఐదు రోజులపాటు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ప్రతిరోజూ సాయంత్రం 6.30 గంటల నుండి రాత్రి 7.30 గంటల వరకు పద్మసరోవరంలో సుందరంగా అలంకరించిన తెప్పలపై విహరిస్తూ పద్మావతి అమ్మ భక్తులకు దివ్య దర్శనమివ్వనున్నారు. తొలిరోజు గురువారం సాయంత్రం రుక్మిణి, సత్యభామ సమేత కృష్ణస్వామి తెప్పోత్సవంలో మూడు ప్రదక్షిణలు పవిత్ర పుష్కరిణిలో జరుగుతుంది. 26న సుందరరాజస్వామి తెప్పోత్సవంలో మూడు ప్రదక్షిణలు, మూడవరోజు 27 నుండి 29 వరకు పద్మావతి అమ్మవారి తెప్పోత్సవం నిర్వహిస్తారు. 27న మూడు ప్రదకిణలు, 28న ఐదు ప్రదక్షిణలు చివరగా 29న ఏడు ప్రదక్షిణలు జరుగుతాయి. 27, 28, 29 తేదీలలో పద్మసరోవరంలోని నీరాడ మండపంలో మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 4.30 గంటల వరకు అమ్మవారికి తిరుమంజనం ఘనంగా నిర్వహించనున్నారు. జూన్ 28వ తేదీ రాత్రి 8.30 గంటలకు గజవాహన సేవ, జూన్ 29వ తేదీ రాత్రి 8.30 గంటలకు గరుడవాహన సేవ వైభవోపేతంగా జరుగనున్నాయి. తెప్పోత్సవం అనంతరం ప్రతిరోజూ ఆలయ మాడవీధుల్లో అమ్మవారి ఉత్సవమూర్తుల ఊరేగింపు నిర్వహించనున్నారు. తెప్పోత్సవాల సందర్భంగా ఐదు రోజుల పాటు నిర్వహించే కల్యాణోత్సవం, ఊంజల్‌సేవలను, జూన్ 26న నిర్వహించే లక్ష్మీపూజ కూడా టిటిడి రద్దు చేసింది.




# 'మన మిత్ర'తో కాసుల వర్షం

● వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఆలయాలకు రూ.22.26 కోట్ల రాబడి ● మే నెలలోనే రూ.12.91 కోట్ల ఆదాయం ● దర్శనం, సేవల టికెట్ల ద్వారానే 10.69 కోట్లు ● 30శాతం టికెట్లను మనమిత్ర ద్వారానే బుక్ చేసుకుంటున్న భక్తులు ● ఆలయాల వద్ద మనమిత్ర కోసం ప్రత్యేక సేవా కేంద్రాలు ● మనమిత్రకు పెరుగుతున్న ఆదరణ

**విజయవాడ, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజలకు ఎలాంటి అంతరాయాలు లేకుండా కేవలం వారి మొబైల్ ఫోనులోని వాట్సాప్ ద్వారానే అన్ని సేవలు అందించాలన్న సదాశయంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ఇప్పుడు రాష్ట్రంలోని ప్రధాన ఆలయాలకు కాసుల వర్షం కురిపిస్తోంది. తిరుమల శ్రీవారి ఆలయం మినహా రాష్ట్రంలోని దేవాదాయశాఖ పరిధిలో ఉన్న 21 ప్రధాన ఆలయాలకు మనమిత్ర ద్వారా దర్శనం, సేవల టికెట్ల బుకింగ్ చేసుకునే భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఈ ఆలయాలకు మనమిత్ర ద్వారా ఇప్పటి వరకు రూ.22.26 కోట్ల ఆదాయం సమకూరింది. ఇందులోనూ గత మే 11వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకు నెల రోజుల వ్యవధిలోనే వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఈ ఆలయాలకు రూ.12.91 కోట్ల ఆదాయం సమకూరింది. ఆలయాల్లో దర్శన టికెట్లు, ఆర్జిత సేవా టికెట్లు, తలనీలాల సమర్పణ, ఈ హుండీ ద్వారా కానుకలు సమర్పించడం ద్వారా ఆలయాలకు ఈ ఆదాయం సమకూరింది.

**ఆరు ఆలయాలకు అధిక ఆదాయం:** ఈ 21 ఆలయాల్లో ఆరు ప్రధాన ఆలయాలకు మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అధిక ఆదాయం సమకూరింది. శ్రీకాళహస్తిలోని శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆయలానికి భక్తులు మనమిత్ర ద్వారా బుక్ చేసుకున్న దర్శనం, సేవలు, తలనీలాలు, ఈహుండీ కానుకల రూపేణా నెల రోజుల్లో రూ.3.39 కోట్ల మేర ఆదాయం సమకూరింది. అన్నవరం శ్రీవీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం ఆలయానికి రూ.2 కోట్లకుపైగా ఆదాయం సమకూరింది. శ్రీశైలం శ్రీ భ్రమరాంభ మల్లిఖార్జున స్వామి దేవస్థానానికి రూ.1.77కోట్లు, ద్వారకా తిరుమలలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంకు రూ.1.54 కోట్లు, విజయవాడ శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివారి దేవస్థానానికి 1.53 కోట్లకుపైగా ఆదాయం సమకూరింది. వీటి తరువాత స్థానంలో సింహాచలం శ్రీ వరాహలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానానికి రూ.1.04 కోట్ల మేర మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా సమకూరింది. వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆయలానికి కూడా మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా భారీగానే ఆదాయం సమకూరింది. ఈ ఆలయానికి నెలలో రూ.66.11 లక్షల ఆదాయం మనమిత్ర ద్వారా వచ్చింది.

**30శాతం టికెట్లు మనమిత్ర ద్వారానే..:** రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల్లో 30శాతం మేర దర్శనం, సేవల టికెట్లు మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారానే బుక్ అవుతున్నాయి. ఆలయాలు దర్శించాలనుకుంటున్న ప్రజానీకానికి మనమిత్ర చాలా హాయిగా మారింది. మామూలుగా అయితే ఆలయాల వద్ద రద్దీలో దర్శనం, సేవా టికెట్ల కోసం గంటల కొద్ది నిరీక్షించాల్సి వచ్చేంది. ఇప్పుడు అలా కాకుండా భక్తులు తమ చేతిలోని సెల్‌ఫోన్‌లో మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా కేవలం హాయ్ అని మెసేజ్ పంపితే చాలు, వారు వెళ్లాలనుకున్న ఆలయం వివరాలు, అక్కడ దర్శనం, సేవా టికెట్ల అందుబాటు అందులో చూపించేస్తుంది. వాట్సాప్‌లోనే దర్శనం, సేవా, తలనీలాల టికెట్లు బుక్ చేసుకుని వాటి పిడిఎఫ్‌లు కూడా అందులోనూ డౌన్‌లోడు చేసుకుంటున్నారు. దీనివల్ల మనమిత్ర వాడే భక్తులు తాము వెళ్లదలచిన ఆలయం వద్ద పెద్దగా వేచి చూడాల్సిన అవసరం లేకుండా పోతోంది.

**మనమిత్ర సేవా కేంద్రాలు:** రాష్ట్రంలోని కొన్ని ఆలయాల వద్ద మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా టికెట్లు బుక్ చేసుకున్న భక్తుల సౌకర్యార్థం ప్రత్యేకంగా మనమిత్ర సేవా కేంద్రాలు ఏర్పాటు చేశారు. దీంతో మనమిత్ర ద్వారా టికెట్లు బుక్ చేసుకున్న భక్తులు మనమిత్ర సేవా కౌంటర్లకు వద్దకు వెళ్లి అక్కడ మనమిత్ర భక్తుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యూలైన్లలో త్వరితగతిన దర్శనం ముగించుకుని వచ్చేస్తున్నారు. ఆలయాలు సందర్శించాలనుకునే ప్రజలు, భక్తులకు మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ అత్యంత సులభ సాధనంగా మారింది. ఎవ్వరినీ అడగాల్సిన అవసరం లేకుండా తమ మొబైల్ నుంచే కేవలం ఒక్క హాయ్ అన్న సందేశం పంపితే చాలు ఆలయాల సేవలన్నీ వారి చేతిలోని మొబైల్ లోనే తెలుసుకుని అక్కడి నుంచే టికెట్లు బుక్ చేసుకోగలుగుతున్నారు. రాబోయే రోజుల్లో మనమిత్ర ద్వారా ఆలయాలకు మనమిత్ర ద్వారా టికెట్ల బుకింగ్ సంఖ్య మరింత పెరిగే అవకాశాలున్నాయని ఆర్‌టిజిఎస్, దేవాదాయశాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# తిరుమలను తాకిన నీటిఎద్దడి

● హోటళ్లకు, స్థానికులకు తప్పని క'న్నీళ్లు' కష్టాలు ● నాలుగురోజులకోసారి సరఫరాతో కటకట




**తిరుమల, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** తీవ్ర వర్షాభావ పరిస్థితులు... వేసవిసెలవులు ముగిసినా కొనసాగుతున్న భక్తుల తాకిడితో తిరుమలలో నీటి ఎద్దడి అనివార్యమైంది. ఇప్పటికే తిరుమలలోని ఐదు ప్రధాన జలాశయాల్లో ఉన్న నీరు మరో 75రోజులకు సరిపడే మాత్రమే ఉండటంతో వాణిజ్య అవసరాలకు (హోటళ్ళకు, ఫాస్ట్‌పుడ్ కేంద్రాలకు), స్థానికులు నివాసముంటున్న బాలాజీనగర్ వాసులకు, హెచ్‌టి ప్రాంతం, డిబిరోడ్డు, ఆర్‌బి సెంటర్‌లో నివాసముంటున్న వారికి నీటి కష్టాలు మొదలయ్యాయి. చాలావరకు తిరుమలలో నీళ్ల వృధా కాకుండా పరిరక్షించడానికి పబ్లిక్ కొళాయిలు కూడా తొలగించేశారు. దానికి బదులు తిరుమల వాసులకు ఇళ్లకే నేరుగా కొళాయి కనెక్షన్స్ ఇచ్చి నీటిని సరఫరా చేస్తున్నారు. గత మూడునెలలుగా తీవ్ర వేసవితో వర్షాభావ పరిస్థితులతో కొండపై నీటికి ఇబ్బందులు తలెత్తాయి. ముందుచూపుతో టిటిడి అధికారులు తిరుమలలో కాపురాలుంటున్న స్థానికులకు, హెచ్‌టి కాంప్లెక్స్, షాపింగ్ కాంప్లెక్స్, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ మార్గంలోని హోటళ్ళకు కూడా రేషన్ విధానం అమలుచేసి నీటిని నాలుగు రోజుల కోసారి సరఫరా చేస్తున్నారు. ఇలా సరఫరా అవుతున్న నీటిని పట్టుకుని మళ్ళీ నీళ్ళు వచ్చేవరకు వాటినే వినియోగించుకోవాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. 2025లోనే తీవ్రనీటి ఎద్దడి పరిస్థితులు తలెత్తాయి. అప్పట్లోనే టిటిడి అధికారులు ప్రైవేట్ నీళ్ళట్యాంకర్లపై ఆధార పడాలని స్థానికులకు సూచించారు. ఈ విషయంపై "వార్త"ప్రధానంగా నీటి కష్టాలు ప్రచురించడంతో స్పందించిన సిఎం చంద్రబాబునాయుడు తిరుమలకు నీటి ఎద్దడి రాకుండా చూడాలని అదికారులను ఆదేశించారు. మళ్ళీ ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు ఎదురవడంతో స్థానికులు నీటి కష్టాలు చవిచూస్తున్నారు.

**నాలుగు రోజులకోసారి నీళ్ళే శరణ్యం:** తిరుమలలో అనాదికాలం నుండి బాలాజీనగర్, ఆర్‌బి సెంటర్‌లో స్థానికులు నివాసముంటున్నారు. వీరంతా కొండపైనే పలు రకాలుగా వ్యాపారాలు చేసుకుని జీవనం సాగిస్తున్న వారే. సుమారు 1,100వరకు ఇళ్ళు ఉన్నాయి. ఐదువేలమందివరకు జనాభా ఉన్నారు.వీరికి రోజుకు ఒక్కొక్కరికి 10లీటర్ల నీరు అవసరం అనుకున్నా రోజుకు సరాసరి 2లక్షల లీటర్ల నీరు వినియోగమవుతుంది. నెలరోజుల నీటి సరఫరాకు ఇంటికి వందరూపాయలు టిటిడి వసూలుచేస్తోంది. ఇదీ నామమాత్రపు బిల్లు అయినా వేసవిలో మాత్రం నీటికి కష్టాలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు నాలుగురోజులకోసారి సరఫరా అవుతున్న నీటిని డ్రమ్ములు, నీటి ట్యాంకర్లలో నింపుకున్నా అరకొరగానే నీటి వినియోగం మారిందని స్థానికుల ఆవేదన. తిరుమలలో రెండువేల వరకు వివిధ రకాల వ్యాపారాలు, దుకాణాలు, టీ దుకాణాలు, 30వరకు పెద్ద హోటళ్ళు, వందవరకు ఫాస్ట్‌పుడ్ కేంద్రాలు ఉన్నాయి. వీటికి కూడా నీటి రేషన్‌తో బెంబేలెత్తి పోతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే స్థానికులు, గృహావసరాలకు, వాణిజ్య అవసరాలకు ప్రైవేట్ నీళ్ళట్యాంకర్లపై ఆధారపడక తప్పదనే విషయం స్పష్టమవుతోంది.

**'వార్త'ముందే హెచ్చరించినా!:** తీవ్రవర్షాభావ పరిస్థితులతో తిరుమలలో జలాశయాల్లో నీరు తగ్గిపోతోందని, ఐదు ప్రధాన జలాశయాల్లో ఉన్న నీరు మరో 85రోజుల వరకు సరిపడుతుందని టిటిడి అధికారుల మాటగా "వార్త"మేనెలలోనే ప్రధానంగా ప్రచురించింది. ఈ పరిస్థితి గత నెలరోజులుగా కనిపిస్తున్నా ఇప్పుడు స్థానికులకు రేషన్ విధానం అమలుతో తెలిసింది. ఇప్పటికీ కురవని నైరుతి వానలతో తిరుమలలో అధికారులు తాగునీటి కోసం సతమతమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. రానున్న జులై మాసంలో కూడా వర్షాలు కురవకపోతే తాగునీటికి ప్రత్యామ్నాయ పరిస్థితులపై ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది.

తిరుమలలో మొత్తం 14,304 లక్షల గ్యాలన్ల నీటిసామర్థ్యంతో గోగర్భం డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 2,894 అడుగులు, పాపవినాశనం 697.14 అడుగులు, ఆకాశగంగ జలాశయం 685లక్షల గ్యాలన్లనీటి సామర్థ్యం. రెండు ప్రధాన పెద్దజలాశయాలు కుమారధార, పసుపుధార తీర్థాలు. ఈ రెండు జలాశయాల్లో పసుపుధార 2,833లక్షల గ్యాలన్లనీటి సామర్థ్యం, కుమారధారతీర్థం 4,258లక్షల గ్యాలన్ల నీటిసామర్థ్యం కలిగివున్నాయి. ఇవన్నీ పూర్తిస్థాయిలో నిండితే ఏడాదిన్నరపాటు నీటికొరత తలెత్తదు. అయితే గత రెండు నెలలుగా జలాశయాలకు నీరుచేరే అవకాశం లేకపోయింది.

వర్షాభావ పరిస్థితులతో జలాశయాల్లో నీరు తగ్గిపోతుండటంతో తిరుమల వాసులకు నీటి కష్టాలు మొదలయ్యాయి. భక్తులకు కూడా కాటేజీలకు, అతిధిగృహాలకు రేషన్ విధానం అమలు చేస్తున్నారు.

# శ్రీవాణి దర్శన టికెట్ల సమయం గందరగోళం

**- అయోమయంలో 300 మంది భక్తులకు ఇబ్బందులు**



**తిరుమల, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రతిరోజూ సాయంత్రం 4గంటలకు అనుమతించే శ్రీవారి ట్రస్ట్ బ్రేక్ దర్శనాల భక్తులకు .జారీచేసిన టిక్కెట్లపై సమయం తప్పుగా ముద్రించడంతో గందరగోళం నెలకొంది. బుధవారం ఈ సంఘటనతో శ్రీవాణి భక్తులు ఇబ్బందులకు గురయ్యారు. ప్రతిరోజూ సాయంత్రం 4 గంటలకు శ్రీవాణి ట్రస్ట్ భక్తులను దర్శనానికి అనుమతినిస్తారు. అయితే కొన్ని టిక్కెట్లపై సాయంత్రానికి బదులుగా ఉదయం 4 గంటలు అని ముద్రించడంతో గందరగోళంగా తయారైంది. దీంతో బుధవారం తెల్లవారుజామునే క్యూ కాంప్లెక్స్‌కు చేరుకున్న 300 మంది భక్తులను వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్‌లో సిబ్బంది ఆపేశారు. సాయంత్రం దర్శనానికి రావాలని సూచించారు. అయితే తెల్లవారుజామునే వచ్చామని, తమకందరికీ దర్శనాలు కల్పించాలని పట్టుబట్టారు. దీంతో టిటిడిలో జరిగిన పొరపాటును సరిదిద్ది భక్తులకు ఉదయం వేళ విఐపి బ్రేక్ దర్శనం టిటిడి అధికారులు కల్పించడంతో పరిస్థితి సద్దుమణిగింది. టిటిడి సిబ్బంది పొరపాటు వల్లే ఈ సమస్య తలెత్తిందని అధికారులు వివరణ ఇచ్చుకునే పరిస్థితి కనిపించింది సిబ్బంది చేసిన చిన్న పొరపాటు కారణంగా తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చిన వందలాది మంది భక్తులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. శ్రీవారి దర్శనం కోసం పలువురు భక్తులు మూడు నెలల ముందే ఆన్‌లైన్‌లో శ్రీవాణి ట్రస్ట్ టికెట్లను కొనుగోలు చేశారు. ఈ టికెట్లపై దర్శన సమయం సాయంత్రం 4 గంటలకు బదులుగా, పొరపాటున ఉదయం 4 గంటలుగా ముద్రితమైంది. టికెట్‌పై ఉన్న సమయాన్నే ప్రామాణికంగా తీసుకున్న దాదాపు 300 మంది భక్తులు బుధవారం తెల్లవారుజామున 3 గంటలకే తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్1 వద్దకు చేరుకున్నారు. దర్శనం కోసం క్యూలో నిల్చున్న భక్తుల టికెట్లను అక్కడి టిటిడి సిబ్బంది తనిఖీ చేయగా అసలు విషయం బయటపడింది. సాయంత్రం జరగాల్సిన దర్శనానికి ఉదయం సమయం వేశారని గుర్తించారు. చివరకు శ్రీవాణి టిక్కెట్ భక్తులందరికీ రెఫరల్ ప్రొటోకాల్ విఐపి బ్రేక్ దర్శనం కింద శ్రీవారి దర్శన భాగ్యం కల్పించారు. మొత్తం మీద టికెట్ల జారీలో జరిగిన సాంకేతిక పొరపాటు భక్తులకు తాత్కాలిక ఇబ్బందులు కలిగించినప్పటికీ, టిటిడి అధికారులు తక్షణం స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి సమస్యను పరిష్కరించడంతో శ్రీవారిని దర్శించుకుని భక్తులు సంతృప్తితో వెనుదిరిగారు.

# భక్తుల భద్రతే ధ్యేయంగా తిరుమలలో ఆక్టోపస్ మాక్‌డ్రిల్



**తిరుమల, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** వేసవిసెలవులు ముగిసినా తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ముందు జాగ్రత్తగా బుధవారం ఉదయం ఆక్టోపస్ పోలీసులు, పోలీసులు కొండపై ప్రత్యేక మాక్ డ్రిల్ నిర్వహించింది. ఊహించని విధంగా ఉగ్రవాద దాడులు జరిగినా, ఏదైనా అత్యవసర ఉద్రిక్త పరిస్థితులు తలెత్తినా భక్తులకు ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా ఎలా రక్షించాలి, వ్యూహాత్మకంగా శత్రువులను ఎలా అణచివేయాలి,

తక్షణమే ఎలా స్పందించాలనే అంశాలపై ఈ విన్యాసాలు జరిగాయి.

అత్యంత అధునాతన ఆయుధాలు, అత్యాధునిక రక్షణ సామాగ్రితో సన్నద్ధమైన దాదాపు 50 మంది కమాండోల ప్రత్యేక సిబ్బంది ఈ ఆపరేషన్‌లో చురుగ్గా పాల్గొని తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. తిరుమల తిరుపతి దేవస్థానం విజిలెన్స్ విభాగం, తిరుమల పోలీసుల సమన్వయంతో ఈ హైప్రొఫైల్ మాక్ డ్రిల్ ప్లాన్ చేశారు. భక్తులు కూడా ఉత్కంఠగా వీటిని తిలకించారు. ఈ మాక్‌డ్రిల్ శ్రీవారి ఆలయ పరిసరాలు, లడ్డూ పోటు, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ వంటి అత్యంత రద్దీగా ఉండే ప్రాంతాలలో నిర్వహించారు. ఏదైనా ఊహించని పరిస్థితి ఏర్పడితే బందీల విముక్తి చర్యలు, ఉగ్రవాదులను ఏరివేసే వ్యూహాలను కమాండోలు ఆచరణాత్మకంగా ప్రాక్టీస్ చేశారు.

ఈ భద్రతా విన్యాసాలు కేవలం అప్రమత్తతను పరీక్షించుకోవడానికే కాకుండా, తిరుమలకు వచ్చే సామాన్య భక్తులలో ఒక బలమైన ధైర్యాన్ని, నమ్మకాన్ని నింపేలా సాగాయి. ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొనేందుకు భద్రతా బలగాలు సర్వసన్నద్ధంగా ఉన్నాయనే సందేశాన్ని ఈ మాక్ డ్రిల్ ద్వారా స్పష్టం చేశారు.

రానున్న బ్రహ్మోత్సవాలను దృష్టిలో ఉంచుకుని కొండపై భద్రతా కవచాన్ని పటిష్టం చేసే వ్యూహం మరోసారి పరీక్షించారు.



### మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సేవలో మంత్రి లోకేష్

**విజయవాడ, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గం మోపిదేవిలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయాన్ని మంత్రి లోకేష్ సందర్శించారు. మంత్రి లోకేష్‌కు వేద పండితులు, ఆలయ అధికారులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం నాగపుట్ట వద్ద పాలుపోసి శ్రీవల్లీ దేవసేనసమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ ఇఒ దాసరి శ్రీరామ వరప్రసాదరావు మంత్రి నారా లోకేష్‌ను ఘనంగా సత్కరించి, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపి వల్లభనేని బాలశౌరి, మండలి విప్ పంచుమర్తి అనూరాధ, ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, భాష్యం ప్రవీణ్, వెనిగండ్ల రాము, కాగిత కృష్ణప్రసాద్, బోడె ప్రసాద్, ఆర్టీసి చైర్మన్ కొనకళ్ల నారాయణ, మచిలీపట్నం పార్లమెంట్ టిడిపి అధ్యక్షుడు వీరంకి గురుమూర్తి, ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ, అవనిగడ్డ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాస్, జోనల్ కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

# గంగమ్మ లాకప్‌డెత్ కేసు హైకోర్టు కీలక ఆదేశాలు

**విజయవాడ, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిది:** దళిత మహిళ గంగమ్మ లాకప్ డెత్‌పై దాఖలైన పిల్‌పై బుధారం ఎపి హైకోర్టు విచారణ జరిపింది. దుర్గప్ప ట్రీట్మెంట్‌కి సంబంధించిన అన్ని రిపోర్టులను ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ సీల్డ్ కవర్‌లో హైకోర్టుకు సమర్పించారు. రిపోర్టులు మొత్తాన్ని ధర్మాసనం క్షుణ్ణంగా పరిశీలించింది. పిటిషనర్ తరపున న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ గంగమ్మ కుమార్తె లక్ష్మిని పోలీసులు భయపెడుతున్నారు. ఆమె స్వగ్రామంంలోకి ఎవరిని వెళ్లనివ్వట్లేదని గంగమ్మ మృతదేహానికి రిపోస్టుమార్టం నిర్వహించాలని పిటిషనర్ తరపున న్యాయవాది కోరారు. గంగమ్మ ఎలా చనిపోయిందని ప్రభుత్వం తరపున న్యాయవాదిని ధర్మాసనం ప్రశ్నించింది. పోస్టుమార్టం రిపోర్ట్‌లో గంగమ్మ ఏ కారణం చేత చనిపోయిందని రాసి ఉందంటూ హైకోర్టు ప్రశ్నించింది. గంగమ్మ ఒంటిపై గాయాలు ఉన్నాయని హైకోర్టు ప్రశ్నించగా కార్డియాక్ అరెస్ట్‌తో పాటు మరికొన్ని కారణాలతో గంగమ్మ చనిపోయిందని పోస్టుమార్టం రిపోర్ట్‌లో పేర్కొన్నారు ప్రభుత్వం తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. గంగమ్మ కూతరు లక్ష్మికి భద్రత కల్పించాలని హైకోర్టు ఆదేశించింది. విచారణకు సంబంధించి పూర్తి వివరాలు తమ ముందుంచాలని ఆదేశించిన, విచారణ వాయిదా వేసింది.

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION
Tender Notice No.11/2026-27/SE(North)/EE (North)/DB/GVMC/ Dt:22-06-2026 (Item-01)
Number of Works : 1 Nos (One)
Value of Works (ECV) : Rs.1,20,97,598/-
Downloading Starting Date : 23-06-2026 @ 10.00 P.M.,
Date of Opening Tenders : 08-07-2026 @ 02.00 P.M.,
Further details at http://www.apeprocurement.gov.in
O/o the Superintending Engineer (North), GVMC For Commissioner, GVMC

NOTICE
MAHADHAN
In order to make the Indian Farmers internationally competitive, Mahadhan Agritech Limited, brings to you the following Imported & Indigenous 100% Water Soluble Mixture of Fertilisers as per order dated 24.10.2015, issued by Ministry of Agriculture & Farmers Welfare, Govt. of India, New Delhi.

| Sr. No. | Particulars / Grade | NPK 16-8-34 | NPK 8-52-17 | NPKFe 0-42-47-2.8 | NPKS 30-0-0-5 | NPKS 24-0-12-6 |
|---|---|---|---|---|---|---|
| 1 | Moisture percent by weight, maximum | 0.5 | 0.5 | 0.5 | 0.5 | 0.5 |
| 2 | Total Nitrogen percent by weight, minimum | 16 | 8 | 0 | 30 | 24 |
| 3 | Total Phosphorous and water soluble phosphorous (as $P_2O_5$) percent by weight, minimum | 8 | 52 | 42 | 0 | 0 |
| 4 | Water Soluble Potassium (as $K_2O$) percent by weight, minimum | 34 | 17 | 47 | 0 | 12 |
| 5 | Sulphur (as S) percent by weight, minimum | 0 | 0 | 0 | 5 | 6 |
| 6 | Ferrous Iron (as Fe) percent by weight, minimum | 0 | 0 | 2.8 | 0 | 0 |
| 7 | Total Chloride per cent by weight, maximum | 1.5 | 1.5 | 1.5 | 1.5 | 1.5 |
| 8 | Matter insoluble in water per cent by weight, maximum | 0.5 | 0.5 | 0.5 | 0.5 | 0.5 |
| 9 | Sodium as NaCl percent by weight, maximum | 0.5 | 0.5 | 0.5 | 0.5 | 0.5 |
| 10 | Lead (as Pb) per cent by weight, maximum | 0.003 | 0.003 | 0.003 | 0.003 | 0.003 |
| 11 | Cadmium (as Cd) per cent by weight, maximum | 0.0025 | 0.0025 | 0.0025 | 0.0025 | 0.0025 |
| 12 | Arsenic (as As) per cent by weight, maximum | 0.01 | 0.01 | 0.01 | 0.01 | 0.01 |

Salient Features:
1. 100% Water Soluble.
2. Improves quality and yield of the produce.
3. Suitable to use through drip irrigation and foliar application.
Supply and sales of above Mahadhan WSF grades will be done after 30-35 days.

Manufactured / Imported & Marketed by -
MAHADHAN AGRITECH LIMITED
Registered Office : Sai Hira, Survey No. 93, Mundhwa Road, Mundhwa, Pune - 411036, Maharashtra.
www.mahadhan.co.in

వార్త

విధి అంటూ ఎవరూ సృష్టించలేదు. మనకు మనమే సృష్టించుకున్నాం. మన మాట, ఆలోచన, ప్రవర్తన వల్ల మన జీవితానికి మనమే బాధ్యులం.

- లావోసు

# బ్లాంక్‌చెక్ ఫీ 'జులుం'!


తామేం చేసినా చెల్లుతుంది కనుక ఎవరు నవ్వుకున్నా, విమర్శలు రువ్వుకున్నా తమకేటి సిగ్గు అన్న చందాన తెలుగు రాష్ట్రాల్లో విద్యావ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లుతోంది. ప్రధానంగా విద్యార్థుల ఫీజుల విషయంలో కళాశాల యాజమాన్యాలు ప్రవర్తిస్తున్న తీరు చూస్తే ఒక భావకవి కలం లోంచి వచ్చిన పద విన్యాసమొకటి గుర్తొస్తోంది. తామేదో విద్యాసేవ చేస్తున్నట్లు గొప్పగా చెప్పుకునే ఆయా విద్యాసంస్థలపై వస్తున్న అభియోగాలు చూస్తోంటే నవ్వుకోవాల్సిందే! అందరికీ తమ తీరు తెలిస్తే నవ్వుల పాలవుతామనే ఆలోచన కూడా లేకుండా ఫీజుల వసూళ్లలో విచ్చలవిడిగా విధానాలు అవలంబిస్తున్నారు. ప్రధానంగా తెలంగాణ రాష్ట్రంలో ఇంజినీరింగ్ తదితర వృత్తి విద్యాకోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికేట్‌లను అడిగితే ఆయా కళాశాలల యాజమాన్యాలు పెడ్తున్న షరతులు ఏ విద్యార్థికీ సంతృప్తి నిచ్చేవి కావు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంలో చదువుకున్న విద్యార్థులు తాజాగా కాలేజీ యాజమాన్యాలకు తమ అసలు ధృవపత్రాల కోసం బ్లాంక్ చెక్‌లు, ప్రామిసరీ నోట్లు సమర్పించుకోవాల్సి వస్తోంది. తమ కోర్సు పూర్తి చేసుకున్నాక ఉన్నత విద్యాకోర్సుల్లో చేరాలంటే లేదా విదేశీ చదువుల కోసం ముందుకు సాగాలంటే ఒరిజినల్ డిగ్రీ పత్రాలు కావాలి. పైగా తాము ప్రస్తుతం చదువుతున్న కళాశాలలోనే క్యాంపస్ సెలక్షన్లలో ఎంపికయినా కూడా వారు ఉద్యోగ ప్రస్థానంలో అడుగు పెట్టే సందర్భంగా ఒరిజినల్స్ నమోదు చేయించుకోవాలి. అందుకోసం వాటిని దఖలు పరచాలి. గత మూడేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను సకాలంలో విడుదల చేసిన పాపాన పోలేదు. ఈ నేపథ్యంలో ఈ యేడాది ఇంజినీరింగ్ ఇతర వృత్తి విద్యా కోర్సులలో పూర్తయిన విద్యార్థులకు ఒరిజినల్ సర్టిఫికేట్‌లు ఇవ్వలేదు. విద్యార్థి కోర్సులు పూర్తి చేసినప్పటికీ ప్రభుత్వం సదరు విద్యార్థుల అక్కౌంట్‌కు ఫీజు రీయింబర్స్‌మెంట్ జమ చేయకపోవడంతో ఈ యేడాది విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకమైంది. ప్రభుత్వం నుంచి ఆ బకాయిలను వసూలు చేసుకోలేక విద్యార్థుల భవిష్యత్‌తో ముడిపెడితే తమ ఖజానాలోటు నిండుతుందని ప్రయివేటు కళాశాలల యాజమాన్యాలు భావించిన తక్షణమే అమలులో పెట్టాయి. అందుచేతనే ఫీజులు చెల్లిస్తే ఒక పద్ధతి, చెల్లించకపోతే మరో పద్ధతిని అనుసరిస్తున్నాయి. ప్రభుత్వ భరోసాతో కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు మరో మార్గాంతరం లేక లబోదిబో అంటున్నారు. ఫీజు బకాయిలు చెల్లించాల్సింది ప్రభుత్వం కానీ ఒరిజినల్ సర్టిఫికేట్‌లు అడిగితే, ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయి ఫలానా తేదీలోగా ఫీజు రాకపోతే తామే చెల్లిస్తామన్న హామీ పత్రాలతోపాటు అందుకు చెల్లుబాటు ప్రామిసరీ నోట్లు, బ్యాంక్ చెక్‌లు రాయించుకుంటున్నారు. ఇదో దుర్విధానం. ఇలాంటి విధానాలను నిలుపుదల చేయడం కోసం రాష్ట్ర విద్యాశాఖ ప్రత్యేకమైన చర్యలేమీ తీసుకోలేకపోయింది. ఈ నేపథ్యంలో తెలంగాణ హైకోర్టు ఈ యేడాది 2026-27విద్యాసంవత్సరం నుంచి ఫీజులను వసూలు చేసి, ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ చేసినప్పుడు విద్యార్థులకు ఆ సొమ్ము తిరిగి చెల్లించాలని సూచించింది. అసలు చదువుకునే స్తోమత లేని విద్యార్థుల కోసమే ఫీజురీయింబర్స్‌మెంట్ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టగా ఇప్పుడా విధానాన్ని మార్చేస్తే ఆ విద్యాపథకం స్ఫూర్తి దెబ్బతింటుంది. ఈ పథకంతో ఇప్పటికే గత పదేళ్లుగా ఎంతో మంది పేద, మధ్యతరగతి విద్యార్థులు వృత్తి విద్యా కోర్సులలో చేరితమ జీవితాలు పండించుకుంటున్నారు. ఇప్పుడా పథకాన్ని ఆపినా, హైకోర్టు సూచనలతో ఎవరి ఫీజులు వారు కట్టేసి మళ్లీ ప్రభుత్వం నుంచి విద్యార్థులు వసూలు చేసుకోవడం సరైనపద్ధతి కాదు. దాంతో ఫీజులు కట్టుకోలేనివారు, నిరాశానిస్పృహలతో తమ జీవితాలను వెలిబుచ్చాల్సి ఉంటుంది. హైకోర్టు ఉత్తర్వులు వెంబడి ప్రభుత్వం కూడా ఓ విచిత్రమైన జీ.ఓ ఇచ్చింది. 2026-27 విద్యాసంవత్సరంలో విద్యార్థులకు నేరుగానే ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. కానీ ప్రభుత్వం ప్రతి యేటా ఏయే సమయాల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించగలదో స్పష్టత లేక హైకోర్టు ఎలాంటి కొత్త ఉత్తర్వులు ఇవ్వలేదు. పాత పద్ధతి అమల్లో ఉన్నట్లే. ఈలోగా ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ చెల్లించే విషయంలో చొరవ చూపలేదు. కళాశాలలు చేసేది లేక విద్యార్థుల పేరిట ఉన్న ఫీజు బకాయిలు వారి నుంచే వసూలు చేయాలన్న ధోరణితో బ్లాంక్ చెక్‌లు, ప్రామిసరీ నోట్లు సేకరణ విధానాన్ని చేపట్టింది. ఇలాంటి విధానం దేశంలోని ఏ యూనివర్సిటీ, కళాశాలలు అవలంబించడం లేదు. తెలంగాణ కళాశాలలు ఎన్నుకున్న పద్ధతి చర్చనీయాంశమైంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోతే తాము కళాశాలలను నడపలేమని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ముందుగానే హెచ్చరించాయి. బంద్ పాటించడంతో ప్రభుత్వం కొంతమేరకు ఫీజు రీయిం బర్స్‌మెంట్ నిధులు విడుదల చేసింది. గత మూడేళ్లుగా ఆయా కళాశాలలకు చెల్లించాల్సిన ఫీజుబకాయిలు దాదాపు పదివేల కోట్ల రూపాయల వరకు ఉండగా కంటి తుడుపుగా రూ.400 కోట్లు విడుదల చేసి ప్రభుత్వం మిన్నకుంది. ఇక కొత్త విద్యాసంవత్సరం మొదలయ్యింది. కథ మామూలే. పెరిగిపోతున్న బకాయిలు వచ్చే మార్గం లేదు. కనీసం విద్యార్థులకు ఒరిజినల్ సర్టిఫికేట్‌లకు లింకు పెడితే నైనా కొన్ని నిధులు రాబట్టుకోగలమని కళాశాల యాజమా న్యాలు చేపట్టిన వసూళ్ల విధానం విద్యార్థుల విదేశీ చదువులు, ఉపకార వేతనాలకు దూరమయ్యే పరిస్థితి ఎదురైంది. ప్రభుత్వ భరోసాతో విద్య పూర్తయిందన్న ఆనందమే లేకుండా మరో ఉన్నత చదువులకు ఆటంకాలేర్పడుతున్నాయని ఆందోళనలో గత యేడాది విద్యాయాత్ర ముగిసింది.

మాటలో నిజాయితీ, స్పష్టత ఉంటే అవతలివారు ఇట్టే ఆకర్షితులవుతారు.



ప్లినీ

సంతృప్తే మనిషికి సహజమైన సంపద. భోగాలు, విలాసాలు కృత్రిమమైన దారిద్ర్యం వంటివి.



సోక్రటీస్

# 'విలువల విద్య'తోనే యువతకు భవిత

**ఒక సమాజం ఆమోదించి, అంగీకరించిన ఆదర్శాలు, నియమాలు, ప్రవర్తనలనే 'విలువలు'అంటారు. మంచి విలువలు గల వ్యక్తుల వలనే మంచి సమాజ నిర్మాణం అవుతుంది. అదే మన దేశ భవిష్యత్తు. విలువలను విద్యారూపంలో బోధన ద్వారా పెంపొందించటం ఒక విధానమైతే ఆదర్శప్రాయులు వాటిని అనుసరణీయం ద్వారా సమాజానికి నేర్పించగలగడం అనేది మరో గొప్ప విధానం. కుటుంబ పెద్ద ద్వారా కుటుంబ విలువలు, సమాజంలోని పెద్దల ద్వారా సామాజిక విలువలు,రాజకీయ నాయకుల ద్వారా రాజకీయ విలువలు, స్వీయనియంత్రుత్వ విలువలను మీడియా, సోషల్ మీడియా వారు అనుసరించి నిరూపించగలిగితే తదనంతరం వచ్చేవివిధ వ్యవస్థలలోని తరానికి మార్గదర్శకులుగా, గురువుగా విలువలను అనుసరిస్తున్న వారే ఉండవచ్చనే అభిప్రాయం కలుగుతుంది విశ్లేషకులకు.**

ఒక దేశం అన్ని రకాల ప్రగతి ఆ దేశ విలువల వ్యవస్థపై ఆధారపడి ఉంటుంది. అంటే ఆ దేశ సాంఘిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధిలన్నీ ఆ దేశ 'విలువల విద్యపై' ప్రధానంగా ఆధారపడి ఉంటుంది. చరిత్ర కూడా ఇదే చెబుతుంది. రెండవ ప్రపంచ యుద్ధంలో జర్మనీ, జపాన్ సర్వనాశనమయినాయి. జపాన్లోని హిరోషిమా నాగసాకి పట్టణాలు ఆటంబాంబులకు గురి అవ్వగా జర్మనీ తూర్పు జర్మనీ పశ్చిమ జర్మనీగా విడగొట్టబడింది. కానీ ఆ రెండు దేశాలు అనుసరించిన 'సామాజిక బాధ్యత విలువల' వలన కేవలం రెండు దశాబ్దాలలోనే అవి రెండు అభివృద్ధి చెందాయి. అదే విధంగా 1948లో ఏర్పడిన తక్కువ జనాభాగా ఉన్న ఇజ్రాయిల్ దేశం సైతం రెండు దశాబ్దాలు వ్యవధిలోనే చాలా శక్తివంతమైన దేశంగా మారించింది. దీనికి కారణం ఆ దేశ ప్రజలు అనుసరించిన 'విలువలతో కూడిన అంకితభావం'. చరిత్ర చెబుతున్న అలాంటి విలువలు నేడు మన దేశంలో కనబడుతున్నాయా అని ప్రశ్నించుకోవాల్సి వస్తుంది. వాస్తవానికి నేడు మన సమాజంలో కుటుంబం, సామాజిక, ఆర్థిక, రాజకీయ, మీడియా, సోషల్ మీడియా లాంటి వ్యవస్థలలో విలువల సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాం. ఈ విలువల సంక్షోభం నుండి బయటపడే మార్గాన్ని నేడు మనం సవాళ్లుగా తీసుకోవాల్సిన పరిస్థితి ఉన్నది. ఈ విలువలను పాఠశాల విద్యార్థి దశ నుండే అనుసరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. విద్యార్థి దశ నుండే 'విలువలతో కూడిన విద్యను' గురువులు అందించేందుకు సంసిద్ధంగా ఉన్నప్పటికీ, ప్రస్తుత కాలం తల్లిదండ్రుల సహకారం గురువులకు అందడం లేదనేది సత్యవాక్కు. నేటి తల్లిదండ్రులు తమ బిడ్డలను విద్యాసంస్థలలో చేర్పించుతున్న సందర్భంలో గురువులను మార్కులు, ర్యాంకులు మాత్రమే అడుగుతున్నారు కానీ మంచి విలువలను నేర్పించండి అని అడగడం లేదు. వాళ్ళు మార్కులు, ర్యాంకులు మాత్రమే తమ పిల్లల భవిష్యత్తు అనే భ్రమలో నుండి బయటపడాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఎందుకంటే స్వతంత్ర్యం వచ్చే నాటికంటే నేడు మన దేశ అక్షరాస్యత రేటు సుమారుగా 80 శాతం ఉన్నప్పటికీ విద్యావంతులతో పాటు అవినీతి పరుల రేటు కూడా పెరుగుతున్నది అని కొన్ని సర్వేల ప్రకారం తెలుస్తుంది. అవినీతి గల దేశాల జాబితాలో మన దేశం రేటు కూడా పెరిగింది కదా! అనగా విలువలతో కూడిన విద్యను బోధించకుండా తల్లిదండ్రుల కోరిక మేరకు కేవలం మార్కులు, ర్యాంకుల కోసం మాత్రమే బోధన జరుగుతుంది కాబట్టి అక్కడ విలువల బోధన లేనందున అక్షరాస్యతతో పాటు అవినీతి కూడా పెరిగినట్టే కదా! కాబట్టి ప్రస్తుత అకాడమిక్ సంవత్సరాన్ని పురస్కరించుకొని తరగతులు ప్రారంభ సమయంలో విద్యార్థుల తల్లిదండ్రులు

**వి వి రమణ నాయక్**

గురువులను మార్కులు, ర్యాంకులు మాత్రమే కాకుండా మంచి విలువలను నేర్పించగలరని అడగటం చేస్తే అది దేశ భవిష్యత్తుకు మంచిప్రణాళికగా భావించవచ్చనే అభిప్రాయం కలుగుతుంది. గత అమెరికా అధ్యక్షుడు ఇదే విధా నాన్ని అనుసరించారు. మా బిడ్డలను తమరి చేతులలో ఉంచుతున్నందున మంచి 'విలువలతో కూడిన విద్యను' బోధించండనీ వారి గురువులను కోరారు. ఉచితంగా లభించే వంద రూపాయల కంటే కష్టపడి సంపాదించే ఒకరూపాయి విలువైనదని, ఓటమిని తట్టుకోవడం గెలుపును ఆస్వాదించటం, అసూయద్వేషాలకు దూరంగా ఉంచడం, ప్రకృతిని ప్రేమించడం మోసంతో వచ్చే గెలుపు విజయం కాదని 'విలువలతో



కూడిన విద్యను' మా బిడ్డలకు నేర్పించగలరని గురువులను కోరడం జరిగింది. విద్యార్థుల కంటే తల్లిదండ్రులకు ఈ విలువల విద్య బోధించాలేమో అనే ఆలోచనలను కొన్ని సందర్భాలను గమనిస్తుంటే అనిపిస్తుంటుందని విద్యావేత్తలు వాపోతున్నారు. మార్కులు, ర్యాంకులు మాత్రమే జీవితం కాదని ఈ సమాజంలోని తల్లిదండ్రులు తెలుసుకోవాల్సి ఉన్నది.' నీవు నీతిలేని విద్యను బోధిస్తున్నావు అంటే తెలివిగల దయ్యాలను తయారు చేస్తున్నారని అర్థం' అని విలువల్లేని విద్యగురించి అంటారు డ్యూక్ ఆఫ్ వెల్లింగ్టన్. ఒక సమాజం ఆమోదించి, అంగీకరించిన ఆదర్శాలు, నియమాలు, ప్రవర్తనలనే 'విలువలు'అంటారు. మంచి విలువలు గల వ్యక్తుల వలనే మంచి సమాజ నిర్మాణం అవుతుంది. అదే మన దేశ భవిష్యత్తు. విలువలను విద్యారూపంలో బోధన ద్వారా పెంపొందించటం ఒక విధానమైతే ఆదర్శప్రాయులు వాటిని అనుసరణీయం ద్వారా సమాజానికి నేర్పించగలగడం అనేది మరో గొప్ప విధానం. కుటుంబ పెద్ద ద్వారా కుటుంబ విలువలు, సమాజంలోని పెద్దల ద్వారా సామాజిక విలువలు,రాజకీయ నాయకుల ద్వారా రాజకీయ విలువలు, స్వీయనియంత్రుత్వ విలువలను మీడియా, సోషల్ మీడియా వారు అనుసరించి నిరూపించగలిగితే తదనంతరం వచ్చేవివిధ వ్యవస్థలలోని తరానికి మార్గ దర్శకులవుతారు. 'కుటుంబ విలువల' విషయానికి వస్తే 'నాకు గొప్పతల్లిని ఇవ్వండి నేను గొప్పజాతిని ఇస్తాను' అని అంటారు నెపోలి యన్. అంటే మంచి విలువలను పాటించే తల్లిదండ్రుల వలనవారిని చూసి అనుసరించే వారి బిడ్డలు అదేవిధంగా మంచి విలువలతో పెరిగి జాతి నిర్మాణంలో భాగస్వాములు కాగలరు. ఇలాంటి విలువలు బోధన ద్వారా కాకుండా కుటుంబ పెద్దలను చూసి అనుసరించి నేర్చుకునే విలువలు ఇవి. నేటి సమాజంలో రాజకీయ విలువల సంక్షోభాన్నిఎదుర్కొంటున్నాము. ప్రస్తుత నాయకులు మంచి విలువలు గల రాజకీయ విధానాన్ని అనుసరించగలిగితే తర్వాతతరం వారికి ఇది ఆదర్శప్రాయంగా ఉండగలుగుతుంది. రాజకీయ విలువలు అనుసరించే వారిని చూసి ఆచరణ ద్వారా నేర్చుకోగల ఈ రాజకీయ విలువలు యువ రాజకీయ నాయకులకోసం ఇది అత్యంత అవసర మైనది.ఉదాహరణకు.. 1965 సంవత్సరంలో పాకిస్తాన్ భారత్ పై దాడి చేసింది. దీనికి ప్రతిగా భారత్ జవాబు మాత్రమే చెబుతుంది. ఈ సందర్భంలో అమెరికా భారత్ పై ఒత్తిడి చేస్తూ యుద్ధం ఆపేయాలని లేనిచో భారత్ కు సరఫరా చేయవలసిన ధాన్యాన్ని ఆపేస్తామని బెదిరింపులు చేస్తున్న సందర్భం అది. వాస్తవానికి భారత్ పాక్‌కు జవాబు మాత్రమేఇస్తుంది.ఇది 'స్వాభిమానసమస్య'. ఆ సందర్భంగా దేశ ప్రధాని అయిన లాల్ బహదూర్ శాస్త్రి దేశ ప్రజలకు ఒక పూట భోజనం మానేయండి అనే సందేశం ఇవ్వాల్సివచ్చిన పిమ్మట, ముందు రోజు అనగా ఆదివారం సాయంకాలం తన ఇంటిలో భోజనం వండనీయకుండా తను వారి పిల్లలతో పాటు ఉపవాసం చేయాల్సి వచ్చింది.వారు, వారి పిల్లల ఉపవాస ప్రయోగ ప్రోత్సాహంతో మరుసటి రోజు సోమవారం జాతినీ ఉద్దేశించి ఒక పూట ఉపవాస మంత్రాన్ని దేశ ప్రజలు పాటించాల్సిఉందని పిలుపునిస్తూ జై జవాన్ జై కిసాన్ నినాదాన్ని ఇచ్చారు. నేడు భారత్ ఇలాంటి 'విలువలతో కూడిన రాజకీయాన్ని' కోరుకుంటుంది. ఈ విధానాలు బోధనతో మాత్రమే కాకుండా 'విలువలు కలిగిన నాయకులను' అనుసరించటం ద్వారా నేర్చుకునే రాజకీయ విలువలు ఇది. సుప్రీంకోర్టు 2002 ఇచ్చిన తీర్పులో విద్యార్థులకు "విలువలతో కూడిన విద్య" అందించేందు కు అన్ని మతాలలోని మానవతా విలువలను విద్యార్థులకు బోధించాలని వ్యక్తులు ఉన్నతులు కావాలంటే 'విలువల బోధన అవసరమని స్పష్టంగా తెలిపింది. ప్రస్తుతం మన రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల స్థాయి నుండే 'విలువల విద్య' అవసరమని భావించి గురువుల సహకారంతో మంచి విలువల విద్య విధానాన్ని మొదటి తరగతి నుండి నేర్పించేందుకు తగువిధంగా సమాయాత్తమై ఉన్నదానేది చాలా గొప్ప విషయంగా భావించవచ్చు. •

# ప్రజారోగ్యాన్ని మింగేస్తున్న కల్తీ మాఫియా!

**వనకల్ల వీరప్ప**

నిత్యం మనం తీసుకునే ఆహారం అమృతం కావాలి, కానీ నేడు అది నెమ్మదిగా ప్రాణాలను హరించే విషంగా మారుతోంది. లాభాపేక్ష అనే రాక్షసి కోరల్లో చిక్కుకున్న ఆహార రంగం, సామాన్యుడి ఆరోగ్యంతో చెలగాటమాడుతోంది. 'సర్వం కల్తీమయం' అన్నది కేవలం ఒక నానుడి కాదు, నేడు అది మన కళ్లముందు కదలాడుతున్న భయంకర వాస్తవం. భారతదేశంలో సామాన్య ప్రజలజీవన ప్రమాణాలు పెరగడం అటుంచితే, కనీస ఆరోగ్య భద్రత కరువవ్వడం ఆందోళన కలిగించే అంశం.వాతావరణ కాలుష్యంఒకవైపు ఊపిరితిత్తులను ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే, మరోవైపు మనం తినేఆహారంలో చేరుతున్న రసాయనాలు నిశ్శబ్దంగా మృత్యువును ఆహ్వానిస్తున్నాయి.ఉదయం నిద్రలేచిన దగ్గరి నుండి వాడే టూత్‌పేస్ట్, పాలు, టీ పొడి, వంట నూనె, పప్పు ధాన్యాలు.. ఇలా ఒకటేమిటి, ఏ వస్తువును తాకినా అందులో కల్తీ ఉందన్న వార్తలు వినియోగదారుడి వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయి. గతంలో కల్తీ అంటేఏదో ఒక వస్తువులో తక్కువ నాణ్యత గల పదార్థాలనుకలపడం అని అనుకునేవారు. కానీ నేడు అది ఒక వ్యవస్థీకృత నేరంగా రూపాంతరం చెందింది.ఇటీవల దేశవ్యాప్తంగా జరిగిన దాడులు చూస్తుంటే, ఒక భారీ నెట్‌వర్క్ దీని వెనుక ఉన్నట్లు అర్థమవుతోంది. సూరత్ వంటి నగరాల్లో యూరియా, డిటర్జెంట్, ప్రాణాంతక రసాయనాలతో 'సింథటిక్ పాలు' తయారు చేయడం మానవత్వం లేని చర్య.పన్నీర్, నెయ్యిలో జంతువుల కొవ్వును కలపడం వంటి ఘటనలు ఆధ్యాత్మిక భావనలతో పాటు ఆరోగ్య భద్రతను కూడా దెబ్బతీస్తున్నాయి. ఢిల్లీలో వెలుగులోకి వచ్చిన నకిలీ టూత్ పేస్ట్ తయారీ కేంద్రం మనదైనందిన జీవితంలో ఏవస్తువునూ నమ్మలేమని నిరూపించింది. బ్రాండెడ్ కంపెనీల పేర్లతో నకిలీ ప్యాకింగ్ చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారు. గడువు ముగిసిన సాఫ్ట్ డ్రింక్స్, ప్యాక్డ్ ఫుడ్స్‌పై పాత తేదీలను చెరిపివేసి కొత్తతేదీలు ముద్రించడం ద్వారా వినియోగదారుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.ప్రస్తుత ఆధునిక సమాజంలో నగర జీవనం చాలా వేగంగా మారిపోయింది. ఉరుకులు పరుగుల జీవితంలో సొంతంగా వంట చేసుకునే తీరికలేక చాలామంది బయటి ఆహారంపై ఆధారపడుతున్నారు. బిర్యానీ సెంటర్లు, టిఫిన్ సెంటర్లు, ఫాస్ట్ ఫుడ్ అవుట్‌లెట్లు నేడు ప్రతిగల్లీలోనూ దర్శనమిస్తున్నాయి. అయితే, ఈ కేంద్రాల్లో శుభ్రత అనేది మచ్చుకైనా కనిపించడం లేదు.హైదరాబాద్ వంటి నగరాల్లో వెలుగులోకివచ్చిన అల్లంవెల్లుల్లి పేస్ట్ తయారీ కేంద్రాల పరిస్థితి దారుణం. కుళ్ళిన అల్లం, వెల్లుల్లికి రంగులు, రసాయనాలు కలిపి ఆకర్షణీయమైన ప్యాకింగ్‌తో హోటళ్లకు సరఫరాచేస్తున్నారు. ఇలాంటి పదార్థాలను వాడటం వల్ల హోటల్ ఆహారం రుచి కరంగా ఉన్నట్లు అనిపించినా, అది లోలోపల అవయవాలను చిత్తు చేస్తోంది. కల్తీ ఆహారం అనేది కేవలం ఒక వ్యక్తిగత సమస్య కాదు, ఇది దేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద ప్రజారోగ్య సంక్షోభం. కల్తీ వల్ల కలిగే నష్టాలు తక్షణమే బయటపడవు, కానీ దీర్ఘకాలంలో అవి ప్రాణాంతకమవుతాయి.ఆహారభద్రతా ప్రమాణాలను పర్యవేక్షించాల్సిన 'ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా', ఆరోగ్యశాఖలు క్షేత్రస్థాయిలో విఫలమవుతున్నాయని చెప్పక తప్పదు.తనిఖీలు కేవలం పండుగ సీజన్లకు లేదా ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రమే పరిమితం కాకూడదు. ప్రభుత్వం ఎన్నిచట్టాలు చేసినా,ప్రజల్లో చైతన్యం లేనిదే మార్పు రాదు.ఏదైనా వస్తువు కొనేముందు ఎక్స్‌పైరీ డేట్, తయారీదారు వివరాలు, ఎఫ్.ఎస్.ఎస్.ఏ.ఐ లోగోను తప్పనిసరిగా చూడాలి. మనం ఇప్పుడే మేల్కొక పోతే, రేపటితరం అనారోగ్యకరమైన సమాజంలో బతకాల్సి వస్తుంది. •

# ప్రజావాక్కు

### ముప్పుగా మారుతున్న ఇ-వ్యర్థాలు

ఆధునిక ప్రపంచంలో ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగం వేగంగా పెరుగుతోంది. మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, టెలివిజన్లు,బ్యాటరీలు, గృహోపకరణాలు వంటి పరికరాలు కొంతకాలం తరువాత ఈవ్యర్థాలుగా మారుతున్నాయి. ఈవ్యర్థాల పరిమాణం రోజురోజుకు పెరుగుతుండటం పర్యావరణానికి, ప్రజారోగ్యానికి తీవ్రమైన ముప్పుగా మారింది. ఈవ్యర్థాల్లో సీసం, పాదరసం, కాడ్మియం వంటి ప్రమాదకర లోహాలు ఉంటాయి. వీటిని శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించకపోతే నేల,నీరు,గాలి కలుషితమవుతాయి.ఫలితంగా శ్వాసకోశవ్యాధులు,నాడీ సంబంధిత సమస్యలు, ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. ముఖ్యంగా అనధికారిక రీసైక్లింగ్ కేంద్రాల్లో పని చేసే కార్మికులు ఎక్కువగా ఆరోగ్యపరమైన ప్రమాదాలకు గురవుతున్నారు.ఈవ్యర్థాల సమస్యకు ప్రధాన కారణాలు తరచుగా కొత్తపరికరాలను కొనుగోలుచేయడం, పాత పరికరాలను నిర్లక్ష్యంగా పారవేయడం, అవగాహన లోపం. ఈ పరిస్థితిని అధిగమించాలంటే ఈవ్యర్థాలను ప్రత్యేకంగా సేకరించి అధికారిక రీసైక్లింగ్ కేంద్రాలకు అందించాలి.ప్రభుత్వాలు, పరిశ్రమలు, ప్రజలు సమన్వయంతో పనిచేస్తే ఈవ్యర్థాల ముప్పును తగ్గించవచ్చు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### వృద్ధ నేతలు తప్పుకోవాలి

దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని అపారమైన తెలివితేటలు శక్తి సామర్థ్యాలు గల యువకులు మనదేశంలో ఎంతో మంది ఉన్నారని వారు రాజకీయాల్లోకి వచ్చి చురుకైన పాత్ర పోషించాలని అత్యున్నత పదవులను అధిష్టించాలని మాటల్లోనూ ఉపన్యాసాల్లోను చెబుతున్నారు కానిచేతలు ఇందుకు వ్యతిరేకంగా ఉంటున్నాయి. యువతకు అవకాశం ఇవ్వటం లేదు. ఎంత వయసు వచ్చినా పదవులను పట్టుకుని వేలాడుతున్నారు.

- శాస్త్రి, హైదరాబాద్

### హోటళ్లు పరిశుభ్రత పాటించాలి

నగర పరిసర ప్రాంతాల్లో హోటళ్ల కనీస పరిశుభ్రత పాటించకుండా టిఫిన్స్ చేస్తుండడం వలన వాటిని తినే ప్రజలు అనేక రకాల వ్యాధుల బారిన పడుతున్నారు. కావున ఎక్కడికక్కడ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకొని ప్రజలు రోగాల బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### రిజర్వేషన్లు మన ప్రతిభకు గొడ్డలిపెట్టు!

ప్రతిభకు పట్టం కట్టడం అంటే భారతదేశాన్ని అభివృద్ధి పథంలో శరవేగంగా పయనింపచేయడం! రిజర్వేషన్లకు రాం రాం పాడి,మంగళం పాడి,ప్రతిభే కొలమానంగా మన ప్రభుత్వాలు ముందుకు సాగేలా ఒక పెద్దఎత్తున ఉద్యమానికి అంకురార్పణ గావించేలా ప్రజా సంఘాల వారు మేధావి వర్గాల వారు తీవ్ర కృషి సల్పాలి! ఎందుకంటే అగ్రవర్ణాల వారికి 100 ర్యాంకు వచ్చిన దక్కనిఫలం, రిజర్వేషన్ వున్నవారికి 5000 ర్యాంకు వచ్చిన ఫలం దక్కడం ఓ అమానుషం,ఓ తీరని అన్యాయం క్రిందకు వస్తుంది! ఇప్పటికైనా కుల,మతాలకు అతీతంగా ప్రతి ఒక్క ప్రజానీకం రిజర్వేషన్లకు శాశ్వత విరామం ప్రకటించేలా ప్రతిభ వున్నవారికి పట్టాభిషేకం చేసేలా తీవ్ర కృషి చేయాలి.

- బుగ్గన మధుసూదనరెడ్డి, నంద్యాల జిల్లా

### చరిత్రను వక్రీకరిస్తున్నారు

దేశం కోసం ఎంతో చేసి ఎన్నో కష్టాలు పడి దేశానికి ప్రధాని అయిన వారు దేశ ప్రజలకు అద్వితీయమైన సేవలు అందించి ఏనాడు గొప్పలు చెప్పుకోని వారు ప్రచార ఆర్భాటాలు ఇష్టపడని వారు సంపన్న కుటుంబంలో పుట్టి కూడా అతి నిరాడంబరంగా జీవించిన వారు దేశ ప్రథమ ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసి 17 సంవత్సరాల పాటు దేశాన్ని పాటించిన వారు నెహ్రూ. ఆయన పాలనా కాలాన్ని అధిగమించామని గొప్పలు చెప్పుకుంటూ ప్రచారం చేసుకుంటున్నారు. మంచిదే సుదీర్ఘకాలం పాటు దేశానికి సేవ చేసే అదృష్టం కొందరికే దక్కుతుంది. ప్రధాన మంత్రి పదవిలో ఉంటూ తుది శ్వాస విడిచే అదృష్టం కూడా కొందరికే దక్కుతుంది.

- ఎమ్.ఎస్.శర్మ, హైదరాబాద్

### ప్రచార సాధనాలు

ధరల పెరుగుదల, నిరుద్యోగం, పరీక్షలు సక్రమంగా నిర్వహించలేకపోవటం దారుణంగా పతనమవుతున్న రూపాయి విలువ ఆర్థికంగా చితికిపోతూ అప్పుల పాలవుతున్న దేశం ఇవన్నీ కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలు. వీటిని విపక్షాలు వేలెత్తి చూపుతున్నాయి. ప్రభుత్వ అసమర్థతను విమర్శిస్తున్నాయి. అయితే పాలకులు తమ వైఫల్యాలను అంగీకరించడం లేదు. అంతా బాగుందని,అందరూ హేపీగాఉన్నారని ఎవరికి ఎలాంటి సమస్యలు లేవని కబుర్లు చెబుతూ ప్రజలను మోసం చేస్తోంది. అంతా తమకు అనుకూలంగా మార్చుకుంటోంది. ప్రసార మాధ్యమాలైన రేడియో, టివిలు కూడా ప్రభుత్వ అనుకూలవార్తలు ప్రసారం చేస్తున్నాయి.

-మిథునం, హైదరాబాద్

# ఇంకా స్పష్టత రాని శాంతి ఒప్పందం!



**సుంకవల్లి సత్తిరాజు**

ఎట్టకేలకు ఇరాన్ యుద్ధం ముగిసిందని సంబరపడుతున్న తరుణంలో అప్పుడప్పుడూ ఇజ్రాయిల్, ఇరాన్ మధ్య చెలరేగుతున్న ఆగ్రహ జ్వాలల కారణంగా పశ్చిమాసియాలో శాంతి స్థాపన దిశగా పడుతున్న అడుగులపై అనుమానపు క్రీనీడలు కమ్ముకుంటున్నాయి. 100 రోజులకు పైగా అమెరికా ఇజ్రాయిల్ దేశాల క్షిపణుల మోతతో, యుద్ధ విమానాల రణ ధ్వనులతో మధ్యప్రాచ్యంలో నెలకొన్న తీవ్రమైన ఉద్రిక్త పరిస్థితులు శాంతి చర్చలతో చల్లారిపోతాయని భావిస్తున్న తరుణంలో అమెరికా హుంకరింపులు, ఇరాన్ బెదిరింపులు, లెబనాన్ పై ఇజ్రాయిల్ దాడుల వలన ప్రస్తుతం కుదిరిన ఎంఓయూ రాబోవు రోజుల్లో శాంతి ఒప్పందంగా మారుతుందా? లేక పరిస్థితి మొదటికొస్తుందా? అనే ప్రశ్నలు తలెత్తడం సహజం. ఇజ్రాయిల్ పై దాడులు చేయకుండా హెజ్బొల్లాను కట్టడి చేయకపోతే ఇరాన్‌పై అనూహ్యమైన దాడులు చేస్తామని ట్రంప్ చేసిన హెచ్చరికలపై ఇరాన్ మండిపడుతున్నది. ఎంఓయూపై సంతకాలు జరిగిన తర్వాత కూడా లెబనాన్ పై ఇజ్రాయిల్ దాడులు చేయడంతో ఇరాన్ హార్మూజ్ జలసంధిని తిరిగి మూసివేయడం ఆందోళన కలిగించినా ప్రస్తుతం హార్మూజ్ తెరచే ఉందని, నౌకల రాకపోకలు కొనసాగుతున్నాయని జెడి వాన్స్ చెప్పడం హర్షదాయకం. ఒక వైపు స్విట్జర్లాండ్‌లో ఇరాన్‌తో జెడివాన్స్ నాయకత్వంలో వాషింగ్టన్ చర్చలు జరుపుతున్నది. ఈ చర్చల్లో పురోగతి కనిపించడంతో ప్రపంచం ఊపిరి పీల్చుకుంటున్నది. ఈ చర్చల్లో కుదిరిన ఒప్పందం ద్వారా ఇరాన్ పునర్నిర్మాణం కోసం 300 బిలియన్ డాలర్ల భారీ సహాయం లభించనుంది. ఇందుకు ప్రతిగా ఈ మొత్తంతో అమెరికాకు చెందిన గోధుమలు, మొక్కజొన్న తదితర ఆహార వస్తువులు కొనాలనే షరతు విధించారు. ప్రస్తుతం కుదిరిన అవగాహనా ఒప్పందం వలన ఇరాన్ బాగా లబ్ధి పొందడంతో భవిష్యత్తులో గల్ఫ్ ప్రాంతంలో ఇరాన్ ఆధిపత్యం కొనసాగే అవకాశముంది. దీనితో గల్ఫ్ దేశాల్లో గుబులు ప్రారంభమైనది. ఇరాన్ పై యుద్ధానికి అమెరికాను పురిగొల్పిన ఇజ్రాయిల్ ప్రస్తుతం ఇరాన్ అమెరికాల మధ్య సాగుతున్న చర్చల పట్ల, ఎంఓయూ పట్ల ఆగ్రహం ప్రదర్శిస్తూ అమెరికాను లెక్క చేయకుండా లెబనాన్‌పై దాడులు కొనసాగించడంపై ట్రంప్ తీవ్ర స్థాయిలో బెంజిమన్ నెతన్యాహూపై విరుచుకుపడడం ఇరు మిత్రదేశాల మధ్య దూరం పెరగడానికి కారణం కావడం గమనార్హం. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో భవిష్యత్తులో ఇజ్రాయిల్ ఒంటరిగా మిగిలిపోతుందా? లేక అమెరికా చెప్పినట్టు వింటుందా అనేప్రశ్నలు తలెత్తుతున్నాయి. 'అనువు గాని చోట అధికులమనరాదు' అనే వేమన పద్యం అమెరికా విషయంలో మరోసారి నిరూపించబడింది. ట్రంప్ అహానికి తగిన శాస్తి జరిగింది. ప్రపంచ ప్రజల మనోభిప్రాయం నెరవేరింది. యుద్ధానికి కేంద్ర బిందువుగా మారిన



హార్మూజ్ జలసంధి గుండా ప్రయాణించే ప్రపంచ దేశాల చమురు నౌకలపై ఎలాంటి ట్రాన్సిట్ టోల్స్‌లేకుండా స్వేచ్ఛగా ప్రయాణం చేసే వెసులుబాటు లభించింది. అమెరికా ఇప్పటివరకు ఇరాన్‌లో కొనసాగించిన నావెల్ బ్లాకేడ్‌ను నిలిపి వేసింది. స్విట్జర్లాండ్‌లో కుదిరిన అవగాహనా ఒప్పందంపై అమెరికా, ఇరాన్ దేశాలు సంతకా లు చేసాయి. పూర్తి స్థాయి శాంతి ఒప్పందానికి ఇంకా అనేక దఫాలుగా చర్చలు జరగవలసి ఉంది. ఈ ఒప్పందం ఆచరణ రూపం దాల్చితే ఇక నుంచి ఇరాన్ పై అమెరికా మిలటరీ ఆపరేషన్లు ఆగిపోతాయి. ఇరాన్‌పై ఆంక్షలను సడలించడం, అమెరికా ఫ్రీజ్ చేసిన 24 బిలియన్ డాలర్ల ఇరాన్ నిధులను దశల వారీగా విడుదల చేయడానికి ట్రంప్ అంగీకరించడం జరిగింది. ఇదే సందర్భంలో లెబనాన్ పై ఇజ్రాయిల్ దాడులు కూడా ఆగిపోవాలని ఇరాన్ డిమాండ్ చేస్తున్నది. ఇరాన్ విషయంలో ఒబామా సాధించలేనిది తాను పూర్తి చేస్తానని ప్రగల్భాలు పలికిన ట్రంప్ తుదకు సాధించిందేమిటి? ఆర్థిక పతనం వైపు పయనిస్తున్న అమెరికాను మరింత దివాలా తీయించడం తప్ప. 100 రోజులకు పైగా సాగిన పశ్చిమాసియా యుద్ధంలో ప్రపంచ దేశాలు తీవ్రంగా నష్టపోయాయి. ఆయిల్ సప్లై చెయిన్స్ విచ్ఛిన్నం కావడంతో ప్రపంచ దేశాల ఆర్థిక పరిస్థితులు తల్లక్రిందులయ్యాయి. ద్రవ్యోల్బణం తీవ్ర రూపం దాల్చింది. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఆర్థిక సంక్షోభం తీవ్ర స్థాయికి చేరుకుంటున్న తరుణంలో యుద్ధం ముగియడం ఆహ్వానించదగిన పరిణామమే. అయితే ఈ యుద్ధం ద్వారా అమెరికా సాధించిందేమిటనే ప్రశ్న తలెత్తడం సహజం. వాస్తవంగా ఈ యుద్ధం వలన అమెరికా సాధించిందేమీ లేదు. ఇరాన్ చేతిలో చావు దెబ్బ తిని, చేసేదేమీ లేక శాంతి ఒప్పందం పేరుతో గౌరవప్రదంగా తప్పించుకోవడం తప్ప. ఇరాన్ అమెరికాల మధ్య రాజీ కుదర్చడంలో పాకిస్థాన్ పాత్ర పరిమితం.వాషింగ్టన్ టెహ్రాన్‌ల మధ్య సంధి కుదర్చడంలో ఖతార్ కీలక పాత్ర వహించింది. అమెరికా ఆంక్షల వలన ఇప్పటికే ఇరాన్ తీవ్రంగా నష్టపోగా,ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొని నిలబడడం విశేషం. యుద్ధంలో ఇరాన్ 350బిలియన్ డాలర్లకు పైగా, అమెరికా వంద బిలియన్ల డాలర్లకు పైగా నష్టాన్ని చవి చూసిచూసాయి. యుద్ధంతో సంబంధం లేని అనేక దేశాలు కూడా తీవ్రంగా నష్టపోగా, భారత్ కూడా ఈ యుద్ధంవలన సుమారు 50 బిలియన్ల డాలర్లు నష్టపోయినట్టు అంచనా. ప్రస్తుతం యుద్ధానికి ముగింపు వాక్యం పలికినా ఇంకా ఎన్నో అనుమానాలు కలుగుతున్నాయి. ట్రంప్ నిర్ణయం నెతన్యాహుకు అంగీకారయోగ్యం కాలేదు. అయితే అమెరికా నిర్ణయాలు ఇతర దేశాల మెప్పు కోసం కాదని జెడివాన్స్ చెప్పడం ఇజ్రాయిల్‌కు మింగుడు పడడం లేదు. అమెరికా ఇరాన్ మధ్య కుదిరిన ఎం.ఓ.యూ పూర్తి స్థాయి శాంతి ఒప్పందానికి దారి తీస్తుందా? లేక మధ్యలో ఇరాన్, ఇజ్రాయిల్ దేశాలు మడతపేచీ పెడతాయా? అనే విషయం స్పష్టం కావలసి ఉంది. నిలకడ లేని ట్రంప్ భవిష్యత్తులో ఇరాన్ పై దాడి చేయబోడనే గ్యారంటీ ఉందా? హమాస్, హెజ్బొల్లా సంస్థలపై ఇరాన్ తన అనుకూల ధోరణిని మార్చుకుంటుందా? అపారమైన ప్రాణనష్టం జరిగిన గాజా, లెబనాన్‌లపై అమెరికా, ఇజ్రాయిల్, ఇరాన్‌ల దృక్పథంఎలా ఉండబోతుంది? ఇందుకు కాలమే సమాధానం చెప్పాలి. ఇరాన్ పై యుద్ధం కారణంగా ఇజ్రాయిల్ కూడా భారీగా నష్టపోయింది. యుద్ధం పేరుతో అధికారంలో కొనసాగుతున్న బెంజిమన్ నెతన్యాహుకు అమెరికా, ఇరాన్‌ల మధ్య కుదిరిన శాంతి ఒప్పందం ఆశనిపాతం.ఇప్పటికైనా యుద్ధం ముగియడం ఆహ్వానించదగ్గ అంశమే అయినా ఈ విషయంలో పూర్తిస్థాయి ఒప్పందం కుదిరే వరకు స్పష్టత రాదు. •

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# సౌరశక్తి విస్తరణతో హరిత ఉద్యోగాలు

### యువ నిపుణులు, సాంకేతిక కార్మికులకు స్థిరమైన ఉపాధి

### కలిసిరానున్న ప్రభుత్వ ప్రోత్సాహకాలు, ఆర్థిక సాయం

### గ్రామీణ ఆర్థిక వ్యవస్థలు బలోపేతమయ్యే అవకాశం



**న్యూఢిల్లీ, జూన్ 24:** ప్రస్తుతం అందుబాటులో ఉన్న విద్యుత్ వనరులలో రూఫ్‌టాప్ సోలార్ ఇప్పటికే అత్యంత చవకైన వాటిలో ఒకటిగా ఉంది. దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాలలో, సౌరశక్తి పెరుగుదల పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో చిన్న తరహా పరిశ్రమల స్థాపనను కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నది. భారతదేశంలో సౌరశక్తి విస్తరణ కొత్త తరం హరిత ఉద్యోగాలను సృష్టిస్తోంది. ఈ రంగానికి శిక్షణ పొందిన టెక్నీషియన్లు, ఇన్‌స్టాలర్లు, ఎలక్ట్రీషియన్లు, నిర్వహణ నిపుణులు, బ్యాటరీ నిర్వహణ నిపుణులు, ఎనర్జీ ఆడిటర్లు అవసరం.

పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో సోలార్ సహకార సంఘాలు విస్తరిస్తున్న కొద్దీ, ప్రత్యేక నైపుణ్యాలకు డిమాండ్ పెరుగుతూనే ఉంటుంది, ఇది యువ నిపుణులకు, సాంకేతిక కార్మికులకు స్థిరమైన ఉపాధి అవకాశాలను సృష్టిస్తుందని తాజాగా ఓ నివేదిక వెల్లడించింది.

జాతీయ సౌరశక్తి హక్కు, దానికి తోడుగా సహాయక ఆర్థిక సహాయం, సామాజిక భాగస్వామ్యం, భారతదేశంలో ఇంధన ఖర్చులను తగ్గించడానికి, ఇంధన భద్రతను బలోపేతం చేయడానికి, లక్షలాది హరిత ఉద్యోగా లను సృష్టించడానికి, స్థితిస్థాపక, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న సమాజాలను నిర్మించడానికి సహాయపడనున్నాయి. స్వచ్ఛ ఇంధన విప్లవం ఇకపై సుదూర దృష్టి కాదు. సోలార్ కమ్యూనిటీల ద్వారా, ఇది భారతదేశంలోని ప్రతి గ్రామంలో, ప్రతి పరిసర ప్రాంతంలో, ప్రతి ఇంటి పైకప్పుపై ప్రారంభం కావచ్చని అభిప్రాయం ఇంధన రంగ నిపుణులు చెబుతున్నారు.

సరసమైన ధరలో లభించే హరిత విద్యుత్తు అందుబాటులోకి రావడంవల్ల పిండి మిల్లులు, వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్ యూనిట్లు, గ్రైండింగ్ మిల్లులు, ఇతర సూక్ష్మ పరిశ్రమల వంటి సంస్థలు ఆకర్షితులవుతాయి. ఈ అనుసంధానాలను సులభతరం చేయడంలో పంచాయతీలు, స్థానిక సంస్థలు కీలక పాత్ర పోషించగలవు. తద్వారా అదనపు ఉపాధిని సృష్టించి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలను బలోపేతం చేయగలవని అభిప్రాయం వ్యక్తమవుతోంది. అనేక నివాస సముదాయాలు అపార్ట్‌మెంట్ భవనాలు, పార్కింగ్ నిర్మాణాలు, ఉమ్మడి సౌకర్యాలపై రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలను ఏర్పాటు చేస్తున్నాయని కూడా ఇంధనరంగ నిపుణులు చెబుతున్నారు.

ఈ విధంగా ఉత్పత్తి అయిన విద్యుత్తు లిఫ్టులు, నీటి పంపులు, లైటింగ్ వ్యవస్థలు, భద్రతా మౌలిక సదుపాయాలకు శక్తిని అందిస్తుంది, తద్వారా నిర్వహణ ఖర్చులను తగ్గించి, నివాసితుల విద్యుత్ బిల్లులను తగ్గిస్తుంది.

శిలాజ ఇంధన ఆధారిత విద్యుత్తు స్థానంలో పునరుత్పాదక సౌరశక్తిని ఉపయోగించడం ద్వారా, సమాజాలు గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను, వాయు కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించగలవని అభిప్రాయం వ్యక్తమవుతోంది. సౌర సమాజాలు స్థానిక పర్యావరణ నాణ్యతను మెరుగుపరుస్తూనే, జాతీయ వాతావరణ లక్ష్యాలకు నేరుగా దోహదం చేస్తాయి.

సామాజిక ప్రయోజనాలు కూడా అంతే ముఖ్యమైనవి. సామాజిక యాజమాన్యంలోని ఇంధన వ్యవస్థలు పౌర భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తాయి, సామాజిక సహకారాన్ని బలోపేతం చేస్తాయి. తక్కువ ఆదాయ వర్గాలకు, వెనుకబడిన వర్గాలకు స్వచ్ఛమైన, సరసమైన ఇంధన లభ్యతను మెరుగుపరుస్తాయని ఇంధనరంగ నిపుణులు పేర్కొంటున్నారు.

# ప్రైవేటు కళాశాలల్లో ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్

### ఫీజుల వ్యవహారంలో జోక్యం చేసుకోం: సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ, జూన్ 24:** ప్రైవేట్ వైద్య కళాశాలల్లో ప్రవేశాల విషయంలో ఆర్థికంగా బలహీన వర్గాల (ఇడబ్ల్యుఎస్) నిబంధనను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు బుధవారం కొట్టివేసింది. ప్రైవేట్ వైద్యకళాశాలలు లక్షలరూపాయల ట్యూషన్ ఫీజులు వసూలు చేస్తున్నప్పుడు, ఇడబ్ల్యుఎస్ అభ్యర్థులకుఉన్న రూ.8 లక్షల వార్షిక ఆదాయ పరిమితి అర్థరహితం అవుతుందన్న వాదనను అంగీకరించడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. ప్రైవేట్ వైద్య కళాశాలల ఫీజుల నిర్మాణం, ఆర్థికంగా బలహీన విద్యార్థులకు ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్‌ను కేవలం ఒక భ్రమగా మారుస్తోందని వాదించిన రాజస్థాన్ నివాసి అభ్యర్థి హర్షవర్ధన్ సింగ్ దాఖలు చేసిన సవాలును తిరస్కరించిన రాజస్థాన్ హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోవడానికి జస్టిస్ బి.వి. నాగారత్న, జయమాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం నిరాకరించింది. విచారణ సందర్భంగా, కేవలం ఇడబ్ల్యుఎస్ అభ్యర్థులకు సీట్లు రిజర్వ్ చేయబడ్డాయన్న కారణంతో, స్వయంనిధులు సమకూర్చుకునే ప్రైవేట్ సంస్థలను ప్రభుత్వ వైద్య కళాశాలలతో సమానంగా ఫీజులు వసూలు చేయమని బలవంతం చేయలేమని జస్టిస్ నాగారత్న నేతృత్వంలోని ధర్మాసనం మౌఖికంగా వ్యాఖ్యానించింది. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ప్రభుత్వ కళాశాలలు ప్రభుత్వ ఖజానా నుండి ఆర్థిక సహాయం పొందుతుండగా, ప్రైవేట్ కళాశాలలు స్వీయనిధుల నమూనాపై పనిచేస్తాయని వ్యాఖ్యానించింది.

"ఇవి స్వీయనిధుల సంస్థలు. ప్రభుత్వ సంస్థలు రాష్ట్ర ప్రభుత్వం నుండి గ్రాంట్లు పొందుతాయి. రెండింటి మధ్య కీలకమైన వ్యత్యాసం ఉంది" అని జస్టిస్ నాగారత్న నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. క్యాపిటేషన్ ఫీజులు నిషేధించబడినప్పటికీ, వర్తించే నియంత్రణ చట్రంకింద నిర్ణయించిన సాధారణ ట్యూషన్ ఫీజు లను ప్రైవేట్ కళాశాలలు వసూలు చేయలేరని దీని అర్థం కాదనికూడా అది స్పష్టంచేసింది.

ఏటారూ.8 లక్షలకంటే తక్కువసంపాదించే కుటుంబాలకు చెందిన ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఇడబ్ల్యుఎస్) అభ్యర్థులు, ప్రైవేట్ వైద్య కళాశాలల్లో రూ.18 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ఉండే వార్షిక ట్యూషన్ ఫీజులను వాస్తవంగా భరించలేరని పిటి షనర్ వాదించగా, ఆర్థిక సహాయ యంత్రాంగాలు అందుబాటులో ఉన్నాయని సుప్రీంకోర్టు సూచిం చింది. "మీరుచెల్లించలేకపోతే, స్కాలర్‌షిప్ పొందండి" అని జస్టిస్ నాగారత్న నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది.



### సిఎం సువేందును కొనియాడిన మహువా మొయిత్రా

**కోల్‌కత్తా,జూన్ 24:** పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో మరోసారి ప్రకంపనలు మొదలయ్యాయి. తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) ఎంపి మహువా మొయిత్రా, రాష్ట్ర ముఖ్యమంత్రి, బిజెపి నేత సువేందు అధికారిపై ప్రశంసలు కురిపించడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఆయనతో తనకు ఉన్న వ్యక్తిగత అనుబంధాన్ని ఆమె గుర్తు చేసుకున్నారు. పార్టీలో తిరుగుబాటు, ఎన్నికల్లో ఓటమితో టిఎంసి తీవ్ర సంక్షోభంలో ఉన్న తరుణంలో మహువా చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. బిబిసి ఇంటర్వ్యూలో మహువా మొయిత్రా మాట్లాడుతూ, సువేందు అధికారితో నాకు వ్యక్తిగతంగా మంచి సంబంధాలుఉన్నాయి. మేమిద్దరం టిఎంసిలో ఉన్నప్పుడు ఆయన నాకు ఎంతో మద్దతుగా నిలిచారు. 2016 అసెంబ్లీ ఎన్నికల్లో తాను కరింపూర్ నుంచి పోటీ చేసినప్పుడు, సీనియర్ నేతలెవరూ రాకపోయినా సువేందు తన తొలి ర్యాలీలో పాల్గొన్నారని ఆమె గుర్తు చేసుకున్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి చేతిలో టిఎంసి ఓటమి పాలైనవిషయం విదితమే. సువేందు అధికారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టగా, మమతా బెనర్జీ సైతం పరాజయాన్ని చవిచూశారు. ఎన్నికల అనంతరం టిఎంసిలో సంక్షోభం మరింత ముదిరింది. రితబ్రత బెనర్జీ నేతృత్వంలోని తిరుగుబాటు వర్గం తమకు సుమారు 60 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని ప్రకటించింది. పలువురు ఎంపీలుకూడా బిజెపి నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి మద్దతు ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీలో టిఎంసి విలీనంఅవుతుందన్న వార్తల్లోను మహువా మొయిత్రా కొట్టిపారేశారు. మమతా బెనర్జీకి అత్యంత నమ్మకస్తురాలిగా పేరున్న మహువా, ఇప్పుడు ప్రత్యర్థి పార్టీకి చెందిన ముఖ్యమంత్రిని కొనియాడటం పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో సరికొత్త చర్చకు దారితీసింది.

# హర్ముజ్ సుదీర్ఘ మూసివేతతో రూ.10.4 లక్షల కోట్ల సరకు నిలిపివేత



**టెహ్రాన్, వాషింగ్టన్,జూన్ 24:** ప్రపంచంలోనే అత్యంత రద్దీ సముద్ర రవాణా మార్గమైన హర్మూజ్ జలసంధి సుదీర్ఘకాలం మూసివేతతో అంతర్జాతీయ వాణిజ్యం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. పర్షియన్ గల్ఫ్‌లో దాదాపు 125 బిలియన్ డాలర్లు అంటే సుమారు రూ. 10.4 లక్షల కోట్లు విలువైన సరుకుతో ఉన్న 1,200కి పైగా సరుకు రవాణా నౌకలు అక్కడే నిలిచిపోయినట్లు సముద్ర బీమా సంస్థలు, షిప్పింగ్ డేటా నివేదికలు వెల్లడించాయి. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ఈ అంతర్జాతీయ జలమార్గం గుండా రవాణా పూర్తిగా నిలిచిపోయింది. ప్రపంచవ్యాప్తంగా సరఫరా అయ్యే ముడి చమురు, ద్రవీకృత సహజ వాయువు (ఎల్ఎన్‌జీ)లో ఐదో వంతు వాటా ఈ ఇరుకైన జలసంధి గుండానే సాగుతుంది. ఫిబ్రవరి 2026 చివరలో ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సైనిక దాడులు చేయడంతో ఈ సంక్షోభం ప్రారంభమైంది. జూన్ మధ్యలో అమెరికా ఇరాన్ మధ్య తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ కాల్పుల విరమణ ఉల్లంఘనలు జరిగాయంటూ ఇరాన్ చేసిన తాజా ప్రకటనలు మళ్లీ ఆందోళనలను పెంచాయి. అలియాంజ్ కమర్షియల్ సేఫ్టీ అండ్ షిప్పింగ్ నివేదిక ప్రకారం జూన్ మధ్య నాటికి సుమారు 29 మిలియన్ గ్రాస్ టన్నుల బరువున్న 1,150 నుండి 1,200 సరుకు రవాణా నౌకలు నిలిచిపోయాయి. వీటితో పాటు దాదాపు 20,000 మంది నావికులు నెలల తరబడి సముద్రంలోనే చిక్కుకుపోయారు. ఆహార కొరత, మానవీయ సంక్షోభం ఎదుర్కొంటున్న ఈ సిబ్బందిని సురక్షితంగా తరలించేందుకు ఒమన్ దేశం సమన్వయంతో ఒక ప్రత్యేక తరలింపు కారిడార్‌ను ఏర్పాటు చేశారు. ఉద్రిక్తతలు గరిష్ఠ స్థాయికి చేరిన సమయంలో జరిగిన దాడుల్లో 40కి పైగా నౌకలు దెబ్బతినగా, కనీసం 14 మంది నావికులు మరణించారు. ఈ జలసంధి మూసివేత వల్ల ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు ఒక్కసారిగా పెరిగాయి. ముడి చమురు ధర కొన్ని సందర్భాల్లో బ్యారెల్‌కు 100 డాలర్లు దాటిపోయింది. నౌకలను ఆఫ్రికా చుట్టూ లేదా ప్రత్యామ్నాయ భూమార్గాల ద్వారా మళ్లించాల్సి రావడంతో రవాణా ఖర్చులు భారీగా పెరిగి, సరుకు సరఫరా ఆలస్యమవుతోంది. దాదాపు మూడు లక్షల కంటైనర్ కార్గో ఇంకా అక్కడే చిక్కుకుపోవడంతో ప్రాంతీయ ఓడరేవులపై తీవ్ర ఒత్తిడి పడుతోంది. ఉష్ణోగ్రతలకు దెబ్బతినే వస్తువులు, పాడైపోయే ఆహార పదార్థాల వల్ల బీమా క్లెయిమ్‌లు భారీగా పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. జూన్ చివరి వారంలో గల్ఫ్ నుండి నౌకల రాకపోకలు కొంతవరకు పెరిగినట్లు షిప్పింగ్ డేటా సూచిస్తోంది. లెబనాన్‌లో జరిగిన ఉల్లంఘనల కారణంగా ఈ మార్గాన్ని మళ్లీ మూసివేస్తామని ఇరాన్ ప్రకటించడం అనిశ్చితిని పెంచింది. హర్మూజ్, సూయజ్ కాలువ వంటి కీలక జలమార్గాలపైనే పూర్తిగా ఆధారపడకుండా ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కోవాల్సిన అవసరాన్ని ఈ సంక్షోభం గుర్తుచేస్తోందని షిప్పింగ్ రంగ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు.

# భారీ వర్షాలతో ముంబయి అతలాకుతలం

### మ్యాన్‌హోల్‌లో పడిపోయిన వ్యక్తిని రక్షించిన సిబ్బంది



**ముంబయి,జూన్ 24:** ఆర్థికరాజధాని ముంబయి మహానగరాన్ని భారీ వర్షాలు అతలాకుతలం చేసాయి. ముంబైను పలకరించిన రుతుపవనాలు తొలిరోజే నగరాన్ని అతలాకుతలంచేశాయి. రాత్రంతా కురిసిన కుండపోత వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీనికితోడు, ముంబైలో రుతుపవనాల కోసం తాము పూర్తిగా సిద్ధంగా ఉన్నామని, నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తామని మేయర్ రితూ తావడే ప్రకటించిన కొద్ది సేపటికే, అది కూడా ఆమె కళ్లెదుటే ఒక కార్మికుడు మ్యాన్‌హోల్‌లో పడిపోవడం పాలనాయంత్రాంగం వైఫల్యాన్ని ఎత్తిచూపింది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు, పౌర సిబ్బంది సహాయక చర్యలు చేపట్టి అతడిని సురక్షితంగా బయటకు తీయడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనకు కొద్ది నిమిషాల ముందు గాంధీ మార్కెట్ వద్ద మేయర్ రితూ తావడే మాట్లాడుతూ నగరంలో పంపులన్నీ పనిచేస్తున్నాయని, రోడ్లు శుభ్రంగా ఉన్నాయని, అధికారులు క్షేత్ర స్థాయిలో పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. నాలాలు శుభ్రపరిచే పనులు దాదాపు పూర్తయ్యాయని, విమర్శలు చేస్తున్న వారు ఈ రోజు ఇళ్లలో కూర్చున్నారని ఆమె వ్యాఖ్యానించారు. అయితే, ఆమె ప్రకటనకు భిన్నంగా వాస్తవ పరిస్థితి కనిపించింది. సాధారణంగా జూన్ 10న ప్రవేశించాల్సిన రుతుపవనాలు ఈసారి 13 రోజులు ఆలస్యంగా ముంబైకి చేరాయి. రాత్రిపూట కురిసిన భారీ వర్షానికి నగరం గడిచిన 24 గంటల్లో సగటున 195 మిల్లీమీటర్ల వర్షపాతాన్ని నమోదు చేసింది. పశ్చిమ శివారు ప్రాంతాల్లో 208 మి.మీ., తూర్పు శివారు ప్రాంతాల్లో 167 మి.మీ. వర్షపాతం నమోదైంది. దీంతో అంధేరి సబ్‌వే, హింద్‌మాతా, కింగ్స్ సర్కిల్ వంటి ప్రాంతాలు నీటిలో మునిగిపోయాయి. ఉదయం వేళ ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షాల కారణంగా సబర్బన్ రైలు సర్వీసులకు తీవ్ర అంతరాయం కలిగింది. రైళ్లు ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు కిక్కిరిసిపోయారు.



### టివికె ఎమ్మెల్యే బిడ్డకు టివికె పేరుపెట్టిన సిఎం

**చెన్నై,జూన్ 24:** టివికె చీఫ్, సిఎం జోసఫ్ విజయ్, టివికె ఎమ్మెల్యే ఎంఆర్ పల్లవికి పుట్టిన శిశువుకు అధికారికంగా తమిళ్ వెట్రికొండన్ అని నామకరణం చేశారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యే కుటుంబ సభ్యుల మధ్య పండగ వాతావరణంలో సచివాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఆ పసికందును ఆప్యాయంగా ఒడిలోకి తీసుకొని పేరు పెట్టి ముద్దు చేశారు. ఎంఆర్ పల్లవి తిరువికా నగర్ నియోజకవర్గం నుంచి టివికె తరఫున తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. నిండు గర్భిణిగా ఉన్నప్పటికి ఇంటింటికి ప్రచారం చేసి ఆమె వార్తల్లో నిలిచారు. అయితే పల్లవి టివికె పార్టీ మొదటి అక్షరాలు కలిసొచ్చేలా బిడ్డకు పేరు పెట్టాలని బలంగా కోరుకున్నారు. ఇదే విషయాన్ని సిఎం విజయ్ దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన సిఎం టివికె పార్టీ స్ఫురించేలా తమిళ్ వెట్రికొండన్(టివికె) అని పేరు పెట్టారు. అయితే తమిళ వెట్రి కొండన్ అనే పేరు విజయ్ నటించిన రాబోయే జననాయగన్ చిత్రంలో విజయ్ పాత్ర పేరు కావడం విశేషం.

# నిర్మాణంలో ఉన్న గోడౌన్ కూలి ఎనిమిది మంది మృతి



### 45 మందికిపైగా శిథిలాల కిందనే

**కోల్‌కత్తా,జూన్ 24:** కోల్‌కతాలో కనీవినీ ఎరుగని ఘోర విషాదం చోటుచేసుకుంది. నిర్మాణంలో ఉన్న గిడ్డంగి పైకప్పు కూలిపోవడంతో ఘోర ప్రమాదం జరిగింది. 40నుంచి 45 మంది చిక్కుకుపోయినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో 8 మంది చనిపోగా మరికొందరు తీవ్రగాయాల పాలైనట్లుగా తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనాస్థలికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టారు. కోల్‌కతాలోని తారతల పోలీస్ స్టేషన్ పరిధిలోని ట్రాన్స్‌పోర్ట్ డిపోరోడ్డులో నిర్మాణంలోఉన్న ఒకగిడ్డంగి పైకప్పుకూలిపోయింది. పెద్ద సంఖ్యలో కార్మికులు అందులో చిక్కుకుపోయినట్లు భావిస్తున్నారు. ఈ ఘటన గురించి సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, పరిపాలనా బృందాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. సహాయక, రెస్క్యూ ఆపరేషన్లు కొనసాగుతున్నాయి. స్థానికుల కథనం ప్రకారం నిర్మాణంలో ఉన్న భవనం పక్కన చాలా మంది పనిచేస్తున్నారు. సహాయక, రెస్క్యూ బృందాలు ఏడుగురిని రక్షించారు. స్థానికులు కూడా సహాయక చర్యలు ప్రారంభించారు. షెడ్లు, శిథిలాలకింద చిక్కుకున్న వారిని రక్షిస్తున్నారు. ఈ ఘటనలో పెద్ద సంఖ్యలో ప్రజలు గాయపడి ఉంటారని భావిస్తున్నారు. రక్షించబడిన వారిని పరిపాలనా బృందాలు ఆసుపత్రులకు తరలించాయి.

# టెహ్రాన్‌కు ప్రయాణాలు రద్దుచేసుకోండి

### విదేశాంగశాఖ అడ్వయిజరీ జారీ

**టెహ్రాన్,జూన్ 24:** ఇరాన్‌లో భద్రతా పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని భారత ప్రభుత్వం మరోసారి కీలక ట్రావెల్ అడ్వైజరీ జారీ చేసింది. టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం విడుదల చేసిన తాజా సూచనల ప్రకారం, తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు భారత పౌరులు ఇరాన్‌కు అనవసర ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని సూచించింది. ఇటీవల పరిస్థితులు కొంత మెరుగుపడినప్పటికీ, పూర్తిస్థాయిలో సాధారణ స్థితి నెలకొనలేదని రాయబార కార్యాలయం పేర్కొంది. రాయబార కార్యాలయంప్రకారం, అవసరం లేకపోతే ప్రస్తుతం ఇరాన్‌కు ప్రయాణించకపోవడమే మంచిదని సూచించింది.

ప్రాంతీయ భద్రతా పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, పరిస్థితులకు అనుగుణంగా తదుపరి సూచనలు జారీచేస్తామని వెల్లడించింది. ప్రస్తుతం ఇరాన్‌లో నివసిస్తున్న లేదా అక్కడికి అత్యవసరంగా వెళ్లాల్సిన భారతీ యులు అప్రమత్తంగా ఉండాలి. స్థానిక అధికారుల సూచనలను పాటించాలి. తాజా భద్రతా సమా చారం కోసం అధికారిక ప్రకటనలను గమనించాలి. భారత రాయబార కార్యాలయంతో నిరంతర టచ్‌లో ఉండాలి అని సూచించింది. రాయబార కార్యాలయంలో నమోదు తప్పనిసరి అని పేర్కొంది. ఇరాన్‌లో ఉన్న భారత పౌరులు, అలాగే త్వరలో అక్కడికి వెళ్లే వారు తమ వివరాలను టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయం అందించడానికి ఈ నమోదు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

## సంక్షిప్త వార్తలు

### ఖొమేనీ అంత్యక్రియలకు ప్రధాని మోడీకి ఆహ్వానం



**టెహ్రాన్,జూన్ 24:** ఇరాన్ మాజీ సుప్రీంలీడర్ అలీ ఖొమేనీ అంత్యక్రియలకు హాజరుకావాలని భారత ప్రధాని మోదీకి ఇరాన్ ప్రత్యేక ఆహ్వానం పంపించింది. ఈ మేరకు ఆ దేశ అధ్యక్షుడు పెజెష్కియాన్ స్వయంగా లేఖ రాసినట్లు తెలుస్తోంది. మరి దీనిపై కేంద్రం ఎలా స్పందిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. భారత్ ఇప్పటివరకు ఇరాన్ అమెరికా ఉద్రిక్తతల విషయంలో శాంతి, చర్చల ద్వారానే పరిష్కారం కావాలని తన వైఖరిని కొనసాగిస్తోంది. ఖొమేనీ అంత్యక్రియల కార్యక్రమాలు జులై 4న ప్రారంభం కానున్నాయి. పలు దశల్లో జరిగే నివాళి కార్యక్రమాల అనంతరం జులై 9న ఆయన స్వస్థలమైన మష్హాద్‌లో ఖననం చేయనున్నారు. టెహ్రాన్, ఖోమ్ నగరాల్లో కూడా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

### పాక్ గగనతలంలోకి ఎయిరిండియా విమానం

**న్యూఢిల్లీ,జూన్ 24:** ఎయిర్ ఇండియాకు చెందిన ఎఐ321 ఢిల్లీ అమృత్‌సర్ విమానం పాకిస్థాన్ గగనతలంలోకి ప్రవేశించింది. దీంతో కొంత ఉద్రిక్త క్షణాలు నెలకొన్నాయి. అయితే పెహల్గామ్ ఉగ్రదాడి ఘటన తర్వాత రెండు దేశాల మధ్య సరైన సంబంధాలు లేని విషయం తెలిసిందే. సోమవారం రాత్రి ఎయిర్ ఇండియాకు చెందిన విమానం కొన్ని సెకన్ల పాటు పాక్ గగనతలంలోకి ప్రవేశించినట్లు తెలిసింది. ఈ ఘటనపై దర్యాప్తు చేపడుతున్నట్లు ఎయిర్ ఇండియా చెప్పింది. పాక్ వైమానిక క్షేత్రంలోకి ప్రవేశించిన విషయాన్ని పైలట్ గుర్తించాడని, పాకిస్థాన్ ఎయిర్ ట్రాఫిక్ అథారిటీ నుంచి పైలట్‌కు వార్నింగ్ మెసేజ్‌లు వచ్చినట్లు తెలిసింది.

### ఇరాన్‌పై సైనిక చర్యలు: ట్రంప్ అధికారాల కట్టడి

**వాషింగ్టన్,జూన్ 24:** ఇరాన్‌పై సైనిక చర్యల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు స్వదేశంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కాంగ్రెస్ అనుమతి లేకుండా ఇరాన్‌తో ఘర్షణలకు దిగకుండా అమెరికా బలగాలను ఉపసంహరించుకోవాలని ఆదేశిస్తూ యూఎస్ సెనేట్ మంగళవారం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఈ తీర్మానానికి అనుకూలంగా 50 ఓట్లు, వ్యతిరేకంగా 48 ఓట్లు వచ్చాయి. అధికార రిపబ్లికన్ పార్టీకి చెందిన నలుగురు సెనేటర్లు డెమొక్రాట్లతో కలిసి ఈ తీర్మానానికి మద్దతు తెలపడం గమనార్హం. ఇప్పటికే ప్రతినిధుల సభలోనూ ఇదే తరహా తీర్మానం ఆమోదం పొందింది. ఉభయ సభల ఆమోదం లభించిన నేపథ్యంలో, దీనికి అధ్యక్షుడి సంతకం అవసరం లేదు. ఇది చట్టబద్ధంగా ట్రంప్‌ను కట్టడి చేయలేకపోయినప్పటికీ, రాజకీయంగా ఆయనపై తీవ్ర ఒత్తిడి పెంచుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

### తమిళనాట నవజాత శిశువులకు బంగారు ఉంగరం

**చెన్నై,జూన్ 24:** తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తాయిమామన్ గోల్డ్ రింగ్ పథకాన్ని త్వరలోనే ప్రారంభించనున్నారు. ఈ పథకం కోసం బడ్జెట్ లో రూ. 755.83 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 22 నుంచి ప్రభుత్వ ఆస్పత్రిలో పుట్టిన బిడ్డలకు ఈ పథకం వర్తిస్తుందని స్పష్టం చేశారు. తాయిమామన్ గోల్డ్ రింగ్ స్కీమ్‌ను సెప్టెంబర్ 15న పెరియార్ అన్నా జన్మదినం సందర్భంగా ప్రారంభిస్తామని సిఎం విజయ్ పేర్కొన్నారు. ఇదే విషయంపై రాష్ట్ర ఆరోగ్య, మానవవనరుల శాఖ ప్రకటన చేసింది. తమిళనాడులో శాశ్వత నివాసం ఉన్న కుటుంబాలకు మాత్రమే ఈ పథకంవర్తిస్తుందని తెలిపింది.

### ఖతార్‌లో భారతీయుల మృతికి అమీర్ సంతాపం

**న్యూఢిల్లీ, జూన్ 24:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఖతార్ దేశ అమీర్ షేక్ తమీమ్ బిన్ హమద్ అల్ థానీ టెలిఫోన్‌లో సంభాషించారు. ఖతార్‌లోని రాస్ లఫాన్ ఇండస్ట్రియల్ సిటీలో ఆదివారం జరిగిన ప్రమాదంలో భారతీయులు మృతి చెందిన ఘటనపై అమీర్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. అలాగే గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధిత కుటుంబాల పట్ల సానుభూతి వ్యక్తం చేసినందుకు ప్రధాని మోడీ ఖతార్ అమీర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారికి ఖతార్ ప్రభుత్వం వెంటనే వైద్య సహాయం అందించినందుకు ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా ఇరు దేశాల నాయకులు తమ దేశ పౌరుల సంక్షేమం, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని పునరుద్ఘాటించారు.

వార్త, రాజమహేంద్రవరం, గురువారం 25, జూన్ 2026



## సిఎం చంద్రబాబుకి ఉద్యోగ సంఘాల కృతజ్ఞతలు

**విజయవాడ, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల దీర్ఘకాలిక డిమాండ్లను పరిష్కరిస్తూ రాష్ట్ర మంత్రిమండలి తీసుకున్న కీలక నిర్ణయాల పట్ల ఉద్యోగ సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపినందుకు ముఖ్యమంత్రికి ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు. పలు విభాగాల్లో ఉద్యోగుల పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచడం, పాత పెన్షన్ విధానం (ఓపిఎస్) వర్తింపజేయడం వంటి నిర్ణయాలు వేలాది మంది ఉద్యోగులకు, వారి కుటుంబాలకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తాయని నేతలు పేర్కొన్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం లభించడం పట్ల వారు సంతోషాన్ని వెలిబుచ్చారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్) నోటిఫికేషన్‌కు ముందే నియామక ప్రక్రియ పూర్తయి, ఆ తర్వాత విధుల్లో చేరిన వారికి పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేస్తూ ప్రభుత్వం మార్గం సుగమం చేసింది. ప్రభుత్వ నిర్ణయాలు ఉద్యోగ వర్గాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయని నేతలు అభిప్రాయపడ్డారు. సిఎం చంద్రబాబు గత రాత్రి స్వయంగా కలిసి కృతజ్ఞతలు తెలిపామని ఏపి జెఎసి ఛైర్మన్ విద్యాసాగర్ తెలిపారు. ప్రధాన కార్యదర్శి ప్రసాద్, ఏపి సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి నాపా ప్రసాద్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధి కోసం ఉద్యోగులందరూ కలిసికట్టుగా కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వారికి సూచించారు.

## ప్రజల సమస్యలన్నింటిని నిర్దిష్ట విధానాల్లో, సంతృప్త స్థాయిలో పరిష్కరిస్తాం

● శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్



**విజయవాడ, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని ప్రజా సమస్యలను పరిష్కరించడంలో గత ప్రభుత్వ విఫలమైందని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖల మంత్రి పయ్యావుల కేశవ్ వ్యాఖ్యానించారు. అన్ని రంగాలను ఆ ప్రభుత్వ తన అనుచిత విధానాలతో నిర్వీర్యం చేసిందన్నారు. తమ ప్రభుత్వం పాలనా వ్యవస్థను సరిదిద్దిందన్నారు. ప్రజల సమస్యలన్నింటిని నిర్దిష్ట విధానాల్లో, సంతృప్త స్థాయిలో పరిష్కరిస్తుందన్నారు. రాష్ట్ర ప్రజల సమస్యల పరిష్కారానికి మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజాదర్బార్' కార్యక్రమంలో మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన ప్రజలను స్వయంగా కలుసుకుని, వారి సమస్యలు, వినతులను విని వారి నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సమగ్రంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కారం అందించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించడం కూటమి ప్రభుత్వ ప్రధాన బాధ్యతగా భావిస్తున్నామని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి, సమర్థవంతమైన పాలన, పారదర్శకతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆయన స్పష్టం చేశారు.

## ప్రకృతి విపత్తుల నియంత్రణపై కొడూరులో అంతర్రాష్ట్ర మాక్ ఎక్సర్‌సైజ్

### దక్షిణాది రాష్ట్రాల విపత్తుల నివారణ ప్రతినిధులు హాజరు



**విజయవాడ, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రాల మధ్య విపత్తు సంసిద్ధత, పరస్పర సమన్వయం, అత్యవసర ప్రతిస్పందన సామర్థ్యాలను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం ఆధ్వర్యంలో బుధవారం కృష్ణా జిల్లా కొడూరు మండలంలో దక్షిణ భారత్ స్థాయిలో అంతర్ రాష్ట్ర మాక్ ఎక్సర్‌సైజ్-2026 విజయవంతంగా నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆదేశాలకు అనుగుణంగా దక్షిణ ప్రాంతానికి సంబంధించి ఈ విన్యాసాన్ని నిర్వహించే ప్రధాన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ జాతీయ విపత్తుల నియంత్రణ సంస్థ గుర్తించింది. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హరీష్‌కుమార్ గుప్తా మార్గ దర్శకత్వంలో ఎన్.మధుసూదన రెడ్డి, అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (లా అండ్ ఆర్డర్), డా. ఫక్కీరప్ప కాగినెల్లి డిఐజి (లా అండ్ ఆర్డర్), డి. ఉదయ్ భాస్కర్, డిఐజి (ఏపీఎస్పీ బెటాలియన్స్), ప్రఖర్ జైన్‌మేనేజింగ్ డైరెక్టర్, డి.కె. బాలాజీ, జిల్లా కలెక్టర్, కృష్ణా జిల్లా, వి. విద్యాసాగర్ నాయుడు, పోలీస్ సూపరింటెండెంట్, వి.వి.ఎన్. ప్రసన్న కుమార్, కమాండెంట్, 10వ బెటాలియన్, ఎన్డి ఆర్ఎఫ్ వారి సహకారంతో, ఎపిఎస్‌డిఆర్ఎఫ్ ఆధ్వ ర్యంలో ఎపిఎస్‌డిఎంఎ, జిల్లా యంత్రాంగం, ఎన్డి ఆర్ఎఫ్, ఇతర భాగస్వామ్య శాఖల సమన్వయంతో దక్షిణ ప్రాంత సంయుక్త విపత్తు నిర్వహణ విన్యాసం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమా నికి ఎపిఎస్‌పి బెటాలియన్స్, ఎపిఎస్‌డిఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. రాజకుమారి, ప్రధాన సమన్వయకర్తగా వ్యవహరించి, విన్యాసానికి సంబంధించిన అన్ని ప్రణాళికలు, సమన్వయ చర్యలు, కార్యాచరణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. వివిధ శాఖల మధ్య సమర్థవంతమైన సమన్వయాన్ని నిర్దేశించారు. ఈ విన్యాసానికి ముందస్తు సన్నాహక కార్యక్రమాలలో భాగంగా ఇటీవల సమన్వయ సమావేశం నిర్వహించారు. అనుసరణగా టేబుల్‌టాప్ ఎక్సర్‌సైజ్ నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఒడిశా రాష్ట్రాలకు చెందిన అధికారులు పాల్గొ న్నారు. ప్రధాన విపత్తులు, అత్యవసర పరిస్థితుల్లో రాష్ట్రాల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడం, విపత్తు సంసిద్ధతను పెంపొందించడం, ఉమ్మడి ప్రతిస్పందన వ్యవస్థలను మెరుగుపరచడం ఈ విన్యాసం ముఖ్య ఉద్దేశ్యం. ఈ మాక్ ఎక్సర్‌సైజ్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఎస్‌డిఆర్ఎఫ్ జిల్లా యంత్రాంగం, అగ్నిమాపక శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, రెవెన్యూ శాఖ, విద్యుత్ శాఖ, మత్స్యశాఖ, పశు సంవర్ధక శాఖ, నీటిపారుదల శాఖ, సముద్ర శాఖ, స్థానిక పోలీసులు, పంచాయతీ రాజ్ శాఖ, హోం గార్డులు, వాలంటీర్లు, స్థానిక ప్రజలు, ఇతర భాగ స్వామ్య సంస్థలు చురుకుగా పాల్గొన్నాయి. వరద పరిస్థితుల్లో నిర్వహించాల్సిన శోధన, రక్షణ చర్యలు, ప్రభావిత ప్రజల తరలింపు, వైద్య సహాయం, సహాయక శిబిరాల నిర్వహణ, కమ్యూనికేషన్ వ్యవస్థల సమన్వయం, వివిధ శాఖల సమగ్ర ప్రతిస్పందన విధానాలను ఈ విన్యాసంలో ప్రదర్శించారు. ఈ విన్యాసం ద్వారా రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం, వనరుల భాగస్వామ్యం, అత్యవసర ప్రతిస్పందన సామర్థ్యాలు, విపత్తు నిర్వహణలో భాగస్వామ్య సంస్థల మధ్య సమన్వ యం మరింత బలోపేతం అవుతుందని అధికారులు తెలిపారు. వాతావరణ మార్పుల ప్రభావంతో వరదలు, తుఫానులు వంటి ప్రకృతి వైపరీత్యాలు తరచుగా సంభవిస్తున్న నేపథ్యంలో, ఇటువంటి మాక్ ఎక్సర్‌సైజ్‌లు విపత్తు సంసిద్ధతను పెంపొందిం చడంలో కీలక పాత్ర పోషిస్తాయని వారు పేర్కొ న్నారు. ఆధునిక సాంకేతికతల వినియోగం, సమర్థ వంతమైన సమన్వయ వ్యవస్థలు, ముందస్తు సంసి ద్ధత చర్యల ద్వారా ప్రజల ప్రాణాలు, ఆస్తులను రక్షిం చేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విపత్తు నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేయడానికి కట్టుబడి ఉందని డిజిపి హరీష్‌కుమార్ గుప్తా పునరుద్ఘాటించారు.

## శివయ్య సన్నిధిలో నటి హన్సిక పూజలు



**శ్రీకాళహస్తి, జూన్ 24 ప్రభాతవార్త:** సినీ నటి హన్సిక బుధవారం శ్రీకాళహస్తీశ్వరాలయంలో రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకున్నారు. ఆమె తమ బంధువులతో రాగా దక్షిణ గోపురం వద్ద బిజెపి యువ నాయకుడు కటికం చందు స్వాగతం పలికారు. రాహుకేతుదోష పూజల అనంతరం ఆమెకు స్వామి అమ్మ వార్ల ఆలయంలో అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. తరువాత మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలు అందించారు.

## అదిగదిగో పులి





● పాపికొండల్లో బెబ్బులి భయం ● పర్యాటక రంగంపై ప్రభావం.

● పెద్ద పులి సంచారంతో గిరిజన గ్రామాల్లో ఆందోళన

**ఏలూరు, జూన్ 24 ప్రభాతవార్త బ్యూరో:** పాపికొండల అభయారణ్యం నుంచి బయటకు వచ్చిన పెద్దపులి సంచారం మరోసారి ఏలూరు జిల్లా అటవీ ప్రాంతాల్లో సంచరించడంతో పరిసర ప్రాంతాల ప్రజలు ఉలిక్కి పడేలా చేసి ఈ వార్త చర్చనీయాంశంగా మారింది. మంగళవారం బుట్టాయగూడెం మండల పరిధిలో పులి కదలికలు నమోదవడంతో సమీప గిరిజన గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. బుధ వారం బుట్టాయగూడెం మండలం పులిరాముడు గూడెంలో పరిసరాల్లో ఉందని ఏలూరు జిల్లా అటవీ శాఖ అధికారి పీవీ సందీప్ రెడ్డి తెలిపారు. అయితే పులి దాడిలో రెండు ఆవులు మృతి చెందిన ఘటన స్థానికుల్లో మరింత ఆందోళన పెంచింది. మరోవైపు ఈ పరిణామాలు ప్రసిద్ధ పర్యాటక కేంద్రమైన పాపికొండల పర్యాటక రంగంపైనా ప్రభావం చూపుతున్నాయి.

**పశువులపై దాడి:** నిమ్మలగూడెం శివారులోని పాలకుంట చెరువు సమీపంలో మేతకు వెళ్లిన రెండు ఆవులపై పెద్దపులి దాడి చేసి చంపినట్లు సమాచారం. ఘటన స్థలాన్ని పరిశీలించిన అటవీశాఖ అధికారులు పులి అడుగుజాడలను గుర్తించారు. పులి కదలికలను నిర్ధారించేందుకు రేడియో కాలర్ ద్వారా నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

**వెలవెలబోతున్న పాపికొండలు:** ప్రకృతి సౌందర్యం, గోదావరి విహార యాత్రలకు ప్రసిద్ధి చెందిన పాపికొండలకు ప్రతి సంవత్సరం వేలాది మంది పర్యాటకులు వస్తుంటారు. అయితే ఇటీవల పులి సంచారం వార్తలు వెలుగులోకి రావడంతో కొంతమంది పర్యాటకులు పర్యటనలను వాయిదా వేసుకుంటున్నట్లు రాజమండ్రికి చెందిన టూరిజం నిర్వాహకులు చెబుతున్నారు. పులి జాడ తెలుసుకుని తమ భద్రతపై సందేహాల కారణంగా కుటుంబాలతో వచ్చే సందర్శకుల సంఖ్య తగ్గినట్లు తెలుస్తోంది.

**ప్రజల భద్రతపై దృష్టి:** సమీప అటవీ ప్రాంతాల్లో ఒంటరిగా తిరగవద్దని, రాత్రి వేళల్లో అడవుల్లోకి వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని అటవీశాఖ అధికారులు సూచించారు. పశువులను అడవి అంచులకు మేతకు పంపే సమయంలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ పులి కదలికలపై ఎప్పటికప్పుడు సమాచారం జిల్లా కలెక్టర్‌కు, స్థానిక అధికారులకు అందిస్తున్నారు.

**నిర్వహణపై ప్రశ్నలు:** వన్యప్రాణి మెడకు రేడియో కాలర్ అమర్చినప్పటికీ, అది జనావాసాలకు చేరుకోవడం స్థానికుల్లో పలు ప్రశ్నలను లేవనెత్తుతోంది. పులి కదలికలను ముందుగానే గుర్తించి గ్రామాలకు హెచ్చరికలు ఇవ్వడంలో వ్యవస్థ ఎంతవరకు సమర్థంగా పనిచేస్తోందనే చర్చ జరుగుతోంది. వన్యప్రాణుల సంరక్షణతో పాటు గ్రామీణ ప్రజల భద్రతకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

**మానవ- వన్యప్రాణి సంఘర్షణకు సంకేతమా?:** అటవీ ప్రాంతాల విస్తీర్ణం తగ్గడం, ఆహార లభ్యతలో మార్పులు, వన్యప్రాణుల సహజ సంచార మార్గాల్లో మానవ జోక్యం పెరగడం వంటి కారణాలతో పులులు జనావాసాల వైపు వచ్చే ఘటనలు పెరుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. పాపికొండల పరిసరాల్లో తాజా పరిణామాలు కూడా మానవవన్యప్రాణి సంఘర్షణ సమస్యను మరోసారి తెరపైకి తెచ్చాయి. ప్రజల భద్రత, వన్యప్రాణుల సంరక్షణ రెండింటినీ సమన్వయం చేస్తూ దీర్ఘకాలిక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని పర్యావరణ వర్గాలు సూచిస్తున్నాయి.

**బుట్టాయగూడెంలో పెద్దపులి సంచారం:** పాపికొండలు అభయారణ్యం నుంచి జనావాసాల్లోకి అడుగుపెట్టిన పులి బుధవారం బుట్టాయగూడెం మండలం పులిరాముడు గూడెం ప్రాంతంలో సంచరించినట్లు గురజాడలు గుర్తించామని ఏలూరు జిల్లా ఫారెస్ట్ అధికారి పివి సందీప్ రెడ్డి అన్నారు. ఈ మేరకు బుట్టాయ గూడెం మండలంలోని గుంజవరం, కన్నాపురం, చింతలగూడెం, బుట్టాయగూడెం, దొర మామిడి, కొవ్వాడ, లంకపాకల, వీరన్నపాలెం, మునులూరు, రవ్వారీ గూడెం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అయితే ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఈ మేరకు అటవీశాఖ అధికారులు అన్ని రకాల ముందస్తు రక్షణ చర్యలను చేపట్టిందన్నారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతాలలోని చేపల వేట, పశువుల మేత, అటవీ ప్రాంతంలో సంచరించుట వంటి చర్యలకు పాల్పడవద్దని స్థానిక ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా పులి రాత్రి వేళల్లో జనావాసాలకు దగ్గరగా వస్తున్నందున పశువులను బహిరంగంగా ఉంచవద్దని సూచించారు. అలాగే గ్రామంలోని లైట్లు వెలిగే ఉండాలని కోరారు. ప్రజలకు ఎటువంటి ప్రమాదం జరగకుండా క్షేత్రస్థాయిలో తమ సిబ్బంది నిరంతర పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక బృందాలను పులి బోనులను ఏర్పాటు చేశారు. నిమ్మలగూడెంలో పులికి ఆహారమైన రెండు పశువుల యజమానులకు అటవీ శాఖ తరపున నష్టపరిహారం అందజేస్తామని హామీ ఇచ్చారు.

## అంతరాష్ట్ర కిడ్నాప్ ముఠా గుట్టురట్టు




**పలమనేరు, జూన్ 24 ప్రభాతవార్త:** కోట్ల రూపాయల డిమాండ్‌తో ఆరితేరిన అంతరాష్ట్ర కిడ్నాప్ ముఠాను చిత్తూరు జిల్లా పలమనేరు పోలీసులు ఛేదించారు. జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ ఆదేశాల మేరకు పలమనేరు సిఐ మోహన్‌రెడ్డి తన సిబ్బందితో దాడిచేసి 11 మందిని అరెస్టు చేయగా మరో 11 మంది పరారీ అయ్యారు. బుధవారం డిఎస్పీ దేగల ప్రభాకర్ విలేకర్లకు తెలిపిన వివరాలు. గంగవరం మండలం గంగవరంకు చెందిన ఎంసి రవి (47)ను కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు ఈ నెల 7న పలమనేరు గుడియాత్తం రోడ్డులోని టి.వడ్డూరు క్రాస్ వద్ద కిడ్నాప్ చేశారు. కడప జిల్లా పులివెందులకు తీసుకు వెళ్ళి రవి కుటుంబ సభ్యులకు ఫోన్ చేశారు. రూ.2 కోట్లు అందజేయాలని లేదంటే చంపుతామని బెదిరించారు. దీంతో రవి కుటుంబ సభ్యులు ఈ నెల 8న ఉదయం చిక్‌బళ్ళాపూర్ హైవే వద్ద రూ.1 కోటి అందజేశారు. కిడ్నాపర్లు ఈ మొత్తం తీసుకొని బాధితుని వద్ద ఉన్న 900 గ్రాముల బంగారు ఆభరణాలు బలవంతంగా లాక్కొని బాధితుని అక్కడే వదిలి పరారీ అయ్యారు. బాధితుని ఫిర్యాదు మేరకు పలమనేరు సిఐ మోహన్‌రెడ్డి కేసు దర్యాప్తు ప్రారంభించారు. ఇందులో భాగంగా కేరళకి చెందిన రోషన్ గ్యాంగ్ సభ్యులు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలకు చెందిన కొందరు వ్యక్తులు కలసి కుట్రపన్ని ఈ నేరం చేసినట్లు దర్యాప్తులో తేలింది. భానుప్రకాశ్ అనే వ్యక్తి బాధితుడు రవి కదలికలను ఎప్పటికప్పుడు నాగేశ్వరరెడ్డి అనే వ్యక్తి ద్వారా కిడ్నాప్ గ్యాంగ్‌కు తెలియజేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో రవిని కిడ్నాప్ చేయడానికి అవసరమైన వాహనాలు సమకూర్చుకొని గంగవరంలో ఓ లాడ్జిలో బసచేశారు. ఈ నెల 7న బాధితుని కదలికలు గమనించి టి.వడ్డూరు క్రాస్ వద్ద కిడ్నాప్ చేసి పులివెందులకు తరలించారు. దాంతో పోలీసులు సాంకేతిక ఆధారాలు సిసిటివి ఫుటేజీలు మొబైల్ కాల్‌డేటా వాహనాల కదలికలు ఇతర శాస్త్రీయ ఆధారాలతోఈ కేసులో వున్న కేరళకు చెందిన 7 మందిని ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన నలుగురిని అరెస్టు చేశారు. కిడ్నాప్‌కు ఉపయోగించిన వాహనాన్ని గంగవరం మండలం గండ్రాజుపల్లె చెక్‌పోస్టు వద్ద సీజ్ చేశారు. నిందితులను అరెస్టు చేసి పలమనేరు కోర్టులో హాజరు పరచి రిమాండుకు తరలించారు. నిందితుల నుండి రూ.22 లక్షలు నగదు, మూడు కార్లు మారుతీ స్విఫ్ట్ డిజైర్, జియా సోనెట్, ఇన్నోవా కారును స్వాధీనం చేసుకున్నారు. రోషన్ వర్గానికి చెందిన గ్యాంగ్‌లీడర్ రోషన్‌నర్గీస్ పరారీలో వున్నాడు. ఇక అరెస్టు అయిన వారిలో అప్పు అరుణ్, ఎడ్విన్ థామస్, దీపు మోస్, నితిన్‌జానీ, కెస్ అభయ్, రతీష్, లిబిన్ ఉన్నారు. అలాగే ఏపి, తెలంగాణాకు చెందిన వారిలో కడపజిల్లా సింహాద్రిపురం ఉప్పలూరుకు చెందిన నాగేశ్వరరెడ్డి, వనపర్తి జిల్లాకు చెందిన మహేష్ నాయుడు, ప్రొద్దుటూరుకు చెందిన పందేళ్ళపల్లెకు చెందిన రామిరెడ్డి, పొద్దుటూరుకు చెందిన గుండ్రా మహేష్‌రెడ్డి అరెస్టు అయిన వారిలో ఉన్నారు. ఇక పరారీలో వున్న వారు సచూ, అనూప్, నికిల్ మోహన్, స్వాజీ (జిత్తు), అరుణ్, సామి, అమీన్, జస్వంత్ (వరప్రసాద్), అనిల్, మరో వ్యక్తి ప్రణీత్ రెడ్డి స్నేహితుడు కృష్ణారెడ్డి పరారీలో వున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు రోషన్‌పై కేరళలోని వివిధ పోలీస్ స్టేషన్లలో హత్యాయత్నం, దాడులు, బెదిరింపులు, పేలుడు పదార్థాలు కలిగి వుండడం మొత్తం 15 క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఈ కేసును ఛేదించిన సిఐ మోహన్‌రెడ్డి, సిబ్బందిని జిల్లా ఎస్పీ, డిఎస్పీ అభినందించారు.

## సుస్థిరత ప్రభావ మదింపులలో పద్మావతి వర్సిటీకి ఇంపాక్ట్ రేటింగ్స్

**తిరుపతి, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం (ఎస్‌పిఎంవివి) సుస్థిరత ప్రభావ మదింపులులో 2026 విశ్వవిద్యాలయం ర్యాంక్ బ్యాండ్‌ను సాధించింది. ప్రపంచవ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యత, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల సాధన, సమాజానికి అందిస్తున్న సేవలు వంటి అంశాల ఆధారంగా ఈ ర్యాంకింగ్స్‌ను ప్రకటిస్తారు. ఈ సందర్భంగా పద్మావతి మహిళ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య వెన్నం ఉమ,రిజిస్ట్రార్ ఆచార్య ఆర్. ఉషఆనందం వ్యక్తం చేశారు. ఈ ఘనత సాధించడంలో కీలక పాత్ర పోషించిన ర్యాంకింగ్ డైరెక్టర్ ఆచార్య పి. వెంకట కృష్ణతో పాటు ర్యాంకింగ్ బృంద సభ్యులందరినీ అభినందించారు. విశ్వవిద్యాలయం సుస్థిర అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యతల పట్ల చూపుతున్న నిబద్ధతకు ఈ ర్యాంకింగ్ నిదర్శనమని వారు పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలను సాధించేందుకు విశ్వవిద్యాలయం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ విజయానికి సహకరించిన అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు ఇతర భాగస్వాములందరికీ వారు అభినందనలు తెలియజేశారు.

### బ్రహ్మోత్సవాలకు ఉద్యానవనాలను

## సుందరంగా తీర్చిదిద్దాలి

**- టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి**



**తిరుమల, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** రానున్న బ్రహ్మోత్సవాలకు తిరుమలలోని ఉద్యానవనాలను అత్యంత సుందరంగా తీర్చిదిద్దడంతో బాటు ఆధ్యాత్మిక ప్రాముఖ్యత ఉన్న మొక్కలను పెంచేలా చర్యలు చేపట్టాలని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరిచెప్పారు.తిరుమలలో ఆధ్యాత్మిక వనాలను విరివిగా అభివృద్ధి చేయాలని సూచించారు. తిరుమలలో జిఎన్‌సి, గీత పార్క్, నామాల పార్క్ వంటి వివిధ ఉద్యానవనాలను ఆయన బుధవారం పరిశీలించి టిటిడి ఉద్యానవన, అటవీ శాఖల అధికారులతో కలసి తనిఖీ చేశారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట అటవీశాఖ విభాగం డిప్యూటీ సిఎఫ్ ఫణి కుమార్ నాయుడు, ఉద్యానవన విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, పిఆర్ఒ నీలిమ తదితరులు పాల్గొన్నారు.

## మోడీ విధానాలతోనే రూపాయి ఢమాల్!

● రాజ్యాంగాన్ని మార్చడానికి కుట్రలు, కుతంత్రాలు ● బిజెపిదంతా మత విద్వేషాలు రెచ్చగొట్టడమే

● రాజధాని పేరుతో ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం ● మండిపడ్డ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య



**ఉరవకొండ, జూన్ 24 ప్రభాతవార్త:** దేశాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామని గడిచిన 3 ఎన్నికల్లో వాగ్దానాలు చేస్తూ వస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అభివృద్ధి స్థానంలో ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టే కార్య క్రమాన్ని నూటికి నూరుపాళ్లు విజయవంతం గా అమలు చేస్తున్నారని సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య అన్నారు. ఉరవకొండ పట్టణంలోని దేవాంగ కళ్యాణ మండపంలో ఈనెల 22వ తేదీ నుండి జరుగుతున్న సిపిఐ రాజకీయ సైద్ధాంతిక శిక్షణ తరగతుల చివరిరోజు బుధవారం ఆయన హాజరై ప్రసంగించారు.

రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య మాట్లాడుతూ పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక రూపాయి పతనం కాలేదు కాని భారతదేశ రూపాయి విలువ పతనం అవుతోందని రూపాయి విలువ పెంచుతానని అధికారం చేపట్టిన మోడీ 12 సంవత్సరాల పాలనలో 56 రూపాయలుగా ఉన్న రూపాయి విలువను నేడు డాలర్‌తో పోల్చితే 96 రూపాయలకు పడిపోయేలా చేశారని విమర్శించారు. దేశంలో ఆర్‌ఎస్‌ఎస్ ఉన్మాదాన్ని పెంచి పోషిస్తున్న బిజెపి నేడు రాజ్యాంగాన్ని మార్చడానికి అనేక కుట్రలకు పాల్పడుతోందన్నారు. దేశంలో ఆదివాసులు, గిరిజనులు, ముస్లిం మైనార్టీలపై దాడులు అధికమయ్యాయని దేశ ప్రజల మధ్య ఐక్యతకు ముప్పు వాటిల్లుతోందన్నారు.

**కేంద్రం నుంచి నిధులు రాబట్టడంతో చంద్రబాబు సర్కార్ విఫలం:** రాష్ట్రంలోని చంద్రబాబు నాయకత్వంలోని ఎన్డీఏ కూటమి డబుల్ ఇంజన్ సర్కార్ కేంద్రం నుంచి నిధులు రాబట్టడంలో పూర్తిగా విఫలమైందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య విమర్శించారు. ఎన్నికలల్లో ప్రజలకిచ్చిన వాగ్దానాలు అమలు చేయకపోగా గడిచిన రెండేళ్లలో రూ.40 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చామని, 20 లక్షల ఉద్యోగాల కల్పన జరుగుతోందని ఊకదంపుడు ఉపన్యాసాలు చేస్తున్న చంద్రబాబు ఎన్ని పరిశ్రమలు తెచ్చారో, ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చారో కల్పన కాకుండా కల్పించినవెన్నో వాస్తవాలు చెప్పాలన్నారు. ఏపి అంటే అమరావతి, పోలవరం అంటున్న చంద్రబాబు అమరావతి నిర్మాణానికి కేంద్రం నుండి ఎన్ని నిధులు తెచ్చారని ఆయన ప్రశ్నించారు. అమరావతిను రియల్ ఎస్టేట్ వ్యాపారానికి సిద్ధం చేస్తున్నారని విమర్శించారు. పోలవరం జాతీయ ప్రాజెక్టుగా ఉన్నా పూర్తి మాత్రం కావడంలేదని నిర్వాసితులకు పెండింగ్‌లో ఉన్న రూ.37వేల కోట్ల పరిహారం ఇవ వ్వమంటే ఎత్తు తగ్గిస్తా మంటున్నారని ఎత్తు తగ్గించి చేపలు పట్టుకుంటారా అని ఈశ్వరయ్య దుయ్యబట్టారు.

**సంపద పునః పంపిణీ చేయాలి:** కార్పొరేట్ల సంపదను పునః పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో ఆగస్టు 6 నుంచి 15 వరకు దేశవ్యాప్తంగా ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌లోని 28 జిల్లాల్లో ప్రచార కార్యక్రమం చేపడుతున్నామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య తెలిపారు. సెప్టెంబర్ 1వ తేదీన దేశ వ్యాప్తంగా పాలక ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయడానికి ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేస్తున్నామన్నారు.

ఈనెల 30వ తేదీన రైతాంగ సమస్యల పరిష్కారంకోసం ఏపి రైతు సంఘం ఆధ్వర్యంలో ఛలో విజయవాడ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సి.జాఫర్, జిల్లా కార్యదర్శి పి.నారాయణస్వామి, సహాయ కార్యదర్శులు సి.మల్లికార్జున, జె.రాజారెడ్డి, కార్యదర్శివర్గ సభ్యులు బి.కేశవరెడ్డి, రామకృష్ణ, శ్రీరాములు, మల్లికార్జున, నియోజకవర్గ కార్యదర్శి చెన్నరాయుడు, సహాయ కార్యదర్శులు సుల్తాన్, నాగేంద్ర, నాయకులు బసవరాజు, గెన్నె మల్లేసి, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## దారిదోపిడి కేసులో 8మంది అరెస్టు

### 4 వాహనాలు, రూ.3 లక్షలు స్వాధీనం



**శ్రీకాళహస్తి, జూన్ 24 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి-తిరుపతి జాతీయ రహదారిపై ఈ నెల 15న తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం అంజిమేడు వద్ద రవీంద్రరెడ్డి అనే వేణును బెదిరించి రూ.15 లక్షలు దోచుకున్న కేసులో బుధవారం 8 మందిని అదుపులో తీసుకొని వారి నుంచి నాలుగు వాహనాలను, రూ.3 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎఎస్‌పి అర్లశ్రీనివాసులు మీడియాకు తెలిపారు. రవీంద్ర రెడ్డి రూ.15లక్షలతో తన వాహనంలో పయనిస్తుండగా ముందుగా గుర్తించిన ముఠా దారికాచి కత్తులతో బెదిరించి నగదును అపహ రించినట్లు అందిన ఫిర్యాదు మేరకు జిల్లా ఎస్‌పి సుబ్బరాయుడు సంబంధిత అధికారులను కేసుకు సంబంధించి ప్రత్యేక బృందాలను నియమించాలని ఆదేశించారు. ఈ మేరకు రేణిగుంట డియస్‌పి శ్రీనివాస్, ఏర్పేడు సిఐలు శ్రీకాంత్‌రెడ్డిలు సంయుక్తంగా ప్రత్యేక బృందాన్ని నియమించారు. కేసుల ఛేదనలో ఎంతో చాకచక్యం ఉన్న బృందం ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి, రవిప్రకాష్ వారి సిబ్బంది గతంలో నేరాలకు పాల్పడిన వారిని పరిగణలోకి తీసుకొని విచారణ చేపట్టారు. వారి చొరవతో స్వల్ప కాలంలోనే నిందితులను అదుపు లో తీసుకున్నారు. ఈ కేసులో మొదటి నిందితులుగా ఓ మహిళ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఆమె కోసం ప్రత్యేక బృందాన్ని నియమించారు. ఈ కేసులు 8మందిని అదుపులో తీసుకున్నట్లు వివరించారు. మొదటి నిందితులు లక్ష్మీకాంతమ్మ పరారిలో ఉండగా అదుపులో తీసుకున్న వారిలో బాలసాల దామోదరం (బంగారుపాళెం), వెంకటరమణ (శ్రీనివాస మంగాపురం), మునియప్ప వెంకటాచలపతి(కోలారు), నారాయణ స్వామి (కోలార్), సయ్యద్ రోషన్ (మొగిలి బంగారుపాళెం), అంజి (గంగవరం చిత్తూరు), గుణశేఖర్ (జీవకోన తిరుపతి), శ్రీనివాసులు (చిల్లకూరు నెల్లూరు జిల్లా) ఉన్నారు. ఈ కేసును ఛేదించటంలో ఏర్పేడు సిఐ శ్రీకాంత్‌రెడ్డి, ఎస్ఐలు శ్రీకాంత్‌రెడ్డి రవి ప్రకాష్, పోలీసులను జిల్లా అధికారులు ప్రశంసించారు.

# ఆర్టీసీ ఉద్యోగులకు ఒపిఎస్ అమలు చేయండి

**విజయవాడ, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆర్టీసీ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఎపి పిటిడి బిసి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్వి. శేషగిరిరావు కోరారు. 2004 సెప్టెంబర్‌కు ముందు నోటిఫికేషన్ ద్వారా నియమితులైన సుమారు 11,000 మంది ఉద్యోగులను (కాంట్రిబ్యూటరీ పెన్షన్స్‌కి) సిపిఎస్ నుంచి (ఓల్డ్ పెన్షన్ స్కీము) ఓపిఎస్‌కు మారే అందుకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు శేషగిరిరావు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసారు. అదే విధంగా 2020 నుంచి ప్రభుత్వ ఉద్యోగులుగా మారిన ఎపిఎస్‌ఆర్టీసీ 2004 ముందు ఉద్యోగాలు పొందిన వారికి కూడా ఓపిఎస్ (ఓల్డ్ పెన్షన్ స్కీమ్)ను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.



# దుర్గమ్మ ఆలయ నిత్యాన్నదానానికి విరాళం

**ఇంద్రకీలాద్రి, జూన్ 24 ప్రభాతవార్త:** విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి రు.1లక్ష విరాళాన్ని బుధవారం విజయవాడకు చెందిన కె. కృష్ణకుమార్ అందించారు. అలాగే హైదరాబాద్‌కు చెందిన ఇందుకూరి హేమ శిరీష రు.1లక్ష విరాళాన్ని బుధవారం అందించారు. దాతలకు దుర్గమ్మ దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు, వారికి దుర్గమ్మ చిత్రపటం, ప్రసాదం, శేషశస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.



# విద్యుత్‌ను ఆదా చేయండి

**తిరుమల, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** ధార్మిక సంస్థ టిటిడితో బాటు తిరుమలలోని అనేక విభాగాలు విద్యుత్ పొదుపుచేయాలని, ఇందుకోసం అనవసర సమయాల్లో లైట్లు, ఎసిలు, ఫ్యాన్లు ఆపివేయాలని ప్రత్యేక జిఒ జారీ అయ్యింది. ఇందుకు టిటిడి అధికారులు, సిబ్బంది సహకరించాలని, పొదుపు మంత్రం అమలుచేయాలని పేర్కొన్నారు. టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర పేరుతో వెలువడిన ఉత్తర్వుల్లో స్పష్టమైన ఆదేశాలిచ్చారు. తిరుమలలోని టిటిడి కార్యాలయాలు, ఇతర అనుబంధ ఆలయాలు, కార్యాలయాల్లో విద్యుత్ పొదుపు చేయాలని, దీన్ని అందరూ పాటించాలని కీలక ఆదేశాలు వెలువడ్డాయి. కార్యాలయం పనివేళల్లో కూడా పొదుపు మంత్రం పాటించాలని, అనవసరంగా లైట్లు, ఫ్యాన్లు వాడుకోవద్దని పేర్కొన్నారు. ఉదయం 10,30గంటల నుండి మధ్యాహ్నం 1గంటవరకు, తిరిగి మధ్యాహ్నం 2గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు మాత్రమే ప్రత్యేక సమయ పరిమితి ఉంటుందన్నారు. స్విచ్‌బోర్డులకు నంబరింగ్, గుర్తింపు మార్కింగ్ తప్పనిసరి అని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఉద్యోగులు, సిబ్బందికి విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పించాలని అన్ని విభాగాధిపతులకు ఆదేశాలిచ్చారు. ఈ ఉత్తర్వులు అమలులో నిబంధనలు ఉల్లంఘిస్తే తీవ్రంగా పరిగణించి చర్యలు తప్పవని హెచ్చరించారు.


# అటవీ ప్రాంతంలో మృతదేహం

## నెల్లూరు జిల్లా ఊటుకూరు వాసిగా గుర్తింపు

**దుత్తలూరు (నెల్లూరు), జూన్ 24 ప్రభాతవార్త:** నెల్లూరు జిల్లా దుత్తలూరు మండలంలోని బండకిందపల్లి అటవీ ప్రాంతంలో మృతదేహం ఉన్న సంఘటన బుధవారం కలకలం రేపింది. స్దానిక బస్తాలో మృతదేహాన్ని అటవీ అధికారులకు సమాచారం అందించారు. అటవీ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించడంతో ఉదయగిరి సిఐ వెంకట్రావ్ పోలీసు అధికారులు సిబ్బందితో కలిసి సంఘటనా స్దలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. గోనె సంచలో వరిగడ్డి వేసి అందులో మృతదేహాన్ని ఉంచి అనుమానస్పదంగా మృతి చెందినట్లు గుర్తించారు. క్లూస్ టీం సంఘటనా స్దలానికి చేరుకొని పరిసరప్రాంతాల్లో ఆధారాలు సేకరించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. శవపంచనామా ద్వారా మృతుడు వింజమూరు మండలం ఊటుకూరుకు చెందిన దేవరకొండ గోవిందులు (55)గా నిర్దారించారు. మృతదేహం పరిస్థితిని బట్టి నాలుగు నుండి 5రోజులు అయి ఉండడం వలన మృతదేహం కుళ్ళిపోయింది. దీంతో పోస్టుమార్టరం ఘటనా స్దలంలోనే నిర్వహించారు. పోస్టుమార్టరం నివేదికందగానే మృతికి గల కారణాలు ఇతర కారణాలను పూర్తి స్దాయిలో దర్యాప్తులో తేలనున్నాయి. దత్తులూరు ఎస్ఐ పి.ఆదిలక్ష్మి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# గొడ్డలి పార్టీ నేతలకు దడ పుట్టిస్తాం

● వైసిపి ప్రభుత్వంలో జరిగిన కబ్జాలను వెలికి తీస్తాం ● రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్




తిరుపతి జిల్లా కలెక్టరేట్లలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని

**తిరుపతి కలెక్టరేట్, జూన్ 24 ప్రభాతవార్త:** రానున్న మూడేళ్ల కాలంలో గొడ్డలి పార్టీ నేతలకు దడ పుట్టిస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తిరుపతి కలెక్టరేట్లో బుధవారం సాయంత్రం 5 గంటలకు జిల్లా అభివృద్ధిపై, ప్రధానంగా తిరుపతి అర్బన్ రూరల్, చంద్రగిరి నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మీడియా మిత్రులను ఉద్దేశించి మాట్లాడుతూ కూటమి అధికారం లోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి ప్రధానంగా జిల్లా, చంద్రగిరి నియోజకవర్గ అభివృద్ధి శరవేగంతో దూసుకుని వెళుతుందన్నారు. ఈ నేపథ్యంలో దామినీడిలో రెండేళ్ల కాలంలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిపై విజయోత్సవ బహిరంగ జరిగిందని, ఈ సభ విజయోత్సవాన్ని జీర్ణించుకోలేని గొడ్డలి పార్టీ నేతలు కూటమి ప్రభుత్వంపై బురద జల్లడం జరుగుతుందని తెలియజేశారు. రానున్న మూడేళ్ల కాలంలో గొడ్డలి పార్టీ నేతలకు చుక్కలు చూపిస్తామని, గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన కబ్జాలను వెలికి తీసి, అందుకు బాధ్యులైన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి జై లకు పంపుతామని హెచ్చరించారు. తిరుపతి రూరల్ మండలం అవిలాల గ్రామ లెక్కదాఖా ల సర్వేనెంబర్ 416/1 లో ఎ 3.17 సెంట్ల భూమిలో తన అనుచరులు కబ్జా చేసినట్లు వచ్చిన వార్తల్లో నిజం లేదన్నారు. అసలు ఆ భూమికి, సంబంధిత వ్యక్తులకు ఎటువంటి సంబంధం లేదని త్రోచిపుచ్చారు. ఇదంతా గొడ్డలి పార్టీ నేతలు చేస్తున్న ఆరోపణలు మాత్రమేనని, ఇందులో నా పాత్ర కానీ, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పాత్ర గాని లేదన్నారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పేదల సమస్యలను పరిష్కరిస్తూ ముందుకెళుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకొని రావడం తప్ప మరోటి లేదని అన్నారు. ఇందులో భాగంగా శెట్టిపల్లి సమస్యలు పరిష్కరించి బాధితులకు పట్టాలు అందజేశామని, త్వరలో తిరుచానూరు మాస్టర్ ప్లాన్ రోడ్డు రానుందని, తిరుపతిని టూరిజం హబ్ గా మార్చనున్నామని, ప్రతి పేదవానికి ఇంటి స్థలాలు ఇవ్వడానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. జగన్ ప్రభుత్వం 2029 లో రాదని, 2039 లో కూడా రాదని, 2049 అయినా కూడా వైసీపీ ప్రభుత్వ రాదని జోస్యం చెప్పారు. రాష్ట్రంలో, తిరుపతి జిల్లాలో ప్రధానంగా చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని హాథీ రాంజీ మఠానికి సంబంధించిన భూములను సంబంధిత పీఠాధిపతులతో మాట్లాడి బాధితులకు, పేదలకు అందించడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా జర్నలిస్టు సోదరులకు ఇంటి స్థలాలు ఇచ్చే కార్యక్రమానికి త్వరలో శ్రీకారం చుడతామని చెప్పారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత గొడ్డలి పార్టీ రాష్ట్ర ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిపై లేనిపోని ఆరోపణ చేస్తుందని, ఇక మూడేళ్ల కాలం కూటమి ప్రభుత్వానికి ఉందని గొడ్డలి పార్టీ నేతలకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

**కబ్జా భూములను బద్దలు కొడతాం:** చంద్రగిరి నియోజకవర్గంలో వైసీపీ ప్రభుత్వంలో జరిగిన కబ్జాలను వెలికి తీసి, బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేసి జైలకు పంపుతామని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని హెచ్చరించారు. తిరుపతి రూరల్ అవిలాల గ్రామం సర్వే నెంబర్ 416 /1 లోని ఏ 3.17 సెంట్లు భూమి కబ్జా జరగలేదని, అందులో తన పాత్ర కానీ, కూటమి పాత్ర లేదని స్పష్టం చేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రగిరి నియోజకవర్గం అభివృద్ధి పథంలో జరిగిందని, తన నియోజకవర్గంలోని ఇంత అభివృద్ధి జరిగితే, రాష్ట్రంలో ఎంత అభివృద్ధి జరుగుతుందో అర్థం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్, తుడా చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి పాల్గొన్నారు.

# అధికారంలోకొచ్చాక ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తాం

● ప్రజల ఆశీస్సులతో మళ్లీ వచ్చేది మన ప్రభుత్వమే ● వైసిపి అధ్యక్షుడు, మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి



ఆలయ ప్రారంభోత్సవ పూజా కార్యక్రమంలో జగన్

**పులివెందుల, జూన్ 24 ప్రభాతవార్త:** ప్రజల ఆశీస్సులతో మళ్లీ మన ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని రాగానే ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తాం అని కార్యకర్తల సంక్షేమమే తన తొలి ప్రాధాన్యత అని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. పులివెందుల నియోజకవర్గంలో మూడు రోజుల పర్యటనలో భాగంగా రెండో రోజు వైఎస్ జగన్ పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బుధవారం భాకరాపురం నుంచి బయలు దేరిన ఆయన వేముల మండలం భూమయ్యగారిపల్లి గట్టు వద్ద నూతనంగా నిర్మించిన శ్రీ నరసింహస్వామి ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. జగన్మోహన్ రెడ్డికి మండల నాయకులు, గ్రామస్తులు గజమాలతో స్వాగతం పలికారు. వైఎస్ అవినాష్ రెడ్డితో కలిసి ఆలయ కలశాన్ని ఎత్తుకొని ఆలయ ప్రవేశం చేసిన జగన్ ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం పులివెందుల పట్టణంలోని యర్రగుడిపాలెంలో నిర్మించిన సిసి రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాలే తమ లక్ష్యమని తెలిపారు. పార్టీ కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని, వారి సంక్షేమానికి భవిష్యత్తులో ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. ఎంపి వైఎస్ అవినాష్ రెడ్డి చొరవతో పట్టణంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను జగన్ ప్రారంభించారు. ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటి పూర్తి అయిన పనులే కాకుండా మరో రూ.110 లక్షల విలువైన అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. చిన్న రంగాపురం, పెద్ద రంగాపురం ప్రాంతాల్లో సిసి రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. పారిశుద్ధ్య నిర్వహణ కోసం రూ.18 లక్షలతో ట్రాక్టర్ కొనుగోలు, యుజిడి, రోడ్ల మరమ్మతుల కోసం రూ.70 లక్షల ప్రతిపాదనలు ఆమోదం పొందినట్లు తెలిపారు. కార్యకర్తలకు అండగా ఉంటూనే పులివెందుల అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తామని వారు తెలిపారు.

# పొగాకు గిట్టుబాటు ధర కల్పించాలి

**ఒంగోలు (కలెక్టరేట్), జూన్ 24 ప్రభాతవార్త:** పొగాకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, పొగాకు కొనుగోళ్ల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రూ.1000 కోట్లు కేటాయించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఒంగోలు కలెక్టర్ కార్యాలయం వద్ద సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షల్లో పాల్గొన్న ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడారు. జిల్లాలో వేలాది మంది రైతులు పొగాకు సాగుపై ఆధారపడి జీవనం సాగిస్తున్నప్పటికీ గిట్టుబాటు ధరలు లేకపోవడం, కొనుగోళ్లలో జాప్యం, మార్కెట్‌లో నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల కారణంగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైతులు అప్పులు చేసి సాగు చేసిన పంటకు సరైన ధర లభించకపోవడంతో అనేక కుటుంబాలు ఆందోళనలో ఉన్నాయని పేర్కొన్నారు. పొగాకు రైతుల వద్ద నిల్వ ఉన్న ఉత్పత్తిని వెంటనే కొనుగోలు చేసి పెట్టుబడులు, శ్రమ వృథా కాకుండా తగిన మద్దతు ధర కల్పించాలని కోరారు. వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉన్న సమయంలో రైతులకు అండగా నిలవడం ప్రభుత్వాల బాధ్యత అని ఆయన అన్నారు.

కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. రైతుల పరిస్థితిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అర్థం చేసుకుని అత్యవసరంగా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పొగాకు బోర్డు కూడా రైతులకు అనుకూలంగా వ్యవహరించి కొనుగోళ్లలో పారదర్శకత పాటించాలని కోరారు. ఇదే సందర్భంగా ఒంగోలు కలెక్టర్ కార్యాలయం వద్ద పొగాకు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కిసాన్ మోర్చా అధ్యక్షుడు చుండూరి రంగారావు ఆధ్వర్యంలో రైతులు నిరసన దీక్ష చేపట్టారు.

# పోలీస్‌స్టేషన్‌కు అధిక ఫీజుల పంచాయితీ

**విజయవాడ, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏ కొండూరు మండలం కృష్ణారావు పాలెం గ్రామానికి చెందిన 10వ తరగతి విద్యార్థి మైలవరం ఒక ప్రైవేట్ స్కూల్లో చదువు పూర్తి చేసుకున్నాడు. సర్టిఫికెట్ల కోసం స్కూల్ కి వెళ్లగా ఫీజులు 53000 కడితేనే ఇస్తామని యాజమాన్యం దురుసుగా ప్రవర్తించింది. మొదట 9వ తరగతికి 20000 అని తర్వాత 10000 కడితే సరిపోతుందని చెప్పారు. తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి బాగోకపోవడంతో 10వ తరగతిలో 10000 మాత్రమే చెల్లించారు. 25000 కడతామని బ్రతిమిలాడినా యాజమాన్యం కనికరించలేదు. విద్యాశాఖ నుండి 55000 వసూలు చేసుకోవడానికి పర్మిషన్ ఉందని బెదిరించినట్లు తల్లిదండ్రులు ఆరోపించారు. దీంతో ఆందోళనకు గురై స్థానిక పోలీస్ స్టేషన్ ను ఆశ్రయించారు. ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల దందాపై విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనపడుతోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. పుస్తకాలు యూనిఫాం అమ్మకాలు ఏడాదికి 20 నుండి 30 శాతం ఫీజులు పెంచి వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై విద్యాశాఖ మంత్రి లోకేష్ స్పందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. స్కూల్ యజమాని డబ్బులు ఇచ్చి మేనేజ్ చేస్తామని సవాలు చేస్తున్నా జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించడం లేదని వాపోయారు.

# సాయికృష్ణ కేసులో సిట్ విచారణ డొల్ల

## - మాజీ మంత్రి పేర్ని నాని



**విజయవాడ, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిది:** సాయికృష్ణ కేసులో సిట్ విచారణపై మాజీ మంత్రి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత పేర్ని నాని తీవ్ర విమర్శలు చేశారు. అమరావతిలో మీడియాతో మాట్లాడిన ఆయన సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసు విచారణపై తీవ్ర అనుమానలు వ్యక్తం చేశారు. సిట్ దర్యాప్తు పూర్తిగా లోప భూయిష్టంగా ఉందని ఆరోపించిన ఆయన ఈ కేసులో అనేక కీలక అంశాలను అధికారులు విస్మరించారని విమర్శించారు. సాయికృష్ణ ఘటన రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ పరిస్థితిని బయటపెట్టిందని పేర్ని నాని అన్నారు. కస్టోడియల్ డెత్ జరిగిన తర్వాత కూడా శవం ఏమైందో అధికార యంత్రాంగం స్పష్టంగా చెప్పలేకపోవడం విచారకరమని పేర్కొన్నారు. ఈ కేసులో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించిన తర్వాతే ఛార్జ్‌షీట్ దాఖలైందని ఆరోపించారు. సిట్ విచారణపై ప్రశ్నలు లేవనెత్తిన ఆయన . మే 6న సాయికృష్ణను అదుపులోకి తీసుకున్న తర్వాత చట్టపరమైన విధానాలు పాటించలేదని అన్నారు. టాస్క్‌ఫోర్స్ అధికారులు, సంబంధిత ఉన్నతాధికారులు పాత్రపై కూడా దర్యాప్తు జరగాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. సాయికృష్ణను కొట్టి చంపింది ఒక్కరేనా? శవాన్ని ఎలా తరలించారు. సిసిటివి ఫుటేజీ ఎందుకు మాయమైంది? వంటి అనేక ప్రశ్నలకు సమాధానలు లేవని అన్నారు. సాయికృష్ణ తల్లి పలుమార్లు పోలీసులు ఆశ్రయించినా స్పందన రాలేదని, చివరకు హేబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేయాల్సి వచ్చిందని గుర్తుచేశారు. హైకోర్టు ఆదేశాలు వచ్చిన తర్వాత కూడా పోలీసులు తగిన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఈ కేసులో సిపి, డిసిపి, ఎసిపి స్థాయి అధికారులు పాత్రపైనా స్వతంత్ర విచారణ జరపాలని పేర్ని నాని డిమాండ్ చేశారు.

# 10 నూతన గురుకుల పాఠశాలలు ఏర్పాటు

**విజయవాడ, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో 10 నూతన మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలు ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఎచ్చెర్ల, నక్కపల్లి, మాచర్ల, గుంతకల్లు, మంత్రాలయంలో బాలికల గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయనున్నారు. గిద్దలూరు, రాయచోటి, పత్తికొండ, పెనుగొండ, కదిరిలో బాలుర గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయనున్నారు.

# అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

**ఒంగోలు(క్రైమ్), జూన్ 24 ప్రభాతవార్త:** ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల దొంగిలించబడిన ఐ10 కారును చేధించిన ప్రకాశం జిల్లా పోలీసులు అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేసి మరోసారి తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసులు సాంకేతిక ఆధారాలు, నిఘా సమాచారంతో దర్యాప్తు చేపట్టి నలుగురు నిందితులను పేర్నమిట్ట సమీపంలో అదుపులోకి తీసుకున్నారు.

జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు పర్యవేక్షణలో ప్రత్యేక బృందం నిర్వహించిన ఆపరేషన్‌లో ఈ అరెస్టులు జరిగినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల వద్ద నుంచి రూ.4 లక్షల విలువైన 10 కార్లు, నాలుగు ద్విచక్ర వాహనాలు, ఒక మొబైల్ ఫోన్, రూ.50 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఆస్తుల మొత్తం విలువ సుమారు రూ.8 లక్షలు ఉంటుందని వెల్లడించారు. నిందితులు పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో తేలినట్లు సమాచారం. వారి నేర చరిత్రపై పోలీసులు ఆరా తీస్తుండగా, ఇతర జిల్లాలు, రాష్ట్రాల్లో నమోదైన కేసులతో సంబంధాలు ఉన్నాయా అనే కోణంలో కూడా విచారణ కొనసాగుతోంది. దొంగిలించబడిన వాహనాలను గుర్తించి బాధితులకు అప్పగించే ప్రక్రియ చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ముఠాకు మరికొందరు సహకరించిన వ్యక్తులు ఉన్నారా అనే కోణంలో కూడా దర్యాప్తు సాగుతోంది. త్వరలో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పోలీసులు పేర్కొన్నారు. ఈ కేసును వేగంగా ఛేదించిన పోలీసు అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందిస్తూ వారి సేవలను ప్రశంసించారు. ప్రజలు తమ వాహనాలకు తగిన భద్రతా చర్యలు తీసుకోవడంతో పాటు అనుమానాస్పద వ్యక్తుల గురించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

# తక్కువ వర్షపాతంలోనూ పంటలు పండించవచ్చు

**అనంతపురం, జూన్ 24 ప్రభాతవార్త బ్యూరో:** తక్కువ వర్షపాతంలోనైనా విత్తన గుళికలతో పంటలు పండించవచ్చని రైతు సాధికార సంస్థ గౌరవ ఉపాధ్యక్షులు టి.విజయ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం మిడుతూరులో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను రైతు సాధికార సంస్థ చీఫ్ టెక్నికల్, ఇన్నోవేషన్ అధికారి లక్ష్మా నాయక్‌తో కలిసి సందర్శించారు. అనంతరం వారు రైతులు, సిబ్బందితో మాట్లాడుతూ.. గ్రామంలో రైతులందరు విత్తన గుళికలతో పిఎండిఎస్‌ను వేసుకోవాలని సూచించారు. రైతులు సమూహాలుగా ఏర్పడి కాంపాక్ట్ బ్లాక్ పద్ధతిలో సాగు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు సూరజ్ కుమార్, జెడిఏ సాల్ రెడ్డి, ఏ.డి.ఏ వెంకట్, రైతులు, రైతు సాధికార సంస్థ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# తిరుచానూరులో నూతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రారంభం

**తిరుపతిరూరల్, జూన్ 24 ప్రభాతవార్త:** తిరుపతి పరిసర ప్రాంత ప్రజలకు రిజిస్ట్రేషన్ సేవలు విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని విభజించి, తిరుచానూరులో నూతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ప్రారంభించడం ద్వారా ప్రజలకు మరింత చేరువలో సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఎన్నోళ్లుగానో ఎదురుచూస్తున్న నూతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని శ్రీనివాసపురం గ్రామ పంచాయతీ పరిధిలో బుధవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంపులశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపుల శాఖ కమీషనర్, ఇన్‌స్పెక్టర్ జనరల్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఏంపి దగ్గుమల్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే పులివర్తి నాని, తుడ చైర్మెన్ డాలర్ దివాకర్‌రెడ్డి, తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఎ.ఈశ్వరరెడ్డి, జనసేన నాయకులు డాక్టర్ హరిప్రసాద్, స్థానిక ప్రజాప్రతినిధులు గణపతినాయుడు, మునిశేఖర్, బడి సుధాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# మంత్రి లోకేష్‌ను కలిసిన షట్లర్ సాత్విక్

**విజయవాడ, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సాత్విక్ సాయిరాజ్ ఉండవల్లి నివాసంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తూ దేశానికి, రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిన సాత్విక్ సాయిరాజ్‌ను ఈ సందర్భంగా మంత్రి లోకేష్ అభినందించారు. ఏపీలోని అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన సాత్విక్ సాయిరాజ్ అర్జున అవార్డుతో పాటు దేశ అత్యున్నత క్రీడా పురస్కారం మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న అవార్డు పొందారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తూ ఎన్నో పతకాలు సాధించారు. ప్రస్తుతం పురుషుల డబుల్స్ విభాగంలో ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 4వ స్థానంలో ఉన్నారు. 2023 అక్టోబర్ 10న డబుల్స్ విభాగంలో ప్రపంచ నంబర్1 ర్యాంకును సాధించారు. ఇటీవల జరిగిన థామస్ కప్ లో గోల్డ్ మెడల్ సాధించడం పట్ల మంత్రి లోకేష్ హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్ లో సాత్విక్ సాయిరాజ్ మరిన్ని విజయాలు సాధించాలని ఈ సందర్భంగా మంత్రి ఆకాంక్షించారు. ప్రభుత్వపరంగా అన్ని విధాల అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, ఎండీ ఎస్.భరణి పాల్గొన్నారు.



# ఎపిఎల్ టోర్నీ ఆరంభం

## - ట్రోఫీని ఆవిష్కరించిన సినీనటుడు రామ్ చరణ్

**విజయవాడ, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపిఎల్ ట్రోఫీ ఫైనల్స్ మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా టాలీవుడ్ గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ బుధవారం మంగళగిరిలో సందడి చేశారు. ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) చివరి దశ పోటీల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంగళగిరిలోని ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఏపీఎల్ ట్రోఫీని, జట్ల జెర్సీలను ఆయన ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా రామ్ చరణ్ మాట్లాడుతూ, ఏపీఎల్ యువ క్రికెటర్లకు ఒక గొప్ప అవకాశమని ప్రశంసించారు. రాష్ట్రంలో కొత్త ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి లీగ్‌లు ఎంతో దోహదపడతాయని అన్నారు. టోర్నీలో పాల్గొంటున్న క్రీడాకారులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. రామ్ చరణ్ రాకతో స్టేడియంలో సందడి వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమం అనంతరం భీమవరం బుల్స్, క్యాపిటల్ అమరావతి రాయల్స్ జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచిన క్యాపిటల్ అమరావతి రాయల్స్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ (చిన్ని), ఏసీఏ కార్యదర్శి సానా సతీశ్ (రాజ్యసభ సభ్యుడు), ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తదితరులు పాల్గొన్నారు. ఎపిఎల్ లీగ్ దశ మ్యాచ్‌లు జూన్ 27 వరకు జరుగుతాయి. ఆ తర్వాత ప్లేఆఫ్స్ ప్రారంభమై, జూన్ 30న ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ప్రస్తుతం 6 మ్యాచ్‌లలో 8 పాయింట్లతో భీమవరం బుల్స్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉంది.



# తెలుగు రాష్ట్రాల యాత్రికుల కోసం 3 ప్రత్యేక తీర్థయాత్ర టూరిస్ట్ రైళ్లు

## ఐఆర్‌సిటిసి జాయింట్ జనరల్ మేనేజర్ సోమశేఖర్ నాయుడు

**తిరుపతి, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** తెలుగు రాష్ట్రాల యాత్రికుల సౌలభ్యం కోసం ఐఆర్‌సీటీసీ జూలై-ఆగస్టు నెలల్లో భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు ద్వారా మూడు ప్రత్యేక తీర్థయాత్ర ప్యాకేజీలను హైదరాబాద్ నుంచి నిర్వహిస్తున్నట్లు ఐఆర్‌సీటీసీ జాయింట్ జనరల్ మేనేజర్ జి. సోమశేఖర్ నాయుడు తెలిపారు. తిరుపతి స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణతో కలసి మీడియాతో మాట్లాడారు. మొదటి ప్యాకేజీగా అయోధ్య- కాశీ- బైద్యనాథ్ ధామ్ యాత్ర జూలై 4 నుంచి 13 వరకు నిర్వహించనున్నారు. ఈ యాత్రలో గయా, వారణాసి, అయోధ్య, ప్రయాగరాజ్, బైద్యనాథ్ ధామ్ క్షేత్రాలను సందర్శించే అవకాశం ఉంటుంది. ఈ ప్యాకేజీ ప్రారంభ ధర రూ.16,400లుగా నిర్ణయించారు. రెండో ప్యాకేజీ దివ్య దక్షిణ యాత్ర జూలై 20 నుంచి 28 వరకు సాగుతుంది. ఈ యాత్రలో అరుణాచలం, చిదంబరం, తిరుచ్చి, తంజావూరు, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి తదితర ప్రముఖ పుణ్యక్షేత్రాలను దర్శించవచ్చు. ఈ ప్యాకేజీ ప్రారంభ ధర రూ.15,600లుగా ఉంది. మూడో ప్యాకేజీ అయోధ్య- కాశీ పుణ్యక్షేత్ర యాత్ర ఆగస్టు 4 నుంచి 13 వరకు నిర్వహించనున్నారు. పూరి, కోణార్క్, గయా, వారణాసి, అయోధ్య, ప్రయాగరాజ్ ప్రాంతాలను ఈ యాత్రలో సందర్శించవచ్చు. ఈ ప్యాకేజీ ప్రారంభ ధర రూ.16,500లుగా నిర్ణయించారు. ఈ యాత్రలకు స్లీపర్, 3ఏసీ, 2ఏసీ తరగతుల్లో టికెట్లు అందుబాటులో ఉండగా, ధరలు రూ.15,600 నుంచి రూ.33,400 వరకు ఉన్నాయి. ప్రయాణికులకు రైలు, బస్సు, హోటల్ వసతి, అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం, ఉచిత తాగునీరు, ప్రయాణ బీమా, సీసీ కెమెరాలు సెక్యూరిటీ సిబ్బందితో భద్రత, అలాగే దేవాలయాలకు ఉచిత రవాణా సౌకర్యాలు కల్పించనున్నారు. అదనంగా నేపాల్, సింగపూర్-మలేషియా, శ్రీలంక రామాయణ యాత్రలతో పాటు గంగా గయా సంగం, కేరళ, లేహ్, తమిళనాడు, మధ్యప్రదేశ్, గోవా, ఒడిశా, మహారాష్ట్ర, చార్‌ధామ్ యాత్రలకు విమాన పర్యటన ప్యాకేజీలు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. టికెట్ బుకింగ్ వివరాలుకోసం 92814 95853, 82879 32313 నంబర్లను సంప్రదించవచ్చు. ఈ కార్యక్రమంలో తిరుపతి స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, ఐఆర్‌సీటీసీ ఏరియా మేనేజర్ ఎన్. అశోక్ కుమార్ పవన్, వీరన్న పాల్గొన్నారు.




# వన్డే ర్యాంకుల్లో తీన్‌మార్

**దుబాయ్, జూన్24:** వన్డే క్రికెట్ ర్యాంకింగులను ఐసీసీ విడుదల చేసింది. అఫ్గనిస్తాన్‌పై పరుగుల వరద పారించిన టీమిండియా కెప్టెన్ శుభమన్ గిల్ రెండో ర్యాంకులో నిలిచాడు. అఫ్గనిస్తాన్‌పై తొలి రెండు వన్డేల్లో 84, 154 రన్స్ సాధించిన గిల్‌కు మూడో వన్డేలో ఆడే అవకాశం రాలేదు. ఈ పరుగులతో గిల్ వన్డే ర్యాంకును మెరుగుపర్చుకున్నాడు. కాగా టాప్-4 ర్యాంకుల్లో మూడు టీమిండియా ఆటగాళ్లవే. గాయంతో అఫ్గనిస్తాన్‌తో సిరీస్‌కు దూరమైన విరాట్ కోహ్లీ 768 పాయింట్లతో మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. ఇక రోహిత్ శర్మ నాలుగో స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. న్యూజిలాండ్ ప్లేయర్ డారిల్ మిచెల్ 815 పాయింట్లతో టాప్ ర్యాంకులో ఉన్నాడు. గిల్, మిచెల్ మధ్య కేవలం 24 రేటింగ్ పాయింట్స్ తేడా ఉన్నది. ఇతర భారత బ్యాట్స్‌మెన్లలో ఇషాన్ కిషన్ 21 స్థానాలు మెరుగుపర్చుకుని 43వ ర్యాంకుకు చేరుకున్నాడు. శ్రేయస్ అయ్యర్ 14వ ర్యాంకులో, కేఎల్ రాహుల్ 11వ ర్యాంకు దక్కించుకున్నాడు.

బౌలింగ్ విభాగంలోనూ జస్ ప్రీత్ బుమ్రా టాప్ ప్లేస్‌లో ఉన్నాడు. వన్డే బౌలర్లలో అర్షదీప్ సింగ్ 22, ప్రసిద్ధ కృష్ణ 58, వాషింగ్టన్ సుందర్ 71వ స్థానంలో ఉన్నారు. ఇక టెస్టుల్లో కివీస్ బౌలర్ మ్యాట్ హెన్రీ దూసుకొచ్చాడు. బుధవారం కలిసి అతను నెంబర్ వన్ స్థానాన్ని ఆక్రమించాడు. ఇంగ్లండ్‌తో జరిగిన రెండో టెస్టులో మ్యాట్ హెన్రీ 11 వికెట్లు తీసుకున్నాడు.

## టీటీ సమాఖ్యకు మనికా బాత్రా హెచ్చరిక

**న్యూఢిల్లీ, జూన్ 24:** కామన్‌వెల్త్ క్రీడల గోల్డ్ మెడలిస్ట్, రెండుసార్లు ఒలింపియన్ మనికా బాత్రా... భారత టేబుల్ టెన్నిస్ సమాఖ్యపై లీగల్ ఫైట్‌కు సిద్ధమవుతోంది. ఆసియా క్రీడల్లో పాల్గొనే టేబుల్ టెన్నిస్ జట్టు నుంచి తనను తీసివేయడంపై అసహనం వ్యక్తం చేసింది. జట్టు నుంచి తొలగించడంపై సరైన కారణం చెప్పాలని, లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటానని సమాఖ్యను హెచ్చరించింది. ఈ విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు కేంద్ర క్రీడల మంత్రి మన్సుఖ్ మాండవీయ జోక్యం చేసుకోవాలని బాత్రా మరోసారి కోరింది. ఎంపిక ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం కావాలన్నారు.

ఏ ప్రాతిపదికన జట్టులో నుంచి తీసేశారో తనకు లిఖిత పూర్వక సమాధానం ఇవ్వాలని మాత్రమే కోరుతున్నట్లు బాత్రా చెప్పారు. నన్ను సెలక్ట్ చేయకపోవడానికి గల కారణాలను ఫెడరేషన్ తెలియజేయలేదు. టాప్50లో ఉన్న ప్లేయర్ ఒకటే, రెండు వారాల్లో 51వ ర్యాంకుకు పడిపోతే.. ఆసియా క్రీడలకు అర్హత కోల్పోయినట్లేనా? అని ప్రశ్నించారు. తనపై వేటు నిర్ణయానికి గల కారణాలపై సంతృప్తికర సమాధానాలు రాకపోతే టీటీ సమాఖ్యపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని మనికా బాత్రా స్పష్టం చేశారు. కాగా జపాన్ వేదికగా సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు ఆసియా క్రీడలు జరగనున్నాయి.



# ఇంగ్లండ్‌కు ఘనా షాక్ : నాకౌట్‌లో కొలంబియా

**ఫిలడెల్ఫియా, జూన్ 24:** ఫిఫా ప్రపంచ కప్‌లో కొలంబియా నాకౌట్ స్టేజ్‌కు చేరింది. టైటిల్ ఫేవరెట్లలో ఒకటైన ఇంగ్లాండ్‌ను ఘనా నిలువరించగా...పనామాపై ఏకైక గోల్‌తో నెగ్గి క్రొయేషియా నాకౌట్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. క్రొయేషియా మిడ్ ఫీల్డర్ లుకా మోడ్రిక్ తన 200వ అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు.

**ఇంగ్లండ్‌కు ఘనా అడ్డుకట్ట**

సాకర్ ప్రపంచకప్ హాట్ ఫేవరెట్లలో ఒకటైన ఇంగ్లాండ్‌ను ఫుట్‌బాల్ కూన ఘనా దక్షిణా నిలువరించింది.తొలి మ్యాచ్‌లో గెలిచి దూకుడు మీదున్న ఇంగ్లాండ్‌ను ఒక్క గోల్ కూడా చేసే అవకాశం ఇవ్వకుండా గోల్ లెస్ డ్రాగా ముగించింది. ఈ మ్యాచ్‌లో గెలిచి నాకౌట్ బెర్త్ ఖాయం చేసుకుందామనుకున్న ఇంగ్లాండ్ ఆశలకు బ్రేక్ పడింది. గోల్ కోసం ఇరు జట్లు తీవ్రంగా శ్రమించాయి. నాలుగు సార్లు గోల్ పోస్ట్ వైపు టార్గెట్ చేసినా ఇంగ్లాండ్ కలిసి రాలేదు. ఘనా కేవలం ఒక్కసారి మాత్రమే గోల్ పోస్టును టార్గెట్ చేసింది. చివరికి 0-0తో మ్యాచ్ డ్రాగా ముగిసింది. అయితే,మ్యాచ్ రిఫరీ ఎజి కోన్నా తీరుపై ఘనా ఆగ్రహం వ్యక్తం చేసింది. పెనాల్టీ ఇవ్వకపోవడం వల్ల తాము నష్టపోయామని ఆ జట్టు మేనేజ్‌మెంట్ విమర్శించింది.

**పనామాపై క్రొయేషియా విజయం**

గ్రూప్-ఎల్‌లో భాగంగా పనామాతో జరిగిన మ్యాచ్‌లో క్రొయేషియా విజయం సాధించింది. తొలి అర్ధభాగంలో ఇరు జట్లు గోల్స్ చేయడంలో విఫలమయ్యాయి. రెండో అర్ధభాగం 54వ నిమిషంలో యానెట్ బుదిమిర్ అందించిన గోల్‌తో క్రొయేషియా 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఆ తర్వాత ఇరు జట్లు గోల్స్ కోసం తీవ్రంగా శ్రమించాయి. ఓ దశలో పనామా గోల్ చేసినంత పనిచేసింది. అయితే క్రొయేషియా గోల్ కీపర్ దాన్ని అద్భుతంగా అడ్డుకోగలిగాడు. చివరికి క్రొయేషియా ఏకైక గోల్ తేడాతో పనామాపై విజయం సాధించింది. ఈ ఓటమితో పనామా ఇంటి ముఖం పట్టగా...ఇంగ్లాండ్, ఘనా, క్రొయేషియా మధ్య నాకౌట్ రేసు ఆసక్తిగా మారింది.



గోల్ కొట్టడంలో ఇంగ్లండ్ విఫలం





కొలంబియాకు గోల్ కొట్టిన డానిల్

**టాప్ ప్లేస్‌తో కొలంబియా**

గ్రూప్-కేలో భాగంగా డీఆర్ కాంగోను 1-0 గోల్స్ తేడాతో కొలంబియా గెలుపొంది నాకౌట్‌కు చేరుకుంది. పోర్చుగల్‌కు కూడా రెండో స్థానంతో నాకౌట్ బెర్త్ ఖరారైంది. తొలి మ్యాచ్‌లో పోర్చుగల్‌ను నిలువరించిన డీఆర్ కాంగో ఈ జట్టు ఆటగాళ్లు ఈ మ్యాచ్‌లోనూ అద్భుత ఆట ప్రదర్శించారు. తొలి అర్ధభాగం ముగిసేవరకు కొలంబియాకు గోల్ చేసే అవకాశాన్ని ఇవ్వలేదు. చివరకు 76వ నిమిషంలో గానీ కాంగో డిఫెన్స్‌ను ఛేదించలేకపోయింది. సహచరుడు ఇచ్చిన పాస్‌ను సర్కిల్‌లో ఉన్న డానిల్ మునోజ్ అందుకుని గోల్‌గా మలిచాడు. ఈ గోల్‌తోనే కొలంబియాకు విజయం దక్కింది. ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలుపొందిన కొలంబియా.. ఆరు పాయింట్లతో గ్రూప్-కే నుంచి నాకౌట్ చేరిన తొలి జట్టుగా నిలిచింది.

## టిజి20లో వరంగల్ ఘనవిజయం

**హైదరాబాద్,జూన్ 24(వార్త క్రీడా ప్రతినిధి):** ఉప్పల్ స్టేడియంలో జరుగుతున్న తెలంగాణ 20 లీగ్‌లో సెంచరీల మోత మోగుతోంది. హర్షిత్ చౌదరనీ(62బంతుల్లో 121 నాటౌట్; 11 ఫోర్లు, 7 సిక్స్‌లు) మెరుపు సెంచరీతో అన్విత ఖమ్మం ఏస్‌పై వరంగల్ వారియర్స్ 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 203 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన వరంగల్.. 18.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి అందుకుంది. అమన్ రావు వికెట్ తొందరగానే కోల్పోయినా మరో ఎండ్‌లో హర్షిత్ చౌదరీ అదరగొట్టాడు. ఒంటిచేత్తో వరంగల్‌కు గెలుపందించాడు. మిగతా వారిలో సిసోదియా 27 రన్స్ చేశాడు. ఖమ్మం బౌలర్లలో మహేష్, మిలింద్, వేద్ రెడ్డి తలా ఓ వికెట్ తీశారు.



అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన ఖమ్మం ఏస్ 19.2 ఓవర్లలో 202 పరుగులకు ఆలౌటైంది. మయాంక్ గుప్తా (54), మిక్కిల్ జైస్వాల్ (54) హాఫ్ సెంచరీలతో రాణించారు. కచ్చి (17), హిమతేజ (23),వేద్ రెడ్డి (20), మిలింద్ (11), విద్యానంద రెడ్డి (6) పరుగులు చేశారు. వరంగల్ వారియర్స్ బౌలర్లలో అబ్దుల్ మాలిక్ 3, అభిషేక్ 3, పల్లెపాటి 2, హుస్సేన్ ఒక వికెట్ తీశారు.

## పోర్చుగల్‌కు బోణీ కొట్టిన క్రిస్టియానో రొనాల్డో

**హ్యూస్టన్ :** స్టార్ ప్లేయర్ క్రిస్టియానో రొనాల్డో రెండు గోల్స్‌తో మెరిసి సాకర్ ప్రపంచకప్‌లో పోర్చుగల్‌కు గెలుపు బోణీ చేశాడు.కాంగోతో మ్యాచ్ డ్రా చేసిన పోర్చుగల్.. రెండో మ్యాచ్‌లో ఉజ్బెకిస్థాన్‌పై 5-0 గోల్స్‌తో గెలుపొందింది. ఆరో నిమిషంలోనే గోల్ అందించి పోర్చుగల్‌ను ఆధిక్యంలో నిలిపిన క్రిస్టియానో రొనాల్డో మరో గోల్‌ను 39వ నిమిషంలో అందించాడు.ఈ రెండు గోల్స్‌తో ఫిఫా వరల్డ్‌కప్‌లో అరుదైన ఘనత సాధించాడు. 2006 నుంచి ఇప్పటివరకు ఆడిన ఆరు ఫిఫా ప్రపంచకప్‌లలోనూ గోల్స్ చేసిన ఏకైక ప్లేయర్‌గా రొనాల్డో నిలిచాడు. అర్జెంటీనా స్టార్ మెస్సీ కూడా ఆరు వరల్డ్ కప్స్ ఆడినా..2010టోర్నీలో గోల్ చేయలేకపోయాడు. ఈ మ్యాచ్‌లో రెండు గోల్స్ సాధించడం ద్వారా ప్రపంచకప్ చరిత్రలోనే అత్యధిక వయసులో ఒకే మ్యాచ్‌లో రెండు గోల్స్ చేసిన ఆటగాడిగా రొనాల్డో సరికొత్త ప్రపంచ రికార్డును తన పేరిట లిఖించాడు. తనలోని సత్తా ఇంకా తగ్గలేదని ఈ ప్రదర్శనతో ఆయన మరోసారి నిరూపించాడు. ప్రస్తుతం రొనాల్డో వయసు 41 సంవత్సరాల 138 రోజులు. అలాగే, ఉజ్బెకిస్థాన్‌పై చేసిన ఈ రెండు గోల్స్ ద్వారా రొనాల్డో... పోర్చుగల్ తరఫున మరో ఆల్‌టైమ్ రికార్డును సొంతం చేసుకున్నాడు. ప్రపంచకప్ చరిత్రలో పోర్చుగల్ తరఫున అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా నిలిచాడు. రొనాల్డో ఇప్పటివరకు ఆడిన 24 ప్రపంచకప్ మ్యాచ్‌ల్లో మొత్తం 10 గోల్స్ సాధించాడు.



# భారీ లాభాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

## ఐటి, ప్రైవేటు బ్యాంకింగ్ రంగాల మద్దతు



**ముంబై, జూన్ 24:** దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం భారీ లాభాలతో ముగిశాయి.ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్‌మల్హోత్రా వడ్డీ రేట్ల పెంపుచర్చలు ఇప్పుడే అవసరం లేదని చెప్పడం, ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 77 డాలర్ల దిగువకు రావడం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల కొనుగోళ్లు, భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై ఆశావహ సంకేతాలు మార్కెట్ సెంటిమెంట్‌కు బలాన్నిచ్చాయి.ఐటీ, ప్రైవేట్ బ్యాంకింగ్ రంగాల షేర్లు ప్రధానంగా ర్యాలీకి మద్దతిచ్చాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 790.54 పాయింట్లు పెరిగి 76,991.22 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 197.55 పాయింట్లు లేదా 0.83 శాతం లాభపడి 24,021.65 స్థాయికి చేరుకుంది.దీంతో నిఫ్టీ మళ్లీ 24,000 మార్క్‌ను అధిగమించింది.

నిఫ్టీ పెరుగుదలకు ఐసీఐసీఐ బ్యాంక్ 2.59, ఇన్ఫోసిస్ 2.59, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్2.34శాం పెరిగి మద్దతిచ్చాయి. బీఎస్ఈ మిడ్ క్యాప్ సూచీ 0.13 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.20 శాతం మేర పెరిగాయి.ఎన్ఎస్ఈలో 1,735 షేర్లు లాభపడగా, 1,566 షేర్లు నష్టాల్లో ముగిశాయి. 95 షేర్లలో ఎలాంటి మార్పు లేదు. మార్కెట్ అస్థిరతను సూచించే ఇండియా విక్స్ సూచీ 3.99 శాతం తగ్గి 13.39కు చేరుకుంది. భారత్ 10 ఏళ్ల ప్రభుత్వ బాండ్ రాబడి 6.840 శాతం నుంచి 6.805 శాతానికి తగ్గింది. రూపాయి డాలర్‌తో పోలిస్తే స్వల్పంగా బలపడింది. బంగారం ఆగస్టు ఫ్యూచర్స్ ధర 1.44 శాతం తగ్గి రూ.1,44,416 వద్దకు చేరింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 1.38 శాతం తగ్గి 76.02 డాలర్లకు చేరింది.

ఆసియా మార్కెట్లు మిశ్రమ ధోరణిలో ముగిశాయి. టెక్నాలజీ, సెమీకండక్టర్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కొనసాగడంతో పెట్టుబడిదారుల్లో ఆందోళనలు నెలకొన్నాయి. యూరప్ మార్కెట్లు స్వల్ప లాభాల్లో ట్రేడయ్యాయి.అమెరికా మార్కెట్లు నష్టాలతో ముగిశాయి. ఎస్ అండ్ పీ 500 సూచీ 1.44 శాతం, నాస్‌డాక్ 2.21 శాతం పడిపోయాయి. డౌ జోన్స్ సూచీ కూడా స్వల్పంగా బలహీనపడింది. ప్రతి ఏటా 50 వెస్ట్ సైడ్, 200-250 జూడియో స్టోర్లను ప్రారంభించాలని యోచిస్తోంది. ఇదే సమయంలో చైర్మన్ నోయెల్ టాటా పదవి నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. టాటామోటార్స్ 3.21 శాతం లాభపడింది.

**ఐఆర్ఎఫ్‌సీ:** కేంద్ర ప్రభుత్వం 2 శాతం వాటాను విక్రయించేందుకు ఆఫర్ ఫర్ సేల్ ప్రకటించడంతో షేరు 6.83 శాతం క్షీణించింది. **టాన్‌ఫాక్ ఇండస్ట్రీస్:** క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్‌కు బోర్డు ఆమోదం తెలపడంతో షేరు 3.04 శాతం పెరిగింది. **ఇన్ఫోసిస్:** గ్లోబల్‌ఫౌండ్రీస్‌తో బహువార్షిక భాగస్వామ్యాన్ని విస్తరించినట్లు ప్రకటించడంతో షేరు 2.59 శాతం ఎగిసింది. హిందుస్తాన్ ఏరోనాటిక్స్ నుంచి రూ.1,347.71 కోట్ల ఆర్డర్లు పొందినట్లు ప్రకటించినప్పటికీ షేరు స్వల్పంగా 0.58 శాతం తగ్గింది. మొత్తంగా, వడ్డీ రేట్ల పెంపుపై భయాలు తగ్గడం, చమురు ధరల పతనం, విదేశీ పెట్టుబడుల ప్రవాహం కారణంగా దేశీయ ఈక్విటీ మార్కెట్లు బలంగా కోలుకుని పెట్టుబడిదారుల్లో నూతన ఉత్సాహాన్ని నింపాయి.

# అదానీ గ్రూప్‌లో 'త్రిసూత్ర' ప్రణాళిక!

## ఎజిఎంలో గౌతమ్ అదానీ వెల్లడి




**ముంబయి,జూన్ 24:** దేశ నిర్మాణానికి దోహదపడే మౌలిక సదుపాయాలను నిర్మించడం, సమాజంలోని ప్రతి స్థాయిలో మానవ గౌరవాన్ని కాపాడే సంస్థలను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ స్పష్టం చేశారు. కంపెనీ 34వ వార్షిక సర్వసభ్య సమావేశంలో ప్రసంగించిన ఆయన, వచ్చే దశాబ్ద కాలంలో సంస్థ విజన్‌ను అమలు చేసేందుకు మూడు కీలకమైన పునాది సూత్రాలను ఆవిష్కరించారు.

భవిష్యత్తులో మరింత ప్రతిష్ఠ, క్రమశిక్షణ, కార్యదక్షత అవసరమని అదాని పేర్కొన్నారు. పని విధానాన్ని సరళతరం చేస్తున్నామని, అధికార యంత్రాంగాన్ని తగ్గించి, జవాబుదారీతనాన్ని పదును పెట్టడానికి, నిర్ణయాలను అమలుకు మరింత చేరువ చేయడానికి మా ప్రధాన కార్యాలయాలు, సైట్‌లలో మూడుస్థాయిల నిర్మాణాన్ని అమలు చేస్తున్నామని, సంస్థలో ప్రతి పాత్ర, ప్రతి ప్రక్రియ విలువను జోడించేలా ఉండాలి. ప్రధానం కాని కార్యకలాపాలను మా గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లకు లేదా నామినేటెడ్ భాగస్వాములకు బదిలీ చేస్తామఆయన వివరించారు.

కాంట్రాక్టర్లతో తమ పని విధానాన్ని మార్చుకుంటున్నట్లు అదానీ వెల్లడించారు.వారిని దేశ నిర్మాణంలో దీర్ఘకాలిక భాగస్వాములుగా చూస్తామన్నారు. వారి వృద్ధికి మద్దతునిచ్చే, వారి లాభా లను కాపాడే, మా ఆసక్తులతో వారి ఆసక్తులను ఏకీకృతం చేసే లోతైన, స్థిరమైన భాగస్వామ్యాలను నిర్మిస్తామన్నారు. ఇది ప్రా కార్మికుల ఆత్మగౌరవానికి తమసంస్థల్లో పెద్దపీట వేస్తున్నట్లు అదానీ నొక్కి చెప్పారు. మా సొంత, కాంట్రాక్టర్ల సిబ్బంది కలిపి దాదాపు నాలుగు లక్షల మంది ఉన్నారు. వీరిలో 85 శాతం మంది మా సైట్లలో క్షేత్రస్థాయిలో పనిచేసేవారే. మా ప్రణాళికలను వాస్తవరూపంలోకి తెచ్చేది వారే. ప్రతి కార్మికుడికి గౌరవం లభించేలా మేము కట్టుబడి ఉన్నాం. పరిశుభ్రమైన జీవన పరిస్థితులు, పరిశుభ్రమైన ఆహారం, వైద్య సహాయం, సురక్షితమైన పని వాతావరణం, సమయానికి సరైన వేతనాలు చెల్లించడం ఇందులో భాగం" అని ఆయన పేర్కొన్నారు.

సంస్థ వృద్ధితో పాటు అదానీ ఫౌండేషన్ కార్యకలాపాలు కూడా తమ లక్ష్యాలకు కేంద్రంగా ఉన్నాయని గౌతమ్ అదానీ తెలిపారు. డాక్టర్ ప్రీతి అదానీ సమర్థ నాయకత్వంలో ఫౌండేషన్ 30వ సంవత్సరంలోకి అడుగు పెడుతోందని, ప్రస్తుతం 22 రాష్ట్రాల్లోని 7,000 గ్రామాల్లో దాదాపు కోటి మందికి సేవలు అందిస్తోందని చెప్పారు.

అహ్మదాబాద్, ముంబైలలో 1000 పడకల మల్టీస్పెషాలిటీ ఆసుపత్రులు, వైద్య కళాశాలలతో కూడిన అదానీ హెల్త్ సిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇక నైపుణ్యాభివృద్ధిలో భాగంగా గ్రామీణ భారతదేశంలో 1.25 లక్షల మంది యువతకు శిక్షణ ఇస్తున్నట్లు, గుజరాత్‌లోని కచ్ ప్రాంతంలో కర్మ ఉత్సవ్ తో స్థానిక ఉపాధిని ప్రోత్సహిస్తున్నట్లు గౌతమ్ అదానీ వివరించారు.

### బ్యాంక్ ఆఫ్ ఇండియా కేసులో లండన్ కోర్టు తీర్పు

## నీరవ్‌మోడీ 100కోట్లు చెల్లించాల్సిందే



**లండన్,జూన్ 24:** భారత్ నుండి పరారైన ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీకి లండన్ హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది.బ్యాంక్ ఆఫ్ ఇండియా దాఖలు చేసిన కేసులో నీరవ్ మోడీ తన కంపెనీ రుణం కోసం ఇచ్చిన వ్యక్తిగత గ్యారెంటీ కింద 10.7 మిలియన్ డాలర్ల సుమారు రూ.100 కోట్లు కంటే ఎక్కువ మొత్తాన్ని చెల్లించాల్సిందేనని కోర్టు తీర్పునిచ్చింది. లండన్ సర్క్యూట్ కమర్షియల్ కోర్ట్ జడ్జి జస్టిస్ సైమన్ టింక్లర్ తన తీర్పులో అసలు మొత్తం 4.1 మిలియన్ డాలర్లతో పాటు దానికి సంబంధించిన వడ్డీని కూడా నీరవ్ మోదీ నుంచి వసూలు చేయాలని ఆదేశించారు. ఈ గ్యారెంటీ చెల్లదని,తనకు సరైన డిమాండ్ నోటీసులు రాలేదని నీరవ్ మోడీ చేసిన వాదనలను కోర్టు పూర్తిగా తోసిపుచ్చింది. బ్యాంక్ ఆఫ్ ఇండియా జులై 2012లో దుబాయ్ ఆధారిత ఫైర్‌స్టార్ డైమండ్ ఎఫ్‌జెడ్ఈ అనే నీరవ్ మోడీకి చెందిన సంస్థకు భారీ రుణాన్ని మంజూరు చేసింది. ఈ రుణ సదుపాయానికి గాను ఆగస్టు 3, 2013న నీరవ్ మోదీ వ్యక్తిగత పూచీకత్తు ఇచ్చారు. అయితే, 2018 ప్రారంభంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో జరిగిన భారీ కుంభకోణం వెలుగులోకి రావడంతో, బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ రుణాన్ని వెనక్కి తీసుకుంది. మార్చి, ఏప్రిల్ 2018తో పాటు అక్టోబర్ 2025లో కూడా బ్యాంకు పంపిన డిమాండ్ నోటీసులను నీరవ్ మోడీ, అతడి కంపెనీ పట్టించుకోలేదు.

పీఎన్‌బీ కుంభకోణం కారణంగా ఫైర్‌స్టార్ గ్రూప్ కార్యకలాపాలు, నీరవ్ మోడీ అప్పులు తీర్చే సామర్థ్యం పూర్తిగా దెబ్బతిన్నాయని, అందువల్ల రుణాన్ని వెనక్కి తీసుకోవడం సమర్థనీయమేనని కోర్టు అభిప్రాయపడింది. భారతదేశంలో దాదాపు రూ. 13వేల కోట్ల పీఎన్‌బీ రుణ మోసానికి పాల్పడిన కేసులో ప్రధాన నిందితుడైన నీరవ్ మోదీ, మార్చి 2019లో అరెస్ట్ అయినప్పటి నుండి యూకే జైల్లోనే శిక్ష అనుభవిస్తున్నారు. మనీలాండరింగ్, మోసం కేసులను ఎదుర్కొనేందుకు వీలుగా తనను భారతదేశానికి అప్పగించాలన్న నిర్ణయంపై ఆయన ఇంకా చట్టపరమైన పోరాటం చేస్తూనే ఉన్నారు.

## భారత సంతతి సిఇఒకు 7789కోట్ల ప్యాకేజి



**వాషింగ్టన్, జూన్ 24:** అమెరికాకు చెందిన రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ వెల్‌టవర్ సీఈఓగా పనిచేస్తున్న శంఖ్ మిత్రా, ప్రపంచంలోనే అత్యధిక పారితోషికం అందుకుంటున్న ఎగ్జిక్యూటివ్ జాబితాలో రెండో స్థానంలో నిలిచారు. ఆయన 821 మిలియన్ డాలర్లు అంటే సుమారు రూ.7,789 కోట్లు విలువైన వేతన ప్యాకేజీని అందుకుని చరిత్ర సృష్టించారు. టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ (158.4బిలియన్ డాలర్లు) తర్వాత అత్యధిక వేతనం పొందుతున్న వ్యక్తిగా శంఖ్ మిత్రా రికార్డులకెక్కారు.

శంఖ్ మిత్రా ప్యాకేజీలో 99శాతం స్టాక్ గ్రాంట్ల రూపంలోనే ఉంది. అక్టోబర్‌లో ఆయనకు 789 మిలియన్ డాలర్ల విలువైన స్టాక్స్ కేటాయించారు. ఈ ప్యాకేజీకి కొన్ని కఠినమైన షరతులు ఉన్నాయి. కంపెనీలో ఆయన2031 వరకు కొనసాగితేనే సగం షేర్లను పొందుతారు. మిగిలిన సగం పొందాలంటే, ఐదేళ్ల వ్యవధిలో వెల్‌టవర్ మార్కెట్ విలువ 45శాతం పెరగాలి. అంతేకాకుండా పలు స్టాక్ ఇండెక్స్‌ల కంటే కంపెనీ షేర్ల పనితీరు మెరుగ్గా ఉండాలి. ఆయన నాయకత్వంలో కంపెనీ వృద్ధి సాధిస్తేనే ఈ భారీ మొత్తం ఆయనకు దక్కుతుంది. ఇది ఆయన గత ప్యాకేజీ కంటే 40 శాతం అధికం కావడం గమనార్హం.భారత్‌లోనే పుట్టి పెరిగిన శంఖ్ మిత్రా, జాదవ్ పూర్‌యూనివర్సిటీ నుంచి ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేశారు. ఆ తర్వాత ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి, కొలంబియా బిజినెస్‌స్కూల్‌లో అప్లైడ్ వ్యాల్యూ ఇన్వెస్టింగ్‌లో ఎంబీఏ పట్టా పొందారు.

కెరీర్‌ను ప్రైస్ వాటర్ హౌస్ కూపర్స్‌లో ప్రారంభించి, ఫిడిలిటీ ఇన్వెస్ట్‌మెంట్స్, సిటాడెల్ ఇన్వెస్ట్‌మెంట్, మిలీనియం పార్ట్‌నర్స్ వంటి ప్రముఖ సంస్థల్లో రియల్ ఎస్టేట్ సెక్యూరిటీస్, పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ విభాగాల్లో కీలక పాత్రలు పోషించారు.2016లో ఫైనాన్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా వెల్‌టవర్‌లో చేరి తన ప్రతిభతో ఉన్నత స్థానాలకు ఎదిగారు. చీఫ్‌ఆపరేటింగ్ ఆఫీసర్, చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్‌గా పనిచేసి, 2020 అక్టోబర్‌లో కంపెనీకి సీఈఓగా నియమితులయ్యారు.

## ట్రెంట్ ఛైర్మన్ పదవికి నోయెల్ టాటా గుడ్‌బై



**ముంబయి,జూన్ 24:** టాటా గ్రూప్‌కు చెందిన రిటైల్ దిగ్గజం ట్రెంట్ ఛైర్మన్‌గా దాదాపు మూడు దశాబ్దాల పాటు సేవలందించిన ప్రముఖ వ్యాపారవేత్త నోయెల్ టాటా తన పదవి నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు.కంపెనీ 47వ వార్షిక సర్వసభ్య సమావేశంలో వాటాదారులను ఉద్దేశించి మాట్లాడుతూ, ఛైర్మన్‌గా ఇదే తన చివరి సమావేశమని ఆయన స్పష్టం చేశారు. టాటా గ్రూప్ గవర్నెన్స్ మార్గదర్శకాల ప్రకారం.. నాన్‌ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల పదవీ విరమణ వయసు 70 ఏళ్లుగా నిర్దేశించారు. ఈ ఏడాది నవంబర్‌లో నోయెల్ టాటాకు 70ఏళ్లు నిండనున్న నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ రిటైర్మెంట్ ప్రకటనతో టాటా గ్రూప్ రిటైల్ విభాగంలో ఆయన పోషించిన కీలక పాత్రకు ముగింపు పలికినట్లయింది. నోయెల్ టాటా ప్రస్థానం ట్రెంట్ కంపెనీతో విడదీయరానిది. ఆయన తల్లి సిమోన్ టాటా,ల్యాక్మేను విక్రయించిన తర్వాత ట్రెంట్ కంపెనీని స్థాపించారు.1998లో నోయెల్ టాటా ఈ కంపెనీ బోర్డులో డైరెక్టర్‌గా చేరారు.ఆమరుసటి ఏడాదే, 1999 జూన్‌లో కంపెనీకి తొలి ఎండీగా బాధ్యతలు స్వీకరించి, దేశంలో రిటైల్ వ్యూహాన్ని మార్చేసిన ఘనతను సొంతం చేసుకున్నారు.

## 300 నగరాలకు అమెజాన్‌నౌ విస్తరణ: ఆండీ జెస్సీ

**ముంబయి:** ఈకామర్స్ దిగ్గజం అమెజాన్ క్విక్‌కామర్స్ విభాగంలో ప్రవేశపెట్టిన అమెజాన్‌నౌ సర్వీస్, దేశంలో అత్యంతవేగంగా అభివృద్ధి చెందుతున్న వ్యాపారంగా నిలిచిందని అమెజాన్ సీఈఓ ఆండీ జెస్సీ వెల్లడించారు. భారత పర్యటనలో ఉన్న ఆండీ జెస్సీ, ముంబైలోని అత్యంత రద్దీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన అమెజాన్ నౌ మైక్రోఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్‌ను సందర్శించారు. భారత్‌లో ఉండటం, ముంబైలోని మైక్రోఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్‌ను సందర్శించడం చాలా బాగుంది.ప్రజలకు తక్షణం అవసరమయ్యే కిరాణా సరుకులు, షాంపూలు,బేబీ ప్రొడక్టులు వంటివి ఆర్డర్ చేసిన నిమిషాల్లోనే ప్యాక్ చేసి డెలివరీ చేస్తున్నారని ఆయన అన్నారు.ఈ మైక్రోఫుల్‌ఫిల్‌మెంట్ కేంద్రాలను ప్రత్యేకంగా నిత్యావసర వస్తువులను వేగంగా ప్యాక్ చేసి, డెలివరీ చేసేందుకు వీలుగా డిజైన్ చేశారు. ఈ సేవను ఉపయోగించడం ప్రారంభించిన ప్రైమ్ మెంబర్లు, షాపింగ్ ఫ్రీక్వెన్సీని మూడు రెట్లు పెంచారని జెస్సీ గణాంకాలతో వివరించారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



# సత్యదేవుని దర్శించిన కేరళ డిజిపి చంద్రశేఖర్

అన్నవరం జూన్ 24 (ప్రభాతవార్త) కాకినాడ జిల్లా అన్నవరం సత్యదేవుని దర్శించి న కేరళ డిజిపి రావాడ చంద్రశేఖర్ దంపతులు. బుధవారం మధ్యాహ్నం సదేవుని ఆయనకు వచ్చిన కేరళ డిజిపి దంపతులకు ఆలయ అధికారులు అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం డిజిపి దంపతులు, కుటుంబ సభ్యులు సత్యదేవుని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం డిజిపి దంపతులకు పండితులు వేద ఆశీర్వచనం చేసి స్వామి జ్ఞాపకం ప్రసాదము అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు స్థానికులు పోలీసులు పాల్గొన్నారు.




తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం. డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

రాజమహేంద్రవరం గురువారం 25 జూన్ 2026 I


## ప్రజా సమస్యలపై గళమెత్తిన ఎంపీటీసీలు



తాళ్లరేవు జూన్ 24 (ప్రభాతవార్త): ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని, ఎంపీటీసీలుగా గెలిచి ఐదేళ్లు పూర్తి కావస్తున్న నేటికీ ప్రజా సమస్యలు పరిష్కారం కాకపోవడం అన్యాయమని పలువురు ఎంపీటీసీలు అన్నారు. బుధవారం ఎంపీపీ రాయుడు సునీత అధ్యక్షతన జరిగిన తాళ్లరేవు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో అధికారుల తీరుపై పలువురు ఎంపీటీసీలు ధ్వజమెత్తారు. జల జీవన్ మిషన్ భాగంగా గ్రామాల్లో పైపులైన్లు వేసినప్పటికీ, కుళాయి కనెక్షన్లు ఇవ్వకపోవడం వల్ల అంబేద్కర్ నగర్ ప్రజలు తాగునీటి కోసం నానా ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని సుంకర పాలెం ఎంపీటీసీ గుత్తుల శ్రీనివాస్ అన్నారు. [illegible] సమావేశంలో వైస్ ఎంపీపీ కొపనాతి లలిత, రేకాడి నరసింహమూర్తి, కాదా శ్రీనివాస్ చెక్క కామేశ్వరరావు, వనమాడివేణి,దంగేటి సూరిబాబు, కడియాల మహాలక్ష్మి, దున్న రాంబాబు, మోర్త బీమాబాయి, కూరాటి శ్రీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## బాల కార్మిక నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

### జిల్లా కలెక్టర్ కె దినేష్ కుమార్



రంపచోడవరం జూన్ 24 ప్రభాతవార్త. బాల కార్మికులు, కిశోర కార్మికుల నిర్మూలనతో పాటు వారి రక్షణ, పునరావాసం లక్ష్యంగా పోలవరం జిల్లా యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలియ జేయడం జరిగింది. అందులో భాగంగా జూన్ 23 నుండి 30 వరకు "చైల్డ్ లేబర్ రెస్క్యూ అండ్ రీహాబిలిటేషన్ క్యాంపెయిన్"ను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ ఆధ్వర్యంలో కార్మిక శాఖ అధికారులు, వివిధ శాఖల అధికారులతో కూడిన బృందాలు మండలాల వారీగా తనిఖీలు చేపట్టనున్నట్లు తెలిపారు. రంపచోడవరం, మారేడుమిల్లి, అడ్డతీగల, గంగవరం, వీఆర్ పురం, కూనవరం, వై.రామవరం, గూర్తేడు, చింతూరు, ఎటపాక తదితర మండలాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించనున్నారు. బాల కార్మికులు పనిచేసే అవకాశమున్న దుకాణాలు, వాణిజ్య సంస్థలు, ఇటుక బట్టీలు, బార్లు, రెస్టారెంట్లు, భవన నిర్మాణ పనులు, గృహ సేవలు, ప్రమాదకర పరిశ్రమలు, ఇతర ఉపాధి కేంద్రాలను క్షేత్ర స్థాయిలో బృందాలు ప్రత్యేకంగా పరిశీలించనున్నారు. తనిఖీలలో బాల కార్మికులు గుర్తించినట్లయితే వారిని వెంటనే రక్షించి, చట్టపరమైన చర్యలతో పాటు పునరావాస కార్యక్రమాలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రజలు సహకరించాలని, బాల కార్మికులు పనిచేస్తున్నట్లు గుర్తించినట్లయితే 1098 టోల్ ఫ్రీ నెంబర్ కు గానీ లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలన్నారు.

### కాపు ఉద్యమనేత ముద్రగడ్డ ఆరోగ్యంపై

## దుష్ప్రచారం చేయొద్దు

### కులాల మధ్య చిచ్చు పెడుతున్న చంద్రబాబు



కాకినాడ రూరల్, జూన్ 24,(ప్రభాతవార్త): మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం ఆరోగ్య పరిస్థితిపై సోషల్ మీడియా, కొన్ని మీడియా సంస్థల్లో దుష్ప్రచారాలు చేయడం సరికాదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కాపు నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రమణయ్యపేట మాజీ మంత్రి కురసాల కన్నబాబు కార్యాలయంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో మాజీ శాసనసభ్యులు కురసాల కన్నబాబు, దాడిశెట్టి రాజా, తోట నరసింహం, వంగా గీత, జక్కంపూడి రాజా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాపు సామాజిక వర్గాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించొద్దని, రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా నిర్వీర్యం అయిందని ఆవేదన చెందారు.జీవిత కాలంలో ఒక స్పష్టమైన లక్ష్యం కోసం పనిచేసిన ముద్రగడ్డపై పిచ్చి కథనాలు అల్లడం దుర్మార్గమని, ముద్రగడ ఆరోగ్యంపై తప్పుడు ప్రచారాలు చేయడం చాలా బాధాకరమన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముద్రగడ్డ పద్మనాభం క్రమంగా కోలుకుంటున్నారని తెలిపారు."హాస్పిటల్ యాజమాన్యం విజ్ఞప్తి మేరకే మేము అక్కడికి వెళ్లడం లేదు తప్ప, ఆయన ఆరోగ్యానికి సంబంధించిన ప్రతి విషయాన్ని నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. కాపు సామాజిక వర్గం నుంచి ముఖ్యమంత్రి అయ్యే అర్హత, సామర్థ్యం ఉన్న మొదటి వ్యక్తి వంగవీటి మోహన రంగా అయితే, ఆ తర్వాతి స్థానం ముద్రగడ్డదే" అని ఆయన పేర్కొన్నారు. ఎవరి వద్ద ఏమీ ఆశించని, ఎవరైనా సహాయం చేద్దామన్నా వద్దనే అంతటి గొప్ప వ్యక్తిత్వం గల నేత ముద్రగడ అని కొనియాడారు. చేతులు జోడించి నమస్కరిస్తున్నా.. యువత ఎవరూ సోషల్ మీడియా వేదికగా ముద్రగడ్డను కించపరిచేలా దుష్ప్రచారం చేయవద్దని తోట త్రిమూర్తులు విజ్ఞప్తి చేశారు. తాజాగా తన గ్రామంలో జరిగిన కాపు నేతల ఆత్మీయ కలయిక కేవలం కూటమి ప్రభుత్వంలో కాపులు కోల్పోతున్న సంక్షేమ పథకాలపై చర్చించుకోవడానికేనని, ఆ సమావేశంలో పవన్ కళ్యాణ్ గురించి కనీసం మాట్లాడుకోలేదని ఆయన స్పష్టం చేశారు. అనంతరం వైసీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి కురసాల కన్నబాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా అదుపుతప్పిందని ఆందోళన వ్యక్తం చేశారు. కృష్ణలంక లాకప్ డెత్ వ్యవహారంలో సిట్ కోర్టుకు సమర్పించిన నివేదికలో సాయికృష్ణది హత్యేనని తేలిందని, దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**పవన్ కళ్యాణ్‌కు, కాపు నేతలకు మధ్య గొడవ పెట్టే కుట్ర!**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేవలం కులాల మధ్య చిచ్చు పెట్టడమే లక్ష్యంగా పనిచేస్తున్నారని వైసీపీ నేతలు ఆరోపించారు. కాపు నేతల భేటీని రాజకీయం చేస్తూ, పవన్ కళ్యాణ్‌కు కాపు నాయకులకు మధ్య గొడవలు జరుగుతున్నట్లు ఒక కల్పిత ప్రచారాన్ని మీడియా, సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా వ్యాప్తి చేస్తున్నారని వారు మండిపడ్డారు. ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే ఇటువంటి హీనమైన రాజకీయాలకు పాల్పడుతున్నారని నాయకులు ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో వంగా గీతా విశ్వనాథ్, జక్కంపూడి రాజా, తోట నరసింహం, దాడిశెట్టి రాజా , దవులూరి దొరబాబు,తోట రాంజీ తదితరులు పాల్గొన్నారు

## తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి.

### మంత్రి కందుల దుర్గేష్ హెచ్చరిక



కడియం, జూన్ 24 (ప్రభాతవార్త) కడియం పేపర్ మిల్లులో తొలగింపులకు గురైన 70 మంది పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖామంత్రి కందుల దుర్గేష్ డిమాండ్ చేశారు. కార్మికులకు న్యాయం చేయడంలో యాజమాన్యం విఫలమైతే తాను స్వయంగా కార్మికులతో కలిసి ప్రత్యక్ష ఆందోళనలో పాల్గొంటానని హెచ్చరించారు. పేపర్ మిల్లు యాజమాన్యం తొలగించిన 70 మంది కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ కార్మికులు గత 59 రోజులుగా కొనసాగిస్తున్న నిరసన దీక్షా శిబిరాన్ని బుధవారం మంత్రి కందుల దుర్గేష్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ యాజమాన్యం మొండి వైఖరిని తీవ్రంగా ఖండించారు. పరిశ్రమల అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి కల్పనకు ప్రభుత్వం ఎల్లప్పుడూ మద్దతు ఇస్తుందని, అయితే సంస్థ అభివృద్ధికి తమ శ్రమను అంకితం చేస్తున్న కార్మికుల పట్ల అన్యాయంగా వ్యవహరించడం సమంజసం కాదన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను చర్చల ద్వారా పరిష్కరించాల్సిన యాజమాన్యం, బెదిరింపులు, లాకౌట్‌లు, తొలగింపుల వంటి చర్యలకు పాల్పడటం బాధాకరమని పేర్కొన్నారు. ప్రభుత్వ జోక్యంతో లాకౌట్ ఎత్తివేయబడినప్పటికీ 59 మంది కాంట్రాక్టు కార్మికులను విధుల నుంచి తొలగించడం, వారికి మద్దతుగా నిలిచిన 11 మంది పర్మినెంట్ కార్మికులపై కూడా చర్యలు తీసుకోవడం దారుణమన్నారు. ఈ అక్రమ తొలగింపులకు వ్యతిరేకంగా కార్మికులు ఐక్యంగా, శాంతియుతంగా పోరాటం కొనసాగించడం అభినందనీయమని తెలిపారు. ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న తాను కార్మికుల పక్షాన నిలుస్తానని, వారి హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. ఇప్పటికే పేపర్ మిల్లు యాజమాన్యంతో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కార్మిక శాఖ కమిషనర్‌లతో పలుమార్లు చర్చించినట్లు వెల్లడించారు. సమస్య పరిష్కారానికి ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని చెప్పారు. ఈ నెల 30వ తేదీ వరకు వేచి చూస్తామని, ఈలోపు యాజమాన్యం తన మొండి వైఖరిని వీడి కార్మికులకు న్యాయం చేయాలని మంత్రి డిమాండ్ చేశారు. లేకపోతే తాను కార్మికులతో కలిసి ప్రత్యక్ష పోరాటానికి దిగుతానని, ఆ పరిస్థితుల్లో జరిగే పరిణామాలకు యాజమాన్యమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు టి. అరుణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి. పవన్, జిల్లా అధ్యక్షులు ఎం. సుందర్‌బాబు, క్రి రామకృష్ణ, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు, పేపర్ మిల్లు కార్మికులు పాల్గొన్నారు.

## నగరంలో అమృత్ 2 పనులకు శంకుస్థాపన

### 70 ఏళ్ల తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

### ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



రాజమహేంద్రవరం సిటీ, జూన్ 24 (ప్రభాతవార్త) రాజమహేంద్రవరం నగర ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న తాగునీటి సమస్య పరిష్కారానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో కీలక ముందడుగు పడింది. బుధవారం అమృత్ 2 పథకం కింద 202.02 కోట్ల అంచనా వ్యయంతో పబ్లిక్ హెల్త్ చేపట్టనున్న తాగునీటి సరఫరా వ్యవస్థ అభివృద్ధి ఫేవరెట్ నెట్వర్క్ నిర్మాణం కంబాల చెరువు సహా జలవనరుల పునర్జీవన పనులకు టింబర్ యార్డ్ వద్ద ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఎమ్మెల్సీ సోము వీర్రాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ నగరానికి గోదావరి నది పక్కనే ఉన్నప్పటికీ దశాబ్దాలుగా ప్రజలు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని 60 నుండి 70 సంవత్సరాలుగా నగరవాసులు మంచినీటి కోసం ఎదురుచూస్తున్నారని పరిస్థితిని కేంద్ర ప్రభుత్వం గుర్తించి శాశ్వత పరిష్కారానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమన్నారు. ఎమ్మెల్యే శ్రీనివాస్ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకువస్తూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి మాట్లాడుతూ నగర ప్రజల చిరకాల కోరిక నెరవేరిన రోజుగా ఈ రోజున అభివర్ణించారు. ముఖ్యంగా క్వారీ మార్కెట్ ప్రాంతంలోని 45, 46, 47, 48, 49 డివిజన్ల ప్రజల దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు ఈ ప్రాజెక్టు శాశ్వత పరిష్కారం గా నిలుస్తుందని అన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత ఉదయం సాయంత్రం నిరంతరాయంగా త్రాగునీరు అందే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఈ ప్రాజెక్టును రాజమహేంద్రవరం కి తీసుకురావడంలో ఎంపీ పురందేశ్వరి కీలక పాత్ర పోషించారని కొనియాడారు. గతంలో అనేకమంది ప్రజాప్రతినిధులు ప్రయత్నించిన సాధ్యం కానీ పనిని ఆమె చేసి చూపించారన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ నగర ప్రజల తాగునీటి సమస్య పరిష్కారం దశగా ఈ ప్రాజెక్టు మహిళరాయిగా నిలుస్తుందని ఎంపీ పురందేశ్వరి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సమిష్టి కృషి వల్లే ఈ ప్రాజెక్టు సాధ్యమైందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడిపూడి సత్తిబాబు, కూటమి నాయకులు మజ్జి రాంబాబు, వై శ్రీను, కొయ్యల రమణ ,గుడ్డిగా రవి, నందివాడ దినేష్, జామి సత్యనారాయణ, ఎస్ ఈ ఏ రత్నాకర్ రెడ్డి ,ఈ ఈ ఆర్ వి ఎస్ శేషగిరిరావు, డి ఈ కెవి విజయ పార్వతి, ఏఈ జీ సందీప్, వివిధ శాఖ ఇంజనీర్లు పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## యాప్ ద్వారా పారదర్శకంగా ఎరువుల పంపిణీ



శంఖవరం జూన్ 24 ప్రభాతవార్త రైతులకు జాతీయ ఎరువుల విక్రయ ఫ్రేమ్వర్క్ యాప్ ద్వారా అవసరమైన ఎరువులను పారదర్శకంగా పంపిణీ చేయడం జరుగుతుందని వ్యవసాయ అధికారి పి గాంధీ అన్నారు. మండల కేంద్రం శంఖవరంలో గల సొసైటీలో యాప్ ద్వారా బుక్ చేసుకున్న రైతులకు యూరియా పంపిణీని ఏఓ గాంధీ ప్రారంభించి, ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ గాంధీ మాట్లాడుతూ ప్రతి రైతు జాతీయ ఎరువుల విక్రయ ఫ్రేమ్ వర్క్ యాప్ పై తమ మొబైల్ ఫోన్లలో డౌన్లోడ్ చేసుకుని అవగాహన ఏర్పరుచుకోవాలన్నారు. రైతులకు దీనిపై వివరాలు తెలియకపోతే స్థానిక రైతు సేవా కేంద్రాల వద్ద వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలన్నారు. దీనివల్ల రైతులు తమ పంట భూమికి ఎంత ఎరువుల అవసరమో యాప్ లోనే నిర్ధారణ అవుతుందని, దానివల్ల ఎరువులను పొందడం సులభతరం అవుతుందన్నారు. రైతులు, కౌలు రైతులు తమ పంటలకు కావాల్సిన వివిధ రకాల ఎరువులను యాప్ ద్వారా శంఖవరం మండలంలోని శంఖవరం, అన్నవరం, కత్తిపూడి గ్రామాల్లో ఉన్న దుకాణాలలోనూ, సమీప ప్రాంతాలలో ఉన్న రౌతులపూడి, తునిలలో ఉన్న దుకాణాలలోనూ కూడా ఇంటి వద్దే బుక్ చేసుకొని ఎరువులను తీసుకోవచ్చునని వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీనివాస్, వ్యవసాయ సహాయకుడు క్రాంతి, సొసైటీ కార్యదర్శి పడాల నూకరాజు, సిబ్బంది భద్రరావు, రైతులు పాల్గొన్నారు.


## ఘనంగా 45 అడుగుల ప్రసన్నాంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ట





కె గంగవరం, జూన్ 24, (ప్రభాతవార్త): కె గంగవరం మండలం సత్యవాడ గ్రామంలో 45 అడుగుల ప్రసన్నాంజనేయ స్వామి వారి విగ్రహావిష్కరణ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు శ్రీ రామ బాల భక్త, ఆలయ కమిటీ వారు తెలియజేశారు. సత్యవాడ గ్రామ ప్రజల సహాయ సహకారాల,ఆధ్వర్యంలో సుమారు ఒక కోటి 20 లక్షల రూపాయలతో శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని బుధవారం ఉ.5 గంటలకు సంకల్పం, గవ్యాంతపూజ, యంత్ర పూజ గర్తిన్యాసం, రత్నన్యాసం, అనంతరం ఉదయం 7:30 నిమిషాలకు శ్రీ విఘ్నేశ్వర, సుబ్రహ్మణ్యేశ్వర, ప్రసన్నాంజనేయ స్వామి, స్వామివార్ల పాదుకల ప్రతిష్ట చేసినట్లు ఆలయ కమిటీ వారు తెలియజేశారు. యర్రంశెట్టి శివ సాయి కృష్ణ ప్రకాష్ లక్ష్మీ దంపతులచే శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి విగ్రహ ప్రతిష్ట జరపగా,అతిపెద్ద 45 అడుగుల ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహ,పాదుకలను శ్రీ సౌభాగ్య లక్ష్మి రా అండ్ బాయిల్డ్ రైస్ మిల్ గంగవరం అధినేతలైనటువంటి కీ.శే. సలాది గంగయ్య, సుబ్బాయమ్మ కుమారులు,మనవులు కుటుంబ సభ్యులు కీ.శే.తులసి లక్ష్మి సూర్యనారాయణమూర్తి, సూర్యచంద్ర, సలాది అప్పారావు,సత్యనారాయణమ్మ సలాది గంగన్న,సూర్యమణి, సలాది వీర వెంకటరమణ,నాగలక్ష్మి, సలాది సత్య గంగాధర వరప్రసాద్,లక్ష్మి పావని, సలాది సత్య వీర వెంకట గంగాధర్, సూర్య చక్రపాణి దంపతులచే ప్రతిష్టించగా, సలాది విష్ణు వెంకట సత్యనారాయణమూర్తి, సత్యసాయిజ్యోతి దంపతులచే శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట చేసినారు. తోట నరసయ్య,రాఘవ దంపతులచే శ్రీ సుబ్రహ్మణ్యస్వామి వారి విగ్రహ ప్రతిష్ట,మూలవిరాట్ కి బంగారు యంత్రం లు ప్రతిష్ట చేసినారు. దర్శనానంతరం సమస్తయంత్రం, కళ్యాన్యాసములు, దృష్టిగోవు, మహా పూర్ణాహుతి అనంతరం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి శాంతి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాలన్నీ పండితులు యలమంచిలి కృష్ణమూర్తి శివాచార్య ఆధ్వర్యంలో ప్రసాద్ శర్మ, బ్రహ్మత్వమున రామేశ్వర కు కాశీ విశ్వనాథ సత్యనారాయణమూర్తి పర్యవేక్షణలో అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు కమిటీ వారు తెలిపారు. అనేకమంది ప్రముఖులు,రాజకీయనాయకులు,సంఘసంస్కర్తలు, పెద్దలు స్వామివారిని దర్శించుకున్నారు.సుమారు 6000 మంది అన్నదాన కార్యక్రమం లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారిని దర్శించుకుని, స్వామివారి కృపకు పాత్రులైనారు. ఊరంతా పచ్చని తోరణాలతో,పూలదండలతో,మామిడకులతో,పందిర్లులాంటి కాషాయపు జెండాలతో, ఇంటింటా బంధుమిత్రుల సందడితో సత్యవాడ గ్రామానికి శ్రీరామనవమి మళ్లీ వచ్చిందా అని తలపించే విధంగా ఈ కార్యక్రమం జరిగినట్లు పలువురు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమాలన్నిటికి సహకరించిన గ్రామ ఆచార్యులకు,యువతకు,పెద్దలకు,ప్రతి ఒక్కరికి పేరుపేరునా కమిటీ వారు ధన్యవాదములు తెలియజేశారు.

## వికాస్ కళాశాలలో డిఫెన్స్ అకాడమీపై అవగాహన సదస్సు..





రామచంద్రపురం,జూన్ 24 (ప్రభాతవార్త ): స్థానిక వికాస్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు డిఫెన్స్ అకాడమీ పై బుధవారం ఒక ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.విశాఖపట్నానికి చెందిన డిఫెన్స్ రంగా అనుభవిజ్ఞులు,సీనియర్ ఫ్యాకల్టీ కె.శ్రీనివాసనాయుడు ముఖ్య వక్తగా హాజరై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ సేవలతో పాటు ఉజ్వల భవిష్యత్తును అందించే నావి, ఎయిర్ ఫోర్స్, ఆర్మీ రంగాలలో ఉద్యోగ అవకాశాల గురించి విద్యార్థులకు వివరించారు.అతి చిన్నవయసులోనే డిఫెన్స్ రంగంలో ప్రవేశించడం ద్వారా బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చని ఆయన తెలిపారు.ఇందుకోసం నిర్వహించే పరీక్ష విధానం,సిలబస్ మరియు కావాల్సిన ఫిజికల్ ఫిట్నెస్ గురించి విద్యార్థులకు క్షుణ్ణంగా అవగాహన కల్పించారు.విద్యార్థుల తల్లిదండ్రులు కూడా రక్షణ రంగంపై అవగాహన పెంచుకుని,తమ పిల్లలను ఆ దిశగా ప్రోత్సహించాలని ఆయన పిలుపునిచ్చారు.అనంతరం,డిఫెన్స్ అకాడమీకి సంబంధించి ప్రత్యేక బ్రోచరెను కెనరా బ్యాంక్ మేనేజర్ శ్రీరామ్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వాసంశెట్టి వెంకటరమణ,ప్రిన్సిపల్ ఝాన్సీ లక్ష్మీబాయి,అధ్యాపక బృందం మరియు జూనియర్,సీనియర్ ఇంటర్ విద్యార్థులు పాల్గొన్నారు.

### నేటి నుండి వాడపల్లి క్షేత్ర పాలకుడు

### శ్రీ వేణుగోపాల స్వామి వారి

## వార్షిక దివ్య కళ్యాణోత్సవాలు....

### స్వామివారి సేవలో తరించిన భక్తులు








ఆత్రేయపురం, జూన్ 24,(ప్రభాత వార్త) ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయానికి బుధవారం వేలాది మంది భక్తుల విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఏడు వారాల నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర శతనామావళి నిత్య కళ్యాణం గోపూజ పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు అనంతరం స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. వెంకన్న ఆలయంలో వేంచేసి ఉన్న శ్రీ భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి క్షేత్రపాలకుడు శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామివారి వార్షిక దివ్య కళ్యాణ మహోత్సవం జ్యేష్ట శుద్ధ ఏకాదశి 25 తేదీ గురువారం వార్షిక దివ్య కళ్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావులు తెలిపారు. రాజమండ్రి చెందిన భాగవతి సూర్యనారాయణ, వెంకటరమణ దంపతులు, వారి కుటుంబ సభ్యులు నిత్యాన్నదాన పథకానికి రూ. 40,696/- వేలు, అమలాపురం చెందిన గ్రంధి సత్య నాగ నరసింహారావు, వెంకట రామ లక్ష్మి దంపతులు, వారి కుటుంబ సభ్యులు నిత్యాన్నదాన పథకానికి రూ. 25,000/- వేలు విరాళంగా అందించారు. స్వామివారి దర్శనం అనంతరం వారికి ఆలయ అర్చకులు వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా. ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, సూపరింటెండెంట్, పులపర్తి రాంబాబు, జూనియర్ అసిస్టెంట్ వై శ్రీనివాస్ లు, శ్రీ స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు, అందజేశారు. వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు ఏర్పాట్లు చేశారు.

### చింతూరు ఏపీఎస్ఆర్టీసీ ప్రయాణికుల

## ప్రాంగణంలో పొంచి ఉన్న ప్రమాదం

### తుప్పు పట్టి పోయిన ఇనుప పిల్లర్లు.





చింతూరు జూన్ 24 ప్రభాతవార్త. చింతూరు డివిజన్ కేంద్రంలో ఉన్న ఏపీఎస్ఆర్టీసీ ప్రయాణికుల ప్రాంగణంలో ప్రమాదం పొంచి ఉంది. ప్రయాణికుల సౌకర్యం కోసం 16 ఇనుప పిల్లర్లపై నిర్మించిన రేకుల షెడ్ పిల్లర్లు తుప్పు బట్టి ప్రమాదకర పరిస్థితిలో ఉన్నాయి. అసలే చింతూరులో భారీ గాలి దుమ్ము, వర్షాలు వస్తు ఉంటాయి. ప్రయాణికుల నీడకోసం బస్టాండ్లో ఉన్న షెడ్ క్రింద ఉండటం శరమాములే. అయితే బస్టాండ్లో ఉన్న మరుగుదొడ్లు కనీసం టాయిలెట్ కి కూడా పనికి రాని స్థితి. ఆలనా, పాలన లేని వైనం. షెడ్ కి ఉన్న ఒకవైపు 8 ఇనుప పిల్లర్లు ఉంటె దాదాపు 6 పిల్లర్లను తుప్పు తినివేసింది. మరో పక్క 8 పిల్లర్లు ఉంటె రెండు పిల్లర్లను తుప్పు తినివేసింది. ఏమాత్రం భారీ గాలులు వీచిన షెడ్ కూలిపోవటం ఖాయం. ఆదే సమయంలో ప్రయాణికులు ఉంటే ఏదేని ప్రమాదం జరిగితే ఇబ్బందికరమే. సో సంభంధిత అధికారులు స్పందించి కనీసం తత్కాలిక మరమ్మత్తు ఐనా చేపించి ప్రమాదం జరగకుండా చూడాల్సిన అవసరం ఉంది. వాస్తవ పరిస్థితి అధికారుల దృష్టికి వెళ్లకపోవటం కూడా ఇబ్బందికరమే. ఈ కథనాన్ని చూసి అయినా అధికారులు వాస్తవలు పరిశీలించి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది . ఆ దిశగా అధికారులు స్పందిస్తారని ఆశిస్తూ..

## జనసేన నిర్మాణ కమిటీలో పార్లమెంట్ సీనియర్ గా ఆర్డీఎస్






ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూన్24,ప్రభాతవార్త. జనసేన పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసి, జనసైనికుల నుంచే భవిష్యత్ నాయకత్వాన్ని తీర్చిదిద్దే లక్ష్యంతో అధ్యక్షులు పవన్ కళ్యాణ్ స్వీయ పర్యవేక్షణలో "జనసేన పార్టీ నిర్మాణ సారథుల సమాచార సేకరణ కమిటీలను" నియమించారు. ఇందులో భాగంగా అమలాపురం పార్లమెంట్ నుండి సీనియర్ నాయకులుగా రాష్ట్ర హ్యాండీ క్రాఫ్ట్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆర్డీఎస్ ప్రసాద్ (అమలాపురం), గెడ్డం మహాలక్ష్మి ప్రసాద్ (రాజోలు), గనిశెట్టి నాగలక్ష్మి (పి.గన్నవరం) లకు అవకాశం కల్పించారు. అలానే సభ్యత్వాలు ఎక్కువ చేయించిన సాధక్ ల నుండి ఆత్మా కమిటీ చైర్మన్ చిక్కం సుధ (అమలాపురం), గిడ్డి రత్నశ్రీ (కాత్రేనికోన), సంపతి సత్యనారాయణ (రామచంద్రపురం) లను నియమించారు. అలానే పరిశీలక టీమ్ సభ్యులుగా మరో 21 మందిని కూడా అవకాశం కల్పించారు. సీనియర్ నాయకులు ఆర్డీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ "జనసైనికులలోని నాయకత్వ లక్షణాలు, నైపుణ్యం, అంకితభావాన్ని గుర్తించి వారికి నాయకత్వ అవకాశాలు కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం అని, అందుకు ఈ కమిటీ నిష్పక్షపాతంగా ప్రతి కార్యకర్త నుండి తమ సమాచారాన్ని సేకరించి పార్టీ ప్రధాన కార్యాలయానికి పంపించడం జరుగుతుంది" అని వివరించారు.

## కాట్రేనికోనలో ఇంకెన్నాళ్ళు ఇన్చార్జ్ అధికారుల పాలన

**- ఏళ్ల కాలంగా కాట్రేనికోన మండలంలో శాశ్వత అధికారులు కరువులి -"సర్వే" పేరుతో ప్రజలకు దూరంగా అధికారులు**




**కాట్రేనికోన జూన్ 24 (ప్రభాతవార్త)** కాట్రేనికోన మండలంలో ముఖ్యమైన అధికారుల పరిపాలన వ్యవస్థ మొత్తం ఇన్చార్జ్ వ్యవస్థపై ఆధారపడి నడుస్తోంది. పై స్థాయి నుంచి కింది స్థాయి వరకు పూర్తి స్థాయిలో రెగ్యులర్ అధికారులు లేకపోవడంతో ప్రజా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కాట్రేనికోన తహసీల్దార్ పోస్టు ఖాళీగా ఉండడంతో డిప్యూటీ తహసీల్దార్ ను ఇంచార్జ్ తహసీల్దార్ గా నియమించారు. సుమారు 10 నెలల కాలంగా ఆయన ఇంచార్జీగా పనిచేస్తున్నారు . విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ స్థాయి వరకు అన్ని పోస్టులు ఇన్చార్జ్ అధికారులతోనే నెట్టుకొస్తున్నారు. దీంతో ఫైళ్లు పెండింగ్, ప్రజల మొర ఆలకించే నాథుడు కరువయ్యాడు. తహసీల్దార్ ఇంచార్జీ కావడంతో అనధికార ఆక్వా చెరువుల తవ్వకాలు వంటి విషయాల్లో చర్యలకు వెనకాడుతున్నారు. కొన్ని నిర్ణయాలు తీసుకోవడంలో వెనకడుగు వేస్తున్నారనే గుసగుసలు ఉన్నాయి. దీనితోపాటు మండల పంచాయితీరాజ్ ఇంజినీర్ కూడా కాట్రేనికోనకి ఇంచార్జీ వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం మండల వ్యాప్తంగా ఎక్కడికక్కడ రోడ్డు, ప్రభుత్వ భవనాల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఇంజనీరింగ్ అసిస్టెంట్ లే పర్యవేక్షిస్తున్నారు. కాట్రేనికోన ఎంఈఓ 1 సైతం ఏడాది కాలంగా ఇంచార్జీ గా కొనసాగుతున్నారు. ఈయన వారం లో మూడు రోజులు మాత్రమే విధులు నిర్వహించి మిగిలిన మూడు రోజులు ఆయన పనిచేస్తున్న పాఠశాలలో తరగతులు చెప్పేందుకు వెళ్తారు. ఇలా అయితే పాఠశాలలు, మధ్యాహ్న భోజనం, ఇతర వసతుల పరిశీలన, పర్యవేక్షణ కరువయ్యింది. ఆర్ డ బ్ల్యూ జెఈ సైతం కాట్రేనికోన, రాజోలు చూస్తున్నారు. ఇలాంటి తీర మండలాల్లో పూర్తిస్థాయిలో ఏఈ ఉండాలి. లేదంటే తాగునీటి సమస్యలు పరిష్కారం కావు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో పోస్టు సుమారు రెండు నెలల కాలంగా ఖాళీగా ఉండటంతో ఈ పనుల పర్యవేక్షణ లేకుండా పోతుంది. ఈ శాఖ సిబ్బంది పనులు చేయించడంలో, నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు ప్రజలు వాపోతున్నారు . మండల ఇరిగేషన్ ఏఈ సైతం కాట్రేనికోన తో పాటు మరి కొన్ని మండలాలకు ఇంచార్జ్ గా ఉన్నారు. పీహెచ్ సీ లో ఇద్దరేసి వైద్యులు చొప్పున ఉండాలి. కానీ కాట్రేనికోన, పల్లంకుర్రు పీహెచ్సీ లో ఒక్కొక్కరు చొప్పున వైద్యులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో నిర్వహించే 104 వైద్య సేవలు లో వైద్యులు ఉండటం లేదు. ఇలా మండల వ్యాప్తంగా వివిధ శాఖల కు ఇంచార్జ్ అధికారులే కొన్నాళ్లుగా విధులు నిర్వహిస్తున్నారు. ఇన్చార్జ్ పాలనే ఎందుకు? జిల్లాలో శివారు తీర మండలమైన కాట్రేనికోనలో ప్రజా సమస్యలు ఎక్కువగా ఉంటాయి. ఇలాంటిచోట శాశ్వత నియామకాలు ఎందుకు చేపట్టడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రెగ్యులర్ అధికారులు లేని లోటును ఇన్చార్జ్‌లతో సరిపెట్టుకోవడం వల్ల క్షేత్రస్థాయిలో సమన్వయం లోపిస్తోంది. అధికారులు వివిధ సర్వే పేర్లతో గ్రామాల్లో తిరుగుతుండగా, ప్రజలకు అందుబాటులో లేకుండా విధులకు ఆలస్యంగా వస్తున్నారని, దుమ్మా కొడుతూ,బయట తిరుగుతున్నారనే ఆరోపణలు ఎక్కువగా వినిపిస్తున్నాయి.ప్రజల ఇబ్బందులు: పట్టాదారు పాసు పుస్తకాల ముటేషన్లు, భూ వివాదాలు, పెన్షన్లు, రైతు భరోసా, పంచాయతీ విధుల పనులన్నీ స్తంభిస్తున్నాయని అంటున్నారు. వివిధ పనుల నిమిత్తం ఏదైనా ప్రభుత్వ కార్యాలయానికి వెళ్తుంటే "సదరు అధికారి గారు కలెక్టరేట్‌కు వెళ్లారు", అక్కడకు వెళ్లారు, ఇక్కడకు వెళ్లారు,"సర్వేలో ఉన్నారు" అనే సమాధానాలతో కార్యాలయాల చుట్టూ తిరిగి విసుగెత్తి పోతున్నామని ప్రజలు వాపోతున్నారు..ప్రజల డిమాండ్: ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కాట్రేనికోనకు శాశ్వత తహసీల్దార్, పీఆర్ ఏఈ, ఎంఈఓ-1 , ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో,పోలీస్ సిబ్బందిని తదితర ఇతర అధికారులను నియమించాలని ప్రజలు కోరుతున్నారు. ఇన్చార్జ్ పాలనకు ఫుల్‌స్టాప్ పెట్టి పాలనను గాడిలో పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

## గంజాయి, సైబర్ నేరాలపై అడ్డతీగలలో భారీ అవగాహన ర్యాలీ

**అడ్డతీగల, జూన్ 24, ప్రభాతవార్త** యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న



గంజాయి మహమ్మారికి దూరంగా ఉండాలని, అలాగే రోజురోజుకూ పెరిగిపోతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరుతూ అడ్డతీగలలో భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీ అడ్డతీగల పురవీధుల గుండా సాగింది. అనంతరం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో ప్రజలకు, ప్రయాణికులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ.. గంజాయి రవాణా చేసినా, విక్రయించినా, వినియోగించినా చట్టప్రకారం కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత ఇటువంటి వ్యసనాలకు దూరంగా ఉండి ఉన్నత లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా, ప్రస్తుత డిజిటల్ యుగంలో అమాయకులను మోసం చేస్తున్న సైబర్ కేటుగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తుతెలియని లింకులను క్లిక్ చేయవద్దని, బ్యాంక్ వివరాలు, ఓటీపీలు ఎవరికీ చెప్పవద్దని సూచించారు. ఏదైనా మోసం జరిగితే వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐపీఎస్ సీఐ అంజనేయులు, ఎస్సై నరసింహమూర్తి, అడ్డతీగల సీఐ గజేంద్ర కుమార్, అడ్డతీగల ఎస్సై బి. వినోద్ మరియు పోలీస్ సిబ్బంది, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సివిల్ సప్లై కార్పొరేషన్ నిర్లక్ష్య వైఖరి నశించాలి హమాలీల ధర్నా



**అడ్డతీగల, జూన్ 24,ప్రభాతవార్త** సివిల్ సప్లై గోడౌన్ వద్ద హమాలీ కార్మికులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. సివిల్ సప్లై కార్పొరేషన్ అధికారులు హమాలీల పట్ల ప్రదర్శిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ కార్మికులు నినాదాలు చేశారు. ఈ ధర్నాను ఉద్దేశించి ఐఎఫ్‌టీయూ సివిల్ సప్లై హమాలీస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. రాజబాబు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సివిల్ సప్లై కార్పొరేషన్ హమాలీల పట్ల చిన్నచూపు చూస్తోందని మండిపడ్డారు. హమాలీ కుటుంబాలన్నీ కేవలం ఈ బిల్లుల పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాయని, అలాంటిది ప్రతి నెలా బిల్లులు చెల్లించడంలో నెలల తరబడి కాలయాపన చేయడం వల్ల కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి నెలా 10వ తారీఖు కల్లా హమాలీల బిల్లులను తప్పనిసరిగా చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.నిబంధనల ప్రకారం 2026 జనవరి నుంచే హమాలీల రేట్లు పెంచాల్సి ఉంది. కానీ గత ఆరు నెలలుగా ఎగుమతి, దిగుమతి రేట్లు పెంచకుండా, కొత్త అగ్రిమెంట్ చేయకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారని ధ్వజమెత్తారు. అలాగే 58 సంవత్సరాలు దాటిన హమాలీ కార్మికులకు పీఎఫ్ ద్వారా రావాల్సిన పెన్షన్ కార్పొరేషన్ నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. పెండింగ్‌లో ఉన్న డెత్ క్లెయిమ్‌లన్నింటినీ తక్షణమే పరిష్కరించి, బాధిత కుటుంబాలకు పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న ప్రస్తుత రూట్ మ్యాప్ విధానం వల్ల హమాలీలకు వచ్చే ఆదాయం దారుణంగా పడిపోయిందని, కార్మికులను నష్టాల పాలు చేస్తున్న ఈ రూట్ మ్యాప్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.హమాలీల న్యాయమైన సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని యూనియన్ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక హమాలీ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ మద్దతును తెలియజేశారు.

# ప్రజా సేవలో రెవెన్యూ శాఖ పాత్ర కీలకం

## -నగర పాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా



**రాజమహేంద్రవరం సిటీ, జూన్ 24( ప్రభాతవార్త)** ప్రజలకు ప్రభుత్వ సేవలను చేరువ చేయడంలో రెవెన్యూ శాఖదే కీలక పాత్రని నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్ మీనా అన్నారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్నుల వసూళ్లలో ప్రగతి కొత్తగా పన్ను మదింపు చేయడం డిజిటల్ డోర్ నెంబర్లు ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై అనుసరిస్తున్న విధానాలను అడిగి తెలుసుకున్నారు. పన్ను వసూలు పై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని 100% పన్ను వసూలు జరగాలని ఆదేశించారు. అస్తి పన్ను డిమాండ్ నోటీ సులు ఈ నెలాఖరులోపు పంపిణీ 100% పూర్తి చేయాలి అన్నారు. భవన నిర్మాణా అనుమతులకు ముందే వేకెంట్ ల్యాండ్ టాక్స్ కడుతున్నది లేనిది పరిశీలించాలన్నారు. టౌన్ ప్లానింగ్ విభాగం ద్వారా అనుమతి పొందిన ఇంటి ప్లానుల వివరాలు పొంది నిర్మాణాలు పూర్తయిన వెంటనే పన్ను విధించాలన్నారు. వాటర్ బిల్లులు చాలా కాలంగా చెల్లించకపోవడం కనెక్షన్లను దుర్వినియోగం చేయడం అనుమతులు లేకుండా అక్రమంగా కనెక్షన్ ఏర్పాటు చేసుకున్న వాటిని ఎమినిటీ సెక్రటరీ సాయంతో తొలగించాలని ఆదేశించారు. బిఎల్వోలు భారత్ ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ 2026 కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ డిప్యూటీ కమిషనర్ ఎస్ వెంకటరమణ రెవెన్యూ అధికారి సిహెచ్ శ్రీనివాసరావు రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పితాని బాలకృష్ణ జన్మదిన వేడుకలు



**ముమ్మిడివరం జూన్ 24(ప్రభాత వార్త)**వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు పితాని బాలకృష్ణ జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. కిమ్స్ ఆసుపత్రి వద్ద ఆయన స్వగృహం నిర్వహించిన పుట్టినరోజు వేడుకల్లో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొని ఆయనకి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముమ్మిడివరం మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్, చెల్లుబోయిన శ్రీనివాసరావు, కాశీ బాల ముని కుమారి, ఎంపీపీ కోలా గంగా భవానీ, కోలా బాబ్జీ, జెడ్పీటీసీలు కుదుపూడి శంకర రావు, నేల కిషోర్, గొవ్వాల రాజేష్, పాలెపు ధర్మారావు, మట్టపర్తి సురేష్, రెడ్డి శ్రీమన్నారాయణ, వాసంశెట్టి ఫణి, మట్టపర్తి శివ, జిల్లా వాసంశెట్టి రమేష్, గొల్లకోటి రాజబాబు, కాండ్రేగుల త్రిమూర్తులు, గుత్తుల రమణ, దంగేటి శ్రీను, వర్మ, దొమ్మేటి అప్పారావు, మట్టపర్తి సురేష్ సాన బోయిన చినబాబు, గుత్తుల మల్లిఖార్జున రావు, లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## లోదొడ్డి హెల్త్ వెల్ నెస్ సెంటర్ కు మందులు కేటాయింపు... తీరిన సమస్య



**రాజవొమ్మంగి, జూన్ 24, ప్రభాతవార్త** జడ్డంగి పి. హెచ్. సి పరిధిలో గల లోదొడ్డి హెల్త్ వెల్ నెస్ సెంటర్ కు ప్రత్యేకంగా మందులు బుధవారం విడుదల అయ్యాయని డా. పావని తెలిపారు. లోదొడ్డి హెల్త్ వెల్ నెస్ సెంటర్ కు గత ఆరేళ్లుగా మందులు ప్రత్యేకంగా కేటాయించక పోవడంతో ఇతర సబ్ సెంటర్ ల నుండి మందులు తెచ్చుకొని కాలం వెళ్ళదీయాల్సి వచ్చేది. ఇటీవల వల కిండంగి గ్రామ సందర్శనకు పోలవరం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ వచ్చిన సందర్భంలో లోదొడ్డి హెల్త్ వెల్ నెస్ సెంటర్ లో మందులు లేక ఇబ్బందులు పడుతున్న విషయం లోదొడ్డి పంచాయితీ మాజీ సర్పంచ్ లోతా రామారావు తెలిపారు. జిల్లా కలెక్టర్ చొరవతో మందులు వచ్చాయని రామారావు అన్నారు. లోదొడ్డి పంచాయితీలో లోదొడ్డి, కిండంగి, పూదేడు, కొత్త పూదేడు, కేశవరం, పాకవేల్తి గ్రామాల్లో 270 కుటుంబాలకు చెందిన 1,070 మంది కి వైద్య సేవలకు 69 రకాలు మందులు అందుబాటులో ఉన్నాయని ఎం. ఎల్. హెచ్ పి. భవాని అన్నారు.

## ఉపాధి హామీ పథకాన్ని యథాతథంగా అమలు చేయాలి.



**తాళ్లరేవు, జూన్ 24( ప్రభాతవార్త):** పేదలకు పని కల్పించేందుకు గత యుపిఎ ప్రభుత్వం తీసుకువచ్చిన జాతీయ ఉపాధి హామీ పథకాన్ని యథాతథంగా అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టేకుమూడి ఈశ్వరరావు, కె ఎస్ శ్రీనివాస్ అన్నారు. పథకం పేరు మార్చడం వల్ల ప్రయోజనం ఉండదని ప్రారంభంలో ఉన్న సౌకర్యాలను కూలీలకు అందించినప్పుడే దాని ప్రయోజనం ఉంటుందని అన్నారు. తాళ్లరేవులోని ప్రజా సంఘాల కార్యాలయంలో దుప్పి అదృష్టదీపుడు అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో వీరు మాట్లాడారు. ముందుగా సంఘం మండల కార్యదర్శి నేరేడుమిల్లి త్రిమూర్తులు సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలు నివేదికను ప్రవేశపెట్టగా అందరూ ఆమోదించారు. జిల్లా కార్యదర్శి కె ఎస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి చట్టాన్ని రద్దుచేసి విభిజి రాంజీ పథకాన్ని తెచ్చిందని, దీనివలన ఉపాధి వేతన దారులకు గతంలో ఉన్న హక్కులు పోతాయన్నారు. కేంద్రము నిధులు తగ్గించటం వలన 60:40 శాతం నిబంధన పెట్టడం వలన రాష్ట్ర ప్రభుత్వంపై భారం పడుతుందని ఆ విధంగా ఉపాధి హామీ వేతనదారులకు పని దినాలు పడిపోతాయన్నారు. ఫేస్ యాప్ వలన అనేక ఇబ్బంది ఎదురవుతున్నాయని తెలిపారు. జూలై 1 నుంచి అమలయ్యే ఉపాధి హామీ కొత్త పథకాన్ని వ్యతిరేకిస్తూ వివిధ రూపాయలలో ఉపాధి హామీ కార్మికులు నిరసనలు తెలియజేయాలని పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు టేకుమూడి ఈశ్వరరావు, మండల కమిటీ నాయకులు కోసూరు పుల్లయ్య, గోడి భాస్కరరావు, మర్నాల సత్యవతి, దడాల మీరాబాయి, పంపన భారతి, గొలుసు వెంకటరమణ, పితాని కుమారి, కర్రి రామలక్ష్మి, వడ్డి మహాలక్ష్మి, లంక లక్ష్మి, మేడిశెట్టి శేషారత్నం తదితరులు పాల్గొన్నారు.

## పోలియా చుక్కల కార్యక్రమంపై తెలియజేయండి.



**రాజవొమ్మంగి, జూన్ 24, ప్రభాతవార్త** ఈ నెల 28 తేదీ ఆదివారం జరిగే పల్స్ పోలియో కార్యక్రమంపై ఇంటింటా తెలియజేయాలని జడ్డంగి పి. హెచ్. సి డా. పావని వైద్య సిబ్బందికి తెలిపారు. బుధవారం జడ్డంగి పి. హెచ్. సి లో వైద్య సిబ్బంది, అంగన్వాడీ వర్కర్స్ తో పల్స్ పోలియో కార్యక్రమంపై డా. నాగార్జున అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈసందర్భంగా డా. పావని మాట్లాడుతూ జడ్డంగి పి. హెచ్. సి. పరిధిలో 0..5 సం. లోపు 867 మంది ఉన్నారన్నారు. నూరుశాతం పోలియో చుక్కలు వేసే లక్ష్యంను కలిసికట్టుగా పని చేద్దామన్నారు. 29 తేదీ న ఇంటింటా సర్వే ఉంటుందన్నారు. 25 బూత్ లు, 3 రూట్లు, ఒక మొబైల్ ద్వారా కార్యక్రమం జరుగుతుందన్నారు. ఉదయం నుండే విధులకు హాజరుకావాలని డా. పావని తెలిపారు. ఈకార్యక్రమంలో డా. నాగార్జున, డా. పావని, యంపిహెచ్. ఇ. ఓ గొడుగు నాగవాసు, హెచ్. వి లు నీలాద్రి లక్ష్మి, భూముల వెంకటరమణ, హెల్త్ అసిస్టెంట్స్ కంచెం శ్యామ్యూల్, కొన్ల రాజబాబు, ఎం. ఎల్. హెచ్. పి. లు మురళి, కుమారి, రమ్య, భవాని, లక్ష్మి, అంగన్వాడీ వర్కర్లు, ఏ. ఎన్. ఎం. లు పాల్గొన్నారు.

## పెద్దాపురం మరిడమ్మకు రూ.8.30 లక్షల హుండీ ఆదాయం



**పెద్దాపురం జూన్ 24 (ప్రభాత వార్త )** కోరిన కోర్కెలు తీర్చే ఇలవేలుపుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి హుండీల ద్వారా 8,30, 281 రూపాయలు ఆదాయం సమకూర్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కే విజయలక్ష్మి తెలిపారు. అమ్మవారి హుండీలను ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త శ్రీ చింతపల్లి శ్రీ హర్ష, కాకినాడ నూకాలమ్మ అమ్మవారి ఆలయ ఈవో ఎమ్ ఎమ్ వీర భద్రరావు, ఆలయ కమిటీ సభ్యులు, పోలీస్, రెవెన్యూ భక్తుల సమక్షంలో బుధవారం అమ్మవారి హుండీలు తెరిచారు. మార్చి 30వ తేది నుంచి ఇప్పటి వరకు 86 రోజులకు గాను హుండీల ద్వారా రూ 7,53,580/- అన్నదానం ద్వారా రూ 76,701/- వెరసి రూ 8,30,281/- ఆదాయం సమకూరినట్లు ఆలయ కమిషనర్ విజయలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు, భక్తమండలి సభ్యులు, బ్యాంక్ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

## ఆకలి లేని ఆంధ్రప్రదేశ్ అన్న క్యాంటీన్ ధ్యేయం ఎంపీడీవో



**కాట్రేనికోన జూన్ 24 (ప్రభాతవార్త)**మండల కేంద్రంలోని అన్న క్యాంటీన్‌ను ఎంపీడీఓ బి. రాజేశ్వర్ రావు బుధవారం పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్న క్యాంటీన్ నిర్వహణ, భోజన నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించారు.భోజనం చేస్తున్న పలువురిని అడిగి నాణ్యత గురించి ఆరా తీశారు. ఆయన స్వయంగా భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆకలి లేని ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే అన్న క్యాంటీన్ల ధ్యేయం అని కొనియాడారు.నాణ్యమైన భోజనం అందించాలని, పరిసరాల శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం టోకెన్ల వారీగా ఆన్‌లైన్ వివరాలను పరిశీలించారు. ఈకార్యక్రమంలో పంచాయతీకార్యదర్శి జేవి సత్యన్నారాయణ, జూనియర్ అసిస్టెంట్ పృథ్వి పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియో శిక్షణా తరగతులు....




**సఖినేటిపల్లి జూన్ 24, ప్రభాత వార్త:** అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లలో పల్స్ పోలియో మండల స్థాయి హెల్త్, ఐసిడిఎస్ సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి. జయ గాయత్రి మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీ ఆదివారం నాడు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని మండలంలో వంద శాతం విజయవంతం చేయడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. అధికారులులక్ష్యం మండల పరిధిలోని అప్పుడే పుట్టిన పసిబిడ్డ నుండి ఐదు సంవత్సరాల లోపు వయస్సు గల 2,140 మంది పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. పిల్లలకు సులభంగా చుక్కల మందు వేయించడానికి వీలుగా పీహెచ్‌సీ పరిధిలో 13 పోలియో చుక్కల కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు,శిక్షణ పొందిన పోలియో కేంద్రాలలో సేవలందించడానికి 52 మంది శిక్షణ పొందిన హెల్త్, ఐసీడీఎస్ సిబ్బందిని నియమించడం జరిగిందని, తల్లి దండ్రులు ఎవరూ నిర్లక్ష్యం చేయకుండా, తమ ఐదేళ్లలోపు పిల్లలందరినీ సమీపంలోని పోలియో కేంద్రాలకు తీసుకువెళ్లి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి, వారి భవిష్యత్తుకు రక్షణ కల్పించాలని మెడికల్ ఆఫీసర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పి. రవిచంద్ రాజకుమార్, పీహెచ్ఎన్ సిహెచ్. లలిత, ఎంపీహెచ్ఈఓ ఎ. నాగరాజు, హెల్త్ సూపర్‌వైజర్లు పి.ఎల్.ఎన్. స్వామి, కె. శ్రీనివాస్, ఎం. ప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వై. విజయ భారతి, ఏఎం సీహెచ్ఓలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## గోదావరి ఇసుక తిన్నెల్లో విహరిద్దాం ...రండి.



**తాళ్లరేవు జూన్ 24 (ప్రభాతవార్త):** ప్రకృతిలో పలు అందమైన ప్రదేశాలు మనసుకు ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. అటువంటి ప్రదేశాల్లో గోదావరి తీరం ఆహ్లాదంతో పాటు మానసిక ప్రశాంతతను అందిస్తుంది. ఆ అందమైన ప్రకృతిని ఆస్వాదించాలని కోరిక ఉన్న ప్రకృతి ప్రేమికులకు గోదావరి ఇసుక తిన్నెలు ఆహ్వానం పలుకుతున్నాయి. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పిల్లంక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం చెంతన ఈ గోదావరి ఇసుక తిన్నెల్లో పలువురు సందర్శకులు ఇటీవల విహరిస్తూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గౌతమీ గోదావరి మధ్యలోకి నడిచి వెళ్లడానికి అనువుగా ఇసుక మేటలు వేయడంతో ఆ ప్రాంతంలో పలువురు సెల్ఫీలు, ఫోటోలు దిగడానికి ఉత్సాహంగా తరలివస్తున్నారు. ఇటీవల సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం ప్రతిష్ట సందర్భంగా ఈ ప్రాంతం వెలుగులోకి వచ్చింది. మరి ఇంకెందుకు ఆలస్యం రండి గోదావరి ఇసుక లో ఆటలాడుకుందామంటూ ఆహ్వానిస్తుంది పిల్లంక గోదావరి తీరం.మరి మనం కూడా ఆ ప్రాంతంలో విహరిద్దామా...

## పంచాయతీల అభివృద్ధికి పక్కా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి..ఎంపీపీ దొమ్మేటి..




**అంబాజీపేట,జూన్ 24, (ప్రభాతవార్త):** గ్రామ పంచాయతీల అభివృద్ధికి అన్ని శాఖల సమన్వయంతో పక్కా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ సమావేశం హాల్లో ఎంపీడీఓ బి.మమత అధ్యక్షతన గ్రామ పంచాయతీ డవలప్మెంట్ ప్లాన్ (జీపీడీపీ) అభివృద్ధి ప్రణాళికపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మమత మాట్లాడుతూ 2026-27 సంవత్సరానికి సంబంధించి ఆయా గ్రామాల్లో అవసరమైన వనరుల సమకూర్చుకునేందుకు, అభివృద్ధికి నిర్దిష్టమైన ప్రణాళిక తయారు చేయాలన్నారు. ఈ ప్రణాళిక ప్రకారం రాబోయే కాలంలో గ్రామ పంచాయతీల అభివృద్ధికి దోహద పడతాయన్నారు. గ్రామాల్లో ఉన్న అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటే అభివృద్ధికి బాటలు వేయవచ్చన్నారు. అనంతరం ప్రోజెక్ట్ ద్వారా అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓలు కె.శ్రీనివాస్,ఎండీ. అబ్బాస్ అలీ, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, పంచాయతీ ప్రత్యేకాధికారులు,కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, వీవోఏ,ఏపీఓ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వీరేశ్వర స్వామి వారి నూతన శిఖర ప్రాణ ప్రతిష్ట...

### -పాల్గొన్న యువనాయకులు బండారు సంజీవ్.



**ఆత్రేయపురం, జూన్ 24,(ప్రభాత వార్త)** మండలంలోని రాజవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ అన్నపూర్ణ సమేత వీరేశ్వర స్వామి వారి ఆలయ నూతన శిఖర ప్రాణ ప్రతిష్ట కార్యక్రమంలో యువనాయకులు బండారు సంజీవ్ పాల్గొన్నారు.ఐదు రోజులు పాటు జరిగిన ప్రత్యేక పూజలు అభిషేకాలు అనంతరం బుధవారం నూతన శిఖర ప్రాణ ప్రతిష్ట చేశారు. భక్తులు, గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో శ్రీ స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువనాయకులు బండారు సంజీవ్, వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకట రాజు, ముళ్ళపూడి భాస్కరరావు, మండల టిడిపి ఉపాధ్యక్షుడు తోట రజిని, జాన వీరాంజనేయులు, కె బ్రహ్మానందం, కోమలి నాగ సూర్యనారాయణ, మజ్జి తరుణ్, మజ్జి సూరిబాబు, గ్రామ కుటమి నాయుకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


## మున్సిపల్ కార్మికుల సమస్యలపై జూలై 7 న చలో విజయవాడ



**రాజమహేంద్రవరం,జూన్ 24(ప్రభాతవార్త)** మున్సిపల్ పారిశుధ్య కార్మికులను తక్షణమే రెగ్యులర్ చేయాలని తదితర డిమాండ్లతో జూలై 7 న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాజమండ్రి సిటీ అధ్యక్షులు, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటిపాక మధు పిలుపునిచ్చారు బుధవారం ఉదయం స్థానిక జిల్లా కలెక్టరేట్ వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ సిటీ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు ఈ ధర్నాకు రాష్ట్ర సంఘం నుండి ఉపాధ్యక్షులు ధనాల దుర్గమ్మ, కార్యదర్శి అల్లం వెంకటేశ్వరావు, కోశాధికారి రెడ్డి రమణ లు హాజరయ్యారు ఆప్కస్ పారిశుధ్య కార్మికులు ను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం 36,000 మంజూరు చేయాలని డిమాండ్ చేశారు ఈసందర్భంగా తాటిపాక మధు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలపై నిరసన ఆందోళనలను చేపట్టాలని దఫ ద ఫాల ఆందోళనకు పిలుపులో భాగంగా జూన్ 20వ తేదీ మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించమని 22వ తేదీన ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు అందజేసమని 24వ తేదీన జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టామని ఆయన అన్నారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు డిప్యూటీ సీఎం శ్రీ కొణిదల పవన్ కళ్యాణ్ గారు స్పందించాలని, ఎన్నికల ముందు బహిరంగ సమావేశాల్లో పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేస్తామని, వారి చేస్తున్న పనులు ఎవరో చేయలేరని గొప్పలు చెప్పారని ఆ హామీలను తక్షణమే అమలు చేయాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ఏపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సిటీ ప్రధాన కార్యదర్శి కాకి శారద, ఉపాధ్యక్షులు గుడుపు గిరి, పోలమ్మ సహాయ కార్యదర్శి లు రెడ్డి శ్రీనువాస్, మీసాల దేవి, మీసాల రమణ, కోశాధికారి సరస్వతి, సుగుణ లోకేశ్వరి జ్యోతీశ్వరి తదితరులు పాల్గొన్నారు

## మద్యం షాపుల్లో అదనపు వసూళ్లు

**-సర్కారు పెంచకపోయినా.. రూ.10 పెంచేసిన సిండికేట్- ముచ్చటగా మూడు దుకాణాల్లోనూ అదే దందా!**




**సీతానగరం, జూన్ 24, (ప్రభాతవార్త) :** సీతానగరం మండలంలోని మూడు మద్యం దుకాణాలలో రూ.10 అదనపు వసూళ్ల పర్వం మూడు పువ్వులు పది సీసాలుగా సాగుతోంది. ప్రభుత్వం మద్యం బాటిళ్లపై ముద్రించిన ఎమ్మార్పీ ధర ప్రభుత్వానికే కానీ.. తమకు కాదన్నట్లు మద్యం షాపు నిర్వాహకులు వ్యవహరిస్తున్నారు. సీతానగరం మండలంలోని మూడు మద్యం దుకాణాల్లోనూ ఒక్కో ఐఎంఎల్, బీరు బాటిళ్లపై అదనంగా పది రూపాయలు వసూలు చేస్తూ మందుబాబుల జేబులకు చిల్లు పెడుతున్నారు. నిబంధనల ప్రకారం ఎమ్మార్పీ ధరల పట్టికను దుకాణం ముందు ప్రదర్శించాల్సి ఉన్నా.. ఎక్కడా అది అమలు కావడం లేదు. సామాన్యులు ధర గురించి ప్రశ్నిస్తే.. మద్యం సిండికేట్ గా ఏర్పడి రేట్లు పెంచాం... అని బహిరంగంగానే చెప్పడం గమనార్హం. అధికారుల 'కళ్లు' మూత మద్యం దుకాణాల్లో కళ్లముందే ఇంత అక్రమ దందా జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు తనిఖీలకు వస్తున్నారా? లేక 'మామూళ్ల' మత్తులో ఉన్నారా? అని మందుబాబులు, ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సీతానగరం మండలంలో ఉన్న మూడు మద్యం దుకాణాల్లో రోజుకు ఒక్కో షాపు లో వందల సంఖ్యలో ఐఎంఎల్, బీరు బాటిల్లు అమ్ముడవుతుంటాయి. అంటే.. రోజుకు వేలాది రూపాయల అక్రమ సంపాదనను నిర్వాహకుల తమ జేబుల్లోకి వేసుకుంటున్నారు. ప్రభుత్వం ధర పెంచకపోయినా.. 'మా రేటు మా ఇష్టమే ' అన్నట్లు వ్యవహరిస్తున్న నిర్వాహకులపై చర్యలు తీసుకునే నాథుడే లేరు? ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సీతానగరం మండలంలోని మద్యం దుకాణాల్లో సాగుతున్న ఈ 'పది' రూపాయల దందాను అరికట్టాలని మందుబాబులు, ప్రజలు కోరుతున్నారు.

## దేవాలయాలకు రూ 2.27 కోట్ల నిధులు మంజూరు



**కొత్తపేట, జూన్ 24,(ప్రభాతవార్త)** కొత్తపేట నియోజకవర్గంలోని హిందూ దేవాలయాల అభివృద్ధికి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలోని శ్రీవాణి ట్రస్ట్ ద్వారా మొత్తం రూ 2 కోట్ల 27 లక్షల 1వెయ్యి136 నిధులు మంజూరయ్యాయని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు ఇప్పటికే నియోజకవర్గంలోని ఏడు దేవాలయాలకు రూ32 లక్షల 1 136 మంజూరుకాగా తాజాగా మరో 15 దేవాలయాలకు రూ1 కోటి 95 లక్షలు ఆమోదం పొందాయని ఆయన తెలిపారు దీంతో మొత్తం 22 దేవాలయాలకు రూ2 కోట్ల 27 లక్షల 1 136 నిధులు మంజూరు అయ్యాయి ఇప్పటికే నిధులు మంజూరైన దేవాలయాలు పొడగట్లపల్లి శ్రీ రామాలయం రూ.8.12 లక్షలు కలవచర్ల శ్రీ కోదండ రామాలయం రూ3.50 లక్షల మోడేకూరు శ్రీ రామాలయం రూ7.12 లక్షల ఏనుగుమహల్ శ్రీ రామాలయం రూ4 లక్షల పలివెల కోటమెరక శ్రీ రామాలయం రూ2.27 లక్షలు నర్సిపూడి శ్రీ కోదండరామస్వామి ఆలయం రూ 2 లక్షలుఅవిడి శ్రీ రామాలయం రూ5 లక్షలుకొత్తగా ఆమోదం పొందిన దేవాలయాలు ఆత్రేయపురం మండలంలోని వద్దిపర్రు శ్రీ రామాలయం మెర్లపాలెం శ్రీ కోదండ రామాలయం రావులపాలెం మండలంలోని గోపాలపురం శ్రీ రామాలయం దేవరపల్లి (గెద్దం వారిపాలెం) శ్రీ రామాలయం గంటి శ్రీ రామాలయం కొత్తపేట మద్దెలమెరక శ్రీ రామాలయం ఈతకోట శ్రీ రామాలయం దేవరపల్లి శ్రీ కోదండ రామాలయం ఆలమూరు శ్రీ సీతారాముల కోవెల జయంత్‌నగర్ శ్రీ లక్ష్మి గణపతి స్వామి ఆలయాలు మోడేకూరు శ్రీ రామాలయాలకు ఒక్కొక్కటికి రూ10 లక్షల చొప్పున నిధులు ఆమోదం పొందాయి అలాగే లక్ష్మీపోలవరం శ్రీ కోదండ రామాలయానికి రూ15 లక్షలు చింతలూరు శ్రీ సీతారామాలయానికి రూ 20 లక్షలు అత్రేయపురం బండారు కాలనీలోని శ్రీ వినాయక దుర్గాదేవి సమేత లక్ష్మీదేవి ఆలయానికి రూ 20 లక్షలు అత్రేయపురం రజక కాలనీలోని శ్రీ సత్తెమ్మ అమ్మవారి ఆలయానికి రూ20 లక్షలు మంజూరయ్యాయన్నారు శ్రీవాణి ట్రస్ట్ నిధుల మంజూరుకు సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి టీటీడీ పాలకమండలి చైర్మన్ బి ఆర్ నాయుడు తో పాటు సంబంధిత వారికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు

## బీటీ రోడ్డు నిర్మాణ పనులు పరిశీలన...



**సఖినేటిపల్లి జూన్ 24, ప్రభాత వార్త:**డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం టెకిశెట్టిపాలెం గ్రామంలో ప్రధానమంత్రి జనజాతి, ఆదివాసి న్యాయ మహా అభియాన్ పథకంలో సుమారు కోటి 5 లక్షల రూ.లతో 18 అడుగుల వెడల్పుతో సుమారు కిలోమీటర మేర బీటీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కూటమి నాయకులు పరిశీలించారు. జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు మాలే శ్రీనివాస నగేష్ మాట్లాడుతూ నిర్మాణ పనులను అధికారులు పర్యవేక్షించాలని, పారదర్శకంగా పనులు చేపట్టాలని కోరారు. పీఎం జెన్ మన్ పథకం ద్వారా సుమారు 24.104 కోట్లు, రాష్ట్ర మ్యాచ్ గ్రాంటు 8.768 కోట్లతో రాష్ట్రంలో పనులు వేగవంతంగా జరుగుతున్నాయని అన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం లోనే అభివృద్ధి సంక్షేమం జరుగుతుందని, నియోజకవర్గం లో అభివృద్ధిని సంక్షేమాన్ని ముందుకు తీసుకు వెళుతున్న శాసనసభ్యులు దేవ వరప్రసాద్ కి ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలిపారు. పిఎసిసిఎస్ సొసైటీ అధ్యక్షులు రావూరి పెద్దలు, నాయకులు కటిక రెడ్డి శ్రీనివాస రావు, ఆచంట సుబ్బారావు, నామ సూర్యనారాయణ రావూరి శ్రీను తదితరులు పరిశీలించినారు

మరిన్ని వార్తలు 6లో

# వైద్య ఆరోగ్య శాఖ పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

**-ఖాళీల భర్తీ, పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలి: పి. రవికుమార్**



**కడియం, జూన్ 24 (ప్రభాతవార్త)** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా చైర్మన్ పి. రవికుమార్ కోరారు.బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, అత్యవసర సేవలు అందిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులకు కూడా పోలీసు శాఖ మాదిరిగా సరెండర్ లీవ్ నగదు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం (డీఏ) బకాయిలను విడుదల చేయాలని కోరారు.పే రివిజన్ కమిషన్ (పీఆర్సీ) ఏర్పాటు విషయంలో జాప్యం జరుగుతోందని, వెంటనే పీఆర్సీ కమిషన్‌ను నియమించి మధ్యంతర ఉపశమనం (ఐఆర్) ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లిస్తే ఉద్యోగుల్లో ప్రభుత్వం పట్ల మరింత విశ్వాసం పెరుగుతుందని అన్నారు.వైద్య ఆరోగ్య శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయడంతో పాటు, ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్ నిబంధనల ప్రకారం అదనపు పోస్టులను మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో సిబ్బంది కొరతను తీర్చడం అవసరమని పి. రవికుమార్ పేర్కొన్నారు.

# వనిత జన్మదిన వేడుకల్లో గోపవరం వైసీపీ శ్రేణులు సందడి



**గోపాలపురం జూన్ 24, (ప్రభాతవార్త):** మాజీ హోంమంత్రి, గోపాలపురం నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తానేటి వనిత జన్మదిన వేడుకలు బుధవారం యర్నగూడెంలో ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలపురం మండలం, గోపవరం గ్రామం నుంచి గ్రామ కమిటీ అధ్యక్షుడు ఉప్పులూరి సురేష్ ఆధ్వర్యంలో వైసీపీ కార్యకర్తలు భారీ బైక్ ర్యాలీ చేపట్టి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. జెండాలు, నినాదాలతో ముందుకు సాగిన ర్యాలీ యర్నగూడెం చేరుకోగా, కార్యకర్తలు వనితను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. 'వనితమ్మ నాయకత్వం వర్ధిల్లాలి', 'గోపాలపురానికి గర్వకారణం తానేటి వనిత' అంటూ నినాదాలతో ప్రాంతం మార్మోగింది. ఈ సందర్భంగా ఉప్పులూరి సురేష్ మాట్లాడుతూ... ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ ప్రజల మధ్యే ఉంటున్న నాయకురాలిగా తానేటి వనిత గుర్తింపు పొందారని అన్నారు. రానున్న రోజుల్లో గోపాలపురం అభివృద్ధికి ఆమె నాయకత్వం మరింత అవసరమని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో ఆమె ఘన విజయం సాధించి, రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తూ, ప్రజాసేవను మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్న కార్యకర్తలు, వనితకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పూలపల్లి నాగేశ్వరరావు, మల్లిపూడి నాగార్జున, గెడ్డం నంద, అజయ్, ముప్పిడి రాజు, చాపల నాగరాజు, ముప్పిడి సోమరాజు, సొంగ వినోద్, తలారి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# క్రాంతి కుమార్ మృతిపై ఎమ్మార్పీఎస్ సంతాపం



**గోపాలపురం జూన్ 24, (ప్రభాతవార్త):**గోపాలపురం మండలం వాదాలకుంటలో ఏపీ ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఏపీ ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షుడు, తెలుగు రాష్ట్రాల చైర్మన్ పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ కుమారుడు పేరుపోగు క్రాంతి కుమార్ మృతిపై బుధవారం సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొల్లిగి వెంకటరాజు మాదిగ, తూ.గో జిల్లా అధ్యక్షులు ప్రత్తిపాటి రాంబాబులు పాల్గొని మాట్లాడుతూ.. క్రాంతి కుమార్ మృతికి దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు కఠిన చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం క్రాంతి కుమార్ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ రెండు నిమిషాల మౌనం పాటించి నివాళు లర్పించారు. కార్యక్రమంలో గోపాలపురం మండల అధ్యక్షుడు వినపల్లి నవీన్, మాదిగ యువజన సంఘం అధ్యక్షుడు జనపల్లి రవిశేఖర్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ ప్రత్తిపాటి సూరజ్, ముప్పిడి రవి, సుధాకర్, సమాధానం, సూర్యచంద్ర, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ విష్ణు ఆలయం రాజగోపురం నిర్మాణానికి శంకుస్థాపన



**అయినవిల్లి జూన్ 24 ప్రభాత వార్త** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, పి. గన్నవరం నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నా మని పి గన్నవరం శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ అన్నారు ఎంతో ప్రసిద్ధి చెందిన అతి ప్రాచీనమైన వీరవల్లిపాలెం గ్రామంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ రంగనాయకస్వామి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ,దేవాలయ రాజగోపుర నిర్మాణానికి పుష్కర గ్రాండ్ ద్వారా 35 లక్షల రూపాయలతో దేవాలయం రాజగోపురం శంకుస్థాపన కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామ ప్రజలందరూ శాసనసభ్యులుసత్యనారాయణకు పూర్ణకుంభంతో స్వాగతం పలికినారు. శంకుస్థాపన కార్యక్రమం అనంతరం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ రంగనాయక స్వామివారి మరియు లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకుని, అగ్ని హోమంలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించి, అనంతరం అర్చక స్వాములు ఆశీర్వచనం చేయగా గ్రామస్తులు శాసనసభ్యులు గిడ్డి సత్యనారాయణ ను ఘనంగా సత్కరించినారు. క్రతువు కార్యక్రమాన్ని జనసేన పార్టీ సీనియర్ నాయకులు మరియు సొసైటీ అధ్యక్షులు, శ్రీ సూర్యనారాయణమూర్తి సత్రం ఫ్యామిలీ ఫౌండ్రి ట్రస్ట్ మెంబర్ ముద్రగెడ వెంకట సత్య సుబ్బారావు దంపతులు నిర్వహించినారు.పుష్కర గ్రాంట్ నిధుల ద్వారా 35 లక్షల రూపాయలు మంజూరైనఈ అభివృద్ధి కార్యక్రమం గ్రామ ఆధ్యాత్మిక వైభవాన్ని మరింత పెంపొందించనుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆలయాల అభివృద్ధి ద్వారా భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు గ్రామ సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు దోహదపడుతుందని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వ హించారుఈకార్యక్రమంలో అంబాజీపేట మార్కెటింగ్ చైర్మన్ చిట్టూరి శ్రీనివాసరావు, మండల టిడిపి అధ్యక్షులు వస్కాశ్యమ్, మాజీ ఎంపీపీ సలాది పుల్లయ్య నాయుడు, టిడిపి మండల కార్యదర్శి మేడిశెట్టి అంజిబాబు, వైస్ ఎంపీపీ అడపా వెంకట్ నాగభూషణం, కమిటీ సభ్యులు, అర్చక స్వాములు, భక్తులు, గ్రామ పెద్దలు కూటమి నాయకులు పాల్గొన్నారు


# జిల్లా కలెక్టర్ ఆదేశాలతో బాల కార్మికులపై ప్రత్యేక డ్రైవ్

## -1098కు సమాచారం ఇవ్వాలని సహాయ కార్మిక కమిషనర్ జి. శ్రావణి విజ్ఞప్తి



**రంపచోడవరం జూన్ 24 ప్రభాతవార్త.** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా సహాయ కార్మిక కమిషనర్ జి. శ్రావణి ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీ డ్రైవ్ నిర్వహించడం జరిగింది. జూన్ 23న పోలీసు శాఖ సహకారంతో రంపచోడవరం మండలంలోని రంప, పెద్దగడ్డాడ, దేవీపట్నం గ్రామాలు, మారేడుమిల్లి మండలంలోని సున్నంపాడు, దేవరపల్లి గ్రామాలలో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు జి. సత్యనారాయణ, కె. లోవరాజు పాల్గొన్నారు.అదేవిధంగా జూన్ 24న రంపచోడవరం, మారేడుమిల్లి మండలాలలో మరో ప్రత్యేక తనిఖీ డ్రైవ్ నిర్వహించారు. తనిఖీల సందర్భంగా ఎక్కడా బాల కార్మికులు లేదా కిశోర కార్మికులు పనిచేస్తున్నట్లు గుర్తించలేదని సహాయ కార్మిక కమిషనర్ జి. శ్రావణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాల కార్మికుల గురించి సమాచారం తెలిసిన వారు 24 గంటల పాటు అందుబాటులో ఉండే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 కు సమాచారం అందించాలని ఆమె కోరారు. అదే విధంగా ఆయా మండల పరిధిలోని అధికారులకి సమాచారం అందించాలని, సమాచారం తెలియ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు.

# అద్భుతం అమోఘం సూర్య దేవుని దర్శనం మంత్రి: డోలా



**పెదపూడి.ప్రభాతవార్త** శ్రీ ఉసా,పద్మినీ, ఛాయా, సౌంజ్ఞ సమేత శ్రీ సూర్యనారాయణ స్వామివారి దర్శనం అద్భుతం, అమోఘం అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు.కాకినాడ జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి పెదపూడి మండలం గొల్లల మామిడాడ లో గల ప్రాచీన శ్రీ ఉషా,పద్మినీ, ఛాయా, సౌంజ్ఞ సమేత శ్రీ సూర్యనారాయణ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మ ,విష్ణు, మహేశ్వర స్వరూపమైన శ్రీ సూర్యనారాయణ స్వామి వారి దర్శనం అద్భుతం అమోఘమని అభివర్ణించారు. దేశంలోనే సూర్యదేవాలయాలు అరుదుగా కనిపిస్తాయని బ్రహ్మ,విష్ణు,మహేశ్వర స్వరూపమైన సూర్య దేవాలయాన్ని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతం అని రాష్ట్ర ప్రజలంతా అష్టైశ్వర్యాలు, సుఖశాంతులు, భోగభాగ్యాలతో తులతూగాలని ఆయన కోరుకున్నట్లే తెలిపారు. ఈయన వెంట అనపర్తి ఎంఎల్ఏ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సూర్యదేవుని ప్రత్యేక పూజలు లో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఆర్ నాగు, మల్లిడి శ్రీనివాసరెడ్డి,తమలంపూడి శివరామరెడ్డి, కర్రి సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## శ్రీదేవి భూదేవి సమేత శ్రీ జనార్ధన స్వామి ఆలయంలో గాలి గోపురం శంకుస్థాపన .



**అనపర్తి జూన్ 24(ప్రభార్థవార్త)** అనపర్తి లో శ్రీ దేవి భూదేవి సమేత శ్రీ జనార్ధన స్వామి ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థానశ్రీ ,శ్రీవాణి ట్రస్ట్ నిధులతో నిర్మించిన గాలిగోపురం కలశస్థాపన మరియు కళ్యాణ మండపాన్నిఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి.మహాలక్ష్మి దంపతులు శంకుస్థాపన చేశారుఈ కార్యక్రమంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ జనార్దన స్వామి (విష్ణులాయం) ఆలయ కమిటీ ఛైర్మన్,కమిటీ సభ్యులు,అనపర్తి మండలం,టౌన్ కూటమి నాయకులు పాల్గొన్నారు.

# మహిళల రక్షణ పై అవగాహన సదస్సు నిర్వహించిన ఎస్.ఐ




**రంపచోడవరం. జూన్ 24 .ప్రభాతవార్త.** పోలవరం జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాల మేరకు రంపచోడవరం ఎస్డిపిఓ సూచనలతో బుధవారం రంపచోడవరం అంబేద్కర్ సెంటర్ వద్ద ఎస్ ఐ రమేష్ మహిళలు బాలికల రక్షణ కొరకు అవేర్నెస్ కార్యక్రమం నిర్వహించారు. మహిళలు అందరూ శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకోవాలని ఆపద సమయంలో ఇది బాగా ఉపయోగపడుతుందని తెలియజేశారు. అలాగే గుడ్ టచ్ బాడ్ టచ్, సైబర్ నేరాలు గంజాయి వంటి మత్తు పదార్థాలు వలన జరిగే అనర్థాలు వివరించి తెలియజేశారు. అలాగే అమ్మాయిలు వారి వ్యక్తిగత విషయాలలో జాగ్రత్తగా ఉండాలని ఆడపిల్లల పై జరుగుతున్న అత్యాచారాలు లైంగిక దాడులు నుండి ఎలా కాపాడుకోవాలో వివరించారు. ముఖ్యంగా సెల్ ఫోన్లు ఫేస్ బుక్, ఇన్స్టాగ్రామ్, యూట్యూబ్ తదితర సామాజిక మాధ్యమాలు విషయంలో మహిళలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఎవరైనా కొత్త వ్యక్తులు పరిచయం చేసుకుని స్నేహం పేరుతో దగ్గర పడటానికి ప్రయత్నిస్తారని అటువంటి వ్యక్తుల పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. మీ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వెంటనే పోలీసులను ఆశ్రయించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

# రెండో రోజు కొనసాగిన ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా



**రావులపాలెం, జూన్ 24 (ప్రభాతవార్త) :** ఏపీఎస్ఆర్టీసీ రావులపాలెం డిపోలో ఆర్టీసీ యూనియన్ల జేఏసీ ఆధ్వర్యంలో రెండో రోజు కూడా ధర్నా, గేట్ మీటింగ్ నిర్వహించారు. ఏపీపీటిడి రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు బుధవారం భోజన విరామ సమయంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో డిపోకు చెందిన ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. జేఏసీ కన్వీనర్లు బి. ఏసేపు, జి.పి. రావు, ఎస్. సుదర్శన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఉద్యోగుల సమస్యలు, డిమాండ్లపై చర్చించారు. విద్యుత్ బస్సులను ప్రభుత్వమే నిర్వహించాలని, డిపోలను ఖాళీ చేయించే విధానాలను విరమించుకోవాలని, స్త్రీ శక్తి పథకంలో భాగంగా 4 వేల కొత్త బస్సులను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. అలాగే సంస్థలో ఖాళీగా ఉన్న సుమారు 10 వేల పోస్టులను భర్తీ చేయాలని, స్త్రీ శక్తి పథకం అమలులో సిబ్బందికి ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. పీఆర్సీ పే కమిటీ ఏర్పాటు చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు, 11వ పీఆర్సీ ఎరియర్స్ చెల్లించాలని, ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిపో సీనియర్ నాయకులు ఆర్.ఎస్. రావు, గంగాధర్ రావు, ఏ.ఎస్. నారాయణ, ఉద్యోగులు పాల్గొన్నారు.

# "సర్" ప్రక్రియలో బిఎల్వోలు బిఎల్ఏ లు..



**అంబాజీపేట,జూన్ 24, (ప్రభాతవార్త):**కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో బిఎల్వోలు బిఎల్ఏలు పాల్గొని ఇంటింటికి తిరుగుతూ ఓటర్లకు సంబంధించిన ఫామ్ లను అందజేశారు. బూత్ లెవెల్ అధికారులు అడిగిన సమాచారం, ధ్రువీకరణ పత్రాలను అందజేయాలని తెలిపారు. మండలంలోని మాచవరం గ్రామపంచాయతీ పరిధిలో 111, 112 పోలింగ్ బూత్ లలో బిఎల్వో వి.రమేష్,వార్డుల బిఎల్ఏ లు ఓటర్ల లిస్టు క్షుణ్ణంగా పరిశీలించి ఓటర్లకు అవగాహన కల్పించారు.

# కేంద్రీయ విద్యాలయ నూతన ప్రిన్సిపాల్‌గా బాబు రాజేంద్రప్రసాద్



**కాకినాడ రూరల్, జూన్ 24(ప్రభాతవార్త):** పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం, కాకినాడ నూతన ప్రిన్సిపాల్‌గా డాక్టర్ కె.వి. బాబు రాజేంద్రప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన తెనాలి పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం నుండి బదిలీపై కాకినాడకు వచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయాల్లో విద్యా ప్రమాణాలను మరింత పెంపొందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. నాణ్యమైన విద్య, ఆధునిక బోధనా విధానాలు, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ పాఠశాల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు తెలిపారు.

# ఫిషింగ్ హార్బర్ను మత్స్య అధికారులు తనిఖీ....



**సఖినేటిపల్లి జూన్ 24, ప్రభాత వార్త:** డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది పల్లిపాలెం మినీ ఫిషింగ్ హార్బర్ ను మత్స్యకార అధికారులు తనిఖీ చేశారు. పి 4 లో కొనసాగుతున్న హార్బర్ లో ఉన్న లోపాలు, వాటర్ ట్యాంకు, షాపులకు విద్యుత్ మీటర్లు, వెంటనే వేయాలని, హార్బర్ కు బోట్లు వచ్చే సమయం, నిల్వ ఉండే బోట్లు గూర్చి అడిగి తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో డి డి ఎఫ్ కే కారుణారావు, ఎడీఎఫ్ వి రామారావు, ఎఫ్డీఓ గోపాల కృష్ణ, తిరుమాని ఆచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

# వీధి కుక్కల్ని నియంత్రించడంలో మున్సిపల్ శాఖ వైఫల్యం

## -- జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన బిజెపి నేతలు



**కాకినాడ రూరల్, జూన్ 24 (ప్రభాతవార్త ):** కాకినాడ నగరంలో వీధి కుక్కలు నియంత్రించడంలో కాకినాడ మున్సిపల్ శాఖా అధికారులు పూర్తిగా వైఫల్యం చెందారని భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ ఎనిమిరెడ్డి మాలకొండయ్య, దువ్వూరి సుబ్రహ్మణ్యం కాకినాడ మున్సిపల్ ప్రత్యేక అధికారి దృష్టికి తీసుకెళ్లడం బుధవారం జిల్లా కలెక్టర్ కు మున్సిపల్ కార్పొరేషన్ ప్రత్యేక అధికారి కి ఫిర్యాదు చేశారు.కుక్కలను వీధుల్లో తిరగనివ్వరాదని, వీధి కుక్కలకు శాశ్వత షెల్టర్ హోమ్స్ నిర్మించి వీధి కుక్కలను వాటికి తరలించి ఆహారం నీరు అందించాలని సుప్రీంకోర్టు స్పష్టంగా ఆదేశించినప్పటికీ మున్సిపల్ అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని తక్షణమే చర్యలు చేపట్టి వీధి కుక్కల బారి నుండి ప్రజలను కాపాడాలని కోరారు.

# రాజోలు పరిసర ప్రాంతాల్లో 5 రోజుల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం

## -కొత్తపేట విద్యుత్ శాఖ ఇ ఇ రాంబాబు



**కొత్తపేట, జూన్ 24, (ప్రభాతవార్త)** అరవపాలెం వద్ద 132 కె వి నెట్‌వర్క్ బలోపేతం పనుల కారణంగా రాజోలు దాని పరిసర ప్రాంతాల్లో జూన్ 25 వ తేదీ నుండి 30వ తేదీ వరకు విద్యుత్ సరఫరాలో తాత్కాలిక అంతరాయం ఏర్పడనుందని కొత్తపేట విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కొత్తపల్లి రాంబాబు తెలిపారు 132 కె వి అమలాపురం రాజోలు లైన్ బలోపేతం పనులను జూన్ 25 ఉదయం 6 గంటల నుండి జూన్ 30 సాయంత్రం 6 గంటల వరకు చేపట్టనున్నారన్నారు ఈ పనుల వ్యవధిలో 132 కె వి రాజోలు సబ్‌స్టేషన్‌కు నరసాపురం నుండి ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా అందుబాటులో ఉంచుతామని అధికారులు తెలిపారుప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలినరసాపురం నుండి సరఫరా ఉన్నప్పటికీ పనుల సమయంలో ఏవైనా అత్యవసర విద్యుత్ కోతలు విధించవలసి వస్తే ప్రజలు సహకరించాలని కొత్తపేట విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కొత్తపల్లి రాంబాబు ఒక ప్రకటనలో కోరారు ఈ ఐదు రోజుల వ్యవధిలో విద్యుత్ అంతరాయం వల్ల కలిగే అసౌకర్యానికి చింతిస్తున్నామని ప్రజలు ముందుగానే అప్రమత్తమై తమ అవసరాలకు తగినట్లుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఇన్వర్టర్లు జనరేటర్లు తగినంత నీటి నిల్వ చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు ?పనుల ప్రారంభం 25 జూన్ 2026 ఉదయం 6 గంటలకుపనుల ముగింపు 30 జూన్ 2026 సాయంత్రం 6 గంటల వరకు రాజోలు పరిసర ప్రాంతాలలో విద్యుత్ అసౌకర్యం ఏర్పడవచ్చునని ఆయన తెలిపారు

# హసనబాదలో శ్యామప్రసాద్ ముఖర్జీ వర్ధంతి..



**రామచంద్రపురం జూన్ 24 (ప్రభాతవార్త):** రామచంద్రపురం మండలం హసనబాద గ్రామంలో జనసంఘ్ స్థాపకులు డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు.మన ఊరు మన జెండా బిజెపి స్థూపం వద్ద మండల బిజెపి అధ్యక్షుడు ఆకేటి శ్రీకృష్ణ,కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి నాగిరెడ్డి సతీష్ రావు ఆధ్వర్యంలో ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా సతీష్ రావు మాట్లాడుతూ..భారత ఏకత్వం జాతీయ సమగ్రత కోసం ముఖర్జీ చేసిన త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమన్నారు.పార్టీ ఆదేశాల మేరకు రూరల్ పరిధిలోని ప్రతి బూత్లోను ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో కిసాన్ మోర్చా గ్రామ అధ్యక్ష,ఉపాధ్యక్షులు చోడిశెట్టి దశరథ రామారావు,భలే బాబురావు మరియు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు...

# ప్రజాదరణ కలిగిన నాయకుడు జగన్.



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూన్24,ప్రభాతవార్త.** మాజీ ముఖ్యమంత్రి,వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి అమిత ప్రజాదరణ పొందిన నాయకుడని అటువంటి నాయకుడిని కాకినాడ రూరల్ జనసేన ఎంఎల్ఏ పంతం నానాజీ నోటికొచ్చినట్టు ఇస్తానుసారంగా మాట్లాడడం తగదని అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ సీనియర్ వైసిపి నాయకుడు కుంచే రమణారావు అన్నారు. బుధవారం స్థానిక విలేకరులతో రమణారావు మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం మూలన పడిందని ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడం చేతకాక అందుకే ఇటువంటి డైవర్షన్ పాలిటిక్స్ కు తెర లేపుతున్నారని విమర్శించారు.రాష్ట్ర ప్రజల గుండెల్లో స్థానం సంపాదించుకున్న ఒక ఉన్నతమైన ప్రజా నాయకుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి పై పంతం నానాజీ చేసిన అనుచిత వ్యాఖ్యలు వెనక్కు తీసుకుని క్షమాపణలు చెప్పాలని రమణారావు డిమాండ్ చేశారు.



తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం. డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ

తెలుగు జాతీయ దినపత్రిక వార్త

# జొన్నాడ ఫ్లైఓవర్ పనులు వేగవంతం చేయాలి: బీజేపీ ఎస్సీ మోర్చా



**ఆలమూరు, జూన్ 24, (ప్రభాతవార్త)**అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడ జాతీయ రహదారిపై నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్ పనులను వేగవంతం చేసి ప్రజలకు అసౌకర్యం కలగకుండా త్వరగా పూర్తి చేయాలని జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు పొనుగుపాటి శ్రీనివాస్ కోరారు. ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో 12 ఏళ్ల అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన "ప్రగతి పాదయాత్ర" సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. బీజేపి ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, జాతీయ కౌన్సిల్ సభ్యుడు మానేపల్లి అయ్యాజి వేమ, ఎస్సి మోర్చ నాయకులు పాల్గొన్నారు.

# మార్కెట్ కమిటీల్లో ఈ-పర్మిట్ తప్పనిసరి

## -డిస్ట్రిక్ట్ అగ్రి ట్రేడ్ అండ్ మార్కెటింగ్ అధికారిణి విశాలాక్షి



**ఆలమూరు, జూన్ 24, (ప్రభాతవార్త)**వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో వ్యవసాయ,వాణిజ్య పంటల రవాణా కోసం జూలై నుంచి ఈ-పర్మిట్ విధానం అమలు కానున్నదని డాక్టర్ బి.ఆర్ .అంబేద్కర్ కోనసీమ జిల్లా డిస్ట్రిక్ట్ అగ్రి ట్రేడ్ అండ్ మార్కెటింగ్ శాఖ అధికారిణి కె ఎస్వీ విశాలాక్షి తెలిపారు. మండలంలోని ఆలమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో కార్యదర్శి వి పైడేశ్వరరావు, రామచంద్రపురం కార్యదర్శి పి వాసుదేవరావుల ఆధ్వర్యంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఆన్లైన్ ఈ పర్మిట్ అవగాహన పై సదస్సు నిర్వహించారు. అనంతరం అధికారులు ఏ.ఎం.సి. పరిధిలో వ్యాపారము చేసుకొనుటకు గాను లైసెన్సు పొందిన ట్రేడర్స్ లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రేడర్స్ ప్రస్తుతం "మార్కెట్ రుసుము" ను నగదు రూపంలో కార్యాలయమలోను, చెక్ పోస్టు లోను చెల్లించి రసీదు తీసుకొని, వారి సరుకులను రవాణా చేసుకోనేవారని, కానీ జూలై నుంచి ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు లైసెన్స్ ట్రేడర్స్ అందరూ వారి సరుకు రవాణా కొరకు వారి యొక్క యూజర్ ఐడి, పాస్వర్డ్ తో ఆన్లైన్ లో లాగిన్ అయ్యి,నమోదు చేసి మార్కెట్ రుసుము ను ఆన్ లైన్ లోనే చెల్లించి పర్మిట్ ను ఫోన్ మేసేజ్ ద్వారా సరుకును నిరభ్యంతరంగా రవాణా చేసుకోవచ్చునని తెలియజేసారు. జూలై 01 నుండి ఎట్టి పరిస్థితి లలోను నగదు రహిత చెల్లింపు విధానం ఇక పై అంతా ఆన్లైన్ పేమెంట్ మాత్రమే ఉంటుందన్నారు.ఈ సమావేశం లో ట్రేడర్స్ అందరి సందేహాలను నివృత్తి చేసారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వైట్ల కనక దుర్గారావు తో పాటు మండల రైస్ మిల్లర్స్ యాజమానులు, గుమాస్తా లు పాల్గొన్నారు.

# వాకర్ల సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించిన ఎమ్మెల్యే వనమాడి కొండబాబు:



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి జూన్ 24 (ప్రభాత వార్త )** కాకినాడ నగర ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించే రాజా ట్యాంక్ పార్కులో నెలకొన్న సమస్యలను పరిష్కరించి మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు తెలిపారు. రాజా ట్యాంక్ పరిసరాల్లో వాకర్లు, సందర్శకులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకునేందుకు ఆయన బుధవారం ఉదయం ఆకస్మికంగా పర్యటించి అధికారులతో కలిసి పరిస్థితిని పరిశీలించారు.రాజా ట్యాంక్‌కు చేరుకున్న ఎమ్మెల్యేకు వాకర్స్ గ్రూప్ ప్రతినిధులు, స్థానికులు స్వాగతం పలికారు. అనంతరం వాకర్లు తమ సమస్యలను ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్‌వీబీ సత్యనారాయణ దృష్టికి తీసుకువచ్చారు. చెరువులోని నీరు పచ్చటి రంగులోకి మారి దుర్వాసన వెదజల్లుతోందని, దీంతో పర్యావరణ కాలుష్యంతో పాటు ప్రజలకు అసౌకర్యం కలుగుతోందని వారు తెలిపారు. చెరువులో నీటి నాణ్యతను మెరుగుపరిచేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే రాజా ట్యాంక్ చుట్టూ ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్ అనేక చోట్ల దెబ్బతిని వాకర్లకు ఇబ్బందులు కలిగిస్తోందని పేర్కొన్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో పెద్ద సంఖ్యలో ప్రజలు వాకింగ్‌కు వచ్చే నేపథ్యంలో ట్రాక్‌ను మరమ్మతు చేసి సురక్షితంగా తీర్చిదిద్దాలని విజ్ఞప్తి చేశారు.పార్కులో పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఆట పరికరాలు తుప్పుపట్టి ప్రమాదకరంగా మారాయని, వాటిని వెంటనే మరమ్మతు చేయాలని లేదా కొత్త పరికరాలతో భర్తీ చేయాలని వాకర్లు కోరారు. అదేవిధంగా పవాకర్లు ప్రస్తావించిన ప్రతి సమస్యను ఎమ్మెల్యే క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులతో చర్చించారు. ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాట్లాడుతూ రాజా ట్యాంక్ నగర ప్రజలకు ఒక ముఖ్యమైన విశ్రాంతి ఆరోగ్య కేంద్రంగా మారిందన్నారు ప్రతిరోజు వందలాదిమంది వాకింగ్ వ్యాయామం వినోదం కోసం ఇక్కడికి వస్తున్నందున ప్రజా సౌకర్యాలు నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు ప్రజల భద్రత సౌకర్యాలకు భంగం కలిగించే సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు.ఈ సందర్భంగా కమిషనర్ ఎన్‌వీబీ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజలు, వాకర్లు తెలియజేసిన సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని దశల వారీగా పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు.ఈ పర్యటనలో కార్పొరేషన్ ఎస్ఈ పి. వెంకట్రావు, వాటర్ వర్క్స్ డీఈ లక్ష్మీనారాయణ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీ చరణ్, శానిటేషన్ సూపర్వైజర్ నాయుడు, వాకర్స్ ప్రతినిధులు గ్రంధి నారాయణరావు, నేమాని సత్యనారాయణ, కోడూరు కుమారస్వామి, ముత్యాల రాణి, తదితరులు పాల్గొన్నారు.

# జగ్గంపేటలో ఎస్ ఆర్ టి జ్యువెలర్స్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే



**జ్యోతుల నెహ్రూ: జగ్గంపేట, జూన్ 24( ప్రభాతవార్త )**జగ్గంపేట గోకవరం రోడ్డులో శ్రీ రావులమ్మతల్లి ఆశీస్సులతో నూతనంగా ఏర్పాటైన ఎస్ ఆర్ టి జ్యువెలర్స్ ప్రారంభోత్సవం బుధవారం ఉదయం 7:30 గంటలకు అట్టహాసంగా జరిగింది. జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ ముఖ్య అతిథిగా హాజరై షాపును ప్రారంభించారు.ఎస్ ఆర్ టి జ్యువెలర్స్ అధినేత పొట్టి రాజేష్ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు.వ్యాపార అభివృద్ధిలో భాగంగా విచ్చేసిన ప్రముఖులు, శ్రేయోభిలాషుల సమక్షంలో కార్యక్రమం ఉత్సాహంగా సాగింది.వెండి, బంగారు నగల వ్యాపారంలో నాణ్యత, నమ్మకానికి ప్రాధాన్యత ఇస్తామని నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ శ్రీ రావులమ్మతల్లి జ్యువెలర్స్ దినదినాభివృద్ధి చెందాలి. జగ్గంపేట ప్రజలకు నాణ్యమైన బంగారు ఆభరణాలు అందుబాటు ధరల్లో లభించడం శుభపరిణామం. అధినేత పొట్టి రాజేష్ కు నా దీవెనలు" అని అభినందించారు.ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జీనుమణి బాబు, అన్నవరం దేవస్థానం రిటైర్డ్ పిఆర్ఓ తులా రాము, టౌన్ టిడిపి అధ్యక్షులు పాండ్రంగి రాంబాబు, మండపాక అప్పన్న దొర, పీలా మహేష్, నలమాటి ఆనంద్, చెలికాని హరి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps